ప్రకటన కర్తలకు,పాఠకులకు, తెలుగు ప్రజలకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పెన్‌పవర్ వారి
11వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | PEN POWER TELUGU DAILY | ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 1 సంచిక : 48 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : హైదరాబాద్ మంగళవారం 30 డిసెంబర్ 2025 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 48 PAGES : 12 EDITOR : G A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : HYDERABAD TUE 30 DECEMBER 2025 PRICE : 1/- RS

Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur


## ఒకేసారి 52 ఉపగ్రహాలను ప్రయోగించిన రష్యా

- నింగిలోకి దూసుకెళ్లిన సోయుజ్-2.1ఎ రాకెట్
- యూఏఈ కోసం ప్రత్యేక విద్యా ఉపగ్రహం ప్రయోగం
- భూమిని పర్యవేక్షించేందుకు రెండు కీలక శాటిలైట్లు
- నౌకల కదలికలను గుర్తించేందుకు వ్యవస్థ విస్తరణ



హైదరాబాద్ పెన్ పవర్: రష్యా అంతరిక్ష పరిశోధన సంస్థ మరో భారీ ప్రయో గాన్ని విజయవంతంగా పూర్తి చేసింది. సోమవారం వోస్టోక్నీ కాస్మోడ్రోమ్ నుంచి సోయుజ్-2.1ఎ వాహకనౌక ద్వారా ఒకేసారి 52 ఉపగ్రహాలను విజయవంతంగా

వివరాలు 2లో..





# అధ్యక్షా ఐదు రోజులే..!

## కృష్ణా జలాలే లక్ష్యంగా అసెంబ్లీ

- ప్రారంభమైన తెలంగాణ అసెంబ్లీ.. హాజరైన విపక్ష నేత కేసీఆర్
- విపక్ష నేత హోదాలో సభకు హాజరైన కేసీఆర్
- ప్రజల సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తామన్న బీఆర్ఎస్
- అసెంబ్లీ ముట్టడికి యత్నించిన మాజీ సర్పంచ్‌ల అరెస్ట్
- సభ చుట్టూ వెయ్యి మంది పోలీసులతో భారీ బందోబస్తు

హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణ శాసనసభ సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఓవైపు ప్రతిపక్ష బీఆర్ఎస్ పూర్తిస్థాయిలో సభకు హాజరుకాగా, మరోవైపు మాజీ సర్పంచ్‌లు అసెంబ్లీ ముట్టడికి యత్నించడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. విపక్ష నేతగా కేసీఆర్‌తో పాటు కేటీఆర్, హరీశ్‌రావు తదితర బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సభకు హాజరయ్యారు.సమావేశాలు ప్రారంభమైన వెంటనే దివంగత రాంరెడ్డి దామోదర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొండా లక్ష్మారెడ్డికి సభ సంతాపం ప్రకటించింది. అనంతరం సభను వాయిదా వేశారు. అయితే, సాగునీటి ప్రాజెక్టులు, ప్రజా సమస్యలే ప్రధాన ఎజెండాగా ప్రభుత్వాన్ని నిలదీసేందుకు బీఆర్ఎస్ సిద్ధమైంది.ఇదే సమయంలో తమకు రావలసిన పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలంటూ

వివరాలు 2లో..

## అసెంబ్లీలో కేసీఆర్ తో రేవంత్ రెడ్డి కరచాలనం..

- కేసీఆర్ వద్దకు వెళ్లి పలకరించిన ముఖ్యమంత్రి
- ఆరోగ్యం గురించి వాకబు చేసిన రేవంత్
- రెండు నిమిషాలు సభలో ఉండి వెళ్లిపోయిన కేసీఆర్



హైదరాబాద్ పెన్ పవర్: తెలంగాణ అసెంబ్లీ సమావేశాలలో ఆసక్తికర సంఘటన చోటుచేసుకుంది. విపక్ష నేత హోదాలో అసెంబ్లీకి వచ్చిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తో సీఎం రేవంత్ రెడ్డి కరచాలనం చేశారు. సభలో

వివరాలు 2లో..

## సమయం సరిపోదు... 15 రోజులు కావాలి

- బీఏసీ సమావేశానికి హాజరైన హరీశ్ రావు
- రాష్ట్రంలో ఎన్నో సమస్యలు ఉన్నాయని వ్యాఖ్య
- వారం రోజుల్లో అన్ని సమస్యలపై చర్చించడం సాధ్యం కాదన్న హరీశ్
- అసెంబ్లీ సమావేశాలు ఎక్కువ రోజులు జరపాలని సూచన



హైదరాబాద్ పెన్ పవర్: తెలంగాణ శాసనసభ శీతాకాల సమావేశాల బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బీఏసీ) సమావేశం ముగిసింది. ఈ సమావేశంలో ప్రతిపక్ష బీఆర్ఎస్ తరపున మాజీ మంత్రి హరీశ్ రావు హాజరయ్యారు. సభ నిర్వహణపై ప్రభుత్వం ముందు ఆయన పలు కీలక డిమాండ్లు ఉంచారు. ముఖ్యంగా ప్రజల సమస్యలను విస్తృతంగా చర్చించాలంటే అసెంబ్లీ సమావేశాలు ఎక్కువ రోజుల పాటు జరగాల్సిందేనని ఆయన అన్నారు.బీఏసీ సమావేశం అనంతరం హరీశ్ రావు మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్రంలో ప్రస్తుతం అనేక ప్రజా సమస్యలు ఉన్నాయని, వాటన్నింటినీ సమగ్రంగా చర్చించాలంటే కనీసం 15 రోజుల పాటు అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాల్సిందేనని బీఆర్ఎస్ డిమాండ్ చేసిందన్నారు. కేవలం వారం రోజుల్లోనే అన్ని అంశాలపై చర్చించడం సాధ్యం కాదని ఆయన స్పష్టం చేశారు. ప్రజా సమస్యలను పక్కన పెట్టి మూడు లేదా నాలుగు రోజుల్లో సభను ముగించడం

వివరాలు 2లో..

## పాకిస్థాన్ లో కొత్త టెర్రరిస్ట్ లీడర్..

### హఫీజ్, మసూద్ పనికిరారని భావిస్తున్న పాక్ ప్రభుత్వం

- ముఖాలు మార్చుకుంటున్న పాకిస్థాన్ టెర్రరిజం
- తెరపైకి కొత్త ఉగ్ర నేత యాకూబ్ షేక్
- యాకూబ్ ను 2012లోనే ఉగ్రవాదిగా గుర్తించిన అమెరికా



హైదరాబాద్ పెన్ పవర్: భారత్‌పై ఉగ్రదాడుల పన్నాగాలకు వేదికగా మారిన పాకిస్థాన్... పేర్లు మారుస్తూ, ముఖాలు మార్చుకుం టూ ఉగ్రవాదాన్ని కొనసాగిస్తూనే ఉంది.'ఆపరేషన్ సిందూర్' తర్వాత పరిస్థితులు కొంత మారినట్టు కనిపించినా, వాస్తవం మాత్రం మరోలా ఉంది. ఒకప్పుడు భారత్‌కు మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్టులుగా ఉన్న హఫీజ్ సయీద్, మసూద్ అజార్ వంటి వాళ్లు ఒక్కసారిగా

వివరాలు 2లో..

### పాక్ ఆర్మీపై బలూచిస్థాన్ సాయుధుల మెరుపుదాడులు...

## 15 మంది సైనికుల మృతి


- బలూచిస్థాన్‌లో భీకర దాడులు
- పలు ప్రాంతాల్లో సైనిక స్థావరాలే లక్ష్యం
- దాడులకు బాధ్యత వహించిన బీఎల్‌ఏ, బీఎల్ఎఫ్, బీఆర్‌జీ సంస్థలు
- సీపెక్ మార్గంలో సైనిక వాహనంపై రిమోట్ కంట్రోల్ బాంబు దాడి
- బలూచిస్థాన్ స్వాతంత్ర్యం కోసమే దాడులని ప్రకటించిన బలోచ్ గ్రూపులు



వివరాలు 2లో..

## బంగ్లాదేశ చొరబాటుదారులు దేశంలో ఎక్కడున్నా పంపించేస్తాం

- అసోంలో నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడిన అమిత్ షా
- బంగ్లాదేశీయులు ఇక్కడి వారిపై బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆగ్రహం
- అలాంటి వారిని కాంగ్రెస్ పార్టీ ఓటు బ్యాంకుగా భావిస్తోందని ఆరోపణ



హైదరాబాద్ పెన్ పవర్: భారతదేశంలో ఎక్కడ ఉన్నా బంగ్లాదేశ్ చొరబా టుదారులను వెనక్కి పంపిస్తామని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. అసోంలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, సరిహద్దులు దాటి రాష్ట్రంలోకి చొరబడిన బంగ్లాదేశీయులు ఇక్కడి ప్రజల

వివరాలు 2లో..

## 'పాత బాస్' కోసమే రేవంత్ రెడ్డి ఆ ప్రాజెక్టును నిలిపివేశారు

- పాత బాస్ చంద్రబాబును మెప్పించడానికే పాలమూరు ప్రాజెక్టును ఆపారన్న కేటీఆర్
- కేసీఆర్‌కు పేరు వస్తుందన్న భయంతో రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్నారని ఆరోపణ
- ఆర్థిక ప్రయోజనాల కోసమే జీహెచ్ఎంసీ విభజనకు కుట్ర అంటూ ఫైరర్
- ప్రతిపక్ష నేతల ఫోన్లు ట్యాప్ కావడం లేదని సీఎం చెప్పగలరా అని ప్రశ్న
- కాంగ్రెస్ ప్రభుత్వంపై సర్పంచ్ ఎన్నికలే ప్రజా తీర్పు అని ఉద్ఘాటన



హైదరాబాద్ పెన్ పవర్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన 'పాత బాస్', ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబును ప్రసన్నం చేసుకునేందుకే పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని నిలిపివేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే మాజీ సీఎం కేసీఆర్‌కు మంచి పేరు వస్తుందనే భయంతో పాటు, చంద్రబాబుకు

వివరాలు 2లో..

### 14 ఏళ్ల తర్వాత హంతకుడికి

## మరణశిక్ష విధించిన కోర్టు

- మహిళ హత్య కేసు.. కూకట్‌పల్లి కోర్టు సంచలన తీర్పు
- 2011లో జరిగిన హత్య కేసులో తీర్పు వెలువరించిన కోర్టు
- నిందితుడు కరణ్ సింగ్‌కు మరణశిక్ష విధించిన కోర్టు
- 14 ఏళ్ల తర్వాత నిందితుడికి శిక్ష ఖరారు



హైదరాబాద్ పెన్ పవర్: హైదరాబాద్‌లో జరిగిన ఒక హత్య కేసులో కూకట్‌పల్లి కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ఈ కేసులోని నిందితుడికి మరణశిక్ష విధిస్తూ తీర్పు చెప్పింది.

వివరాలు 2లో..

## ఐబొమ్మ రవి కేసులో వెలుగులోకి వచ్చిన మరో కోణం!

- ఐబొమ్మ రవి కేసులో దర్యాప్తు మరింత ముమ్మరం
- ప్రహ్లాద్ అనే వ్యక్తి డాక్యుమెంట్లను ఫోర్జరీ చేసిన రవి
- బెంగళూరులో ఉన్న ప్రహ్లాద్‌ను పిలిపించి విచారించిన పోలీసులు






హైదరాబాద్ పెన్ పవర్: సినీ పరిశ్ర మను కుదిపేసిన ఐబొమ్మ పైరసీ వెబ్‌సైట్ కేసులో దర్యాప్తు రోజురో జుకూ మరింత లోతుగా వెళ్తోంది. ఐబొమ్మ నిర్వాహ కుడు

వివరాలు 2లో..

### అమెరికా రోడ్డు ప్రమాదంలో ఇద్దరు

## తెలంగాణ యువతుల మృతి

- కాలిఫోర్నియా రాష్ట్రంలో ఘోర రోడ్డు ప్రమాదం
- కడియాల భావన, పుల్లఖండు మేఘన దుర్మరణం
- మృతుల స్వస్థలం మహబూబ్ నగర్ జిల్లా గార్ల మండలం






హైదరాబాద్ పెన్ పవర్: అమెరి కాలో ఘోర విషా దం చోటు చేసుకుంది. కాలి ఫో ర్నియా రాష్ట్రంలో జరిగి న రోడ్డు ప్రమాదంలో తెలం గా ణకు చెందిన ఇద్దరు యువ తులు దుర్మరణం చెందారు.

వివరాలు 2లో..

## రిటైర్మెంట్ హోమ్ లో మంటలు.. ఇండోనేసియాలో 16 మంది వృద్ధుల మృతి

- మరో 15 మందిని కాపాడిన అగ్నిమాపక సిబ్బంది
- బాధితులకు మనాడోలోని వివిధ ఆసుపత్రుల్లో చికిత్స
- నార్త్ సులవేసి ప్రావిన్స్ లో విషాదం



హైదరాబాద్ పెన్ పవర్: ఇండోనేషియాలో విషాదకర సంఘటన చోటు చేసుకుంది. నార్త్ సులవేసి ప్రావిన్స్ లోని ఓ రిటైర్మెంట్ హోమ్ లో అగ్నిప్రమాదం జరిగింది. ఆదివారం రాత్రి అకస్మాత్తుగా మంటలు ఎగిసిపడడంతో 16 మంది వృద్ధులు సజీవదహనమ య్యారు. సోమవారం నార్త్ సులవేసి పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. మనాడోలోని ఓ రిటైర్మెంట్ హోమ్ లో ఆదివారం రాత్రి మంటలు ఎగిసిపడ్డాయి.

వివరాలు 2లో..

# 'పాత బాస్' కోసమే రేవంత్ రెడ్డి ఆ ప్రాజెక్టును నిలిపివేశారు

- మొదటి పేజి తరువాయి
ఆగ్రహం కలుగుతుందనే ఉద్దేశంతోనే రేవంత్ రెడ్డి పనులను ముందుకు సాగనీయడం లేదని ఆయన విమర్శించారు.సోమవారం అసెంబ్లీ ప్రాంగణంలో మీడియాతో మాట్లాడిన కేటీఆర్, పాలమూరు ప్రాజెక్టుకు కేవలం 45 టీఎంసీల కేటాయింపులను అంగీకరించడం రాష్ట్రానికి నష్టదాయకమని అన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వమే కృష్ణా జలాల్లో 299 టీఎంసీలకు అంగీకరించిందని, దాని ఆధారంగానే బీఆర్ఎస్ ప్రభుత్వం కేటాయింపులు పెంచాలని కేంద్రాన్ని కోరిందని గుర్తుచేశారు. కేసీఆర్ చిత్తశుద్ధి వల్లే కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తయిందని, దానిపై ఎన్ని విచారణలు జరిపినా రాజకీయంగా తమకు నష్టం లేదని, నీళ్లు ఇచ్చిందెవరో ప్రజలకు తెలుసని అన్నారు.ఆర్థిక ప్రయోజనాల కోసమే, మర్చంట్ బ్యాంకర్లు, బ్రోకర్ల సలహాతో జీహెచ్ఎంసీని మూడు భాగాలుగా విభజించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని కేటీఆర్ ఆరోపించారు. ఈ చర్యలను తీవ్రంగా వ్యతిరేకిస్తామని, అసెంబ్లీలో చర్చిస్తామని హెచ్చరించారు. ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలపై స్పందిస్తూ, నిఘా వ్యవస్థలు నెహ్రూ కాలం నుంచి ఉన్నాయని, ప్రస్తుతం ప్రతిపక్ష నేతల ఫోన్లు ట్యాప్ కావడం లేదని సీఎం కచ్చితంగా చెప్పగలరా అని ప్రశ్నించారు.సిట్‌లు,
విచారణల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల దృష్టిని మళ్లిస్తోందని కేటీఆర్ విమర్శించారు. ఇటీవలి సర్పంచ్ ఎన్నికల ఫలితాలే కాంగ్రెస్ పాలనపై ప్రజా తీర్పు అని, రెండేళ్లలోనే ప్రజలు ఆ ప్రభుత్వాన్ని తిరస్కరించారని ఆయన వ్యాఖ్యానించారు.

# ఎడిటర్ వ్యూ

## ఒంటరి మహిళలకు సాధికారత ఎప్పుడు

భారతీయ సమాజంలో భర్తను కోల్పోయిన మహిళలు, వివాహం కాని మహిళలు, విడాకులు పొందిన లేదా విడిపోయిన మహిళలు, వదిలివేయబడిన మహిళలను చారిత్రకంగా అశుభంగా భావించే దురాచారం బలంగా వేళ్లూనుకుంది. పితృస్వామ్య వ్యవస్థలో మహిళ సామాజిక గుర్తింపు ప్రధానంగా ఆమె వివాహ స్థితితోనే ముడిపడి ఉండటమే ఈ భావనకు మూలం. దీని ఫలితంగా ఒంటరి మహిళలు సామాజిక, ధార్మిక కార్యక్రమాల నుంచి బహిష్కరణకు గురవుతూ, వారి వేషధారణ, ప్రవర్తన, జీవనశైలిపై అనవసర ఆంక్షలు ఎదుర్కొంటున్నారు. సతీసహగమనం వంటి అమానవీయ ఆచారాలు నిషేధించబడినప్పటికీ, వివక్ష మాత్రం రోజువారీ జీవితంలో సూక్ష్మంగా కానీ బలంగా కొనసాగుతోంది. తెలంగాణ ప్రభుత్వం 2014లో నిర్వహించిన కుటుంబ సర్వే ప్రకారం, రాష్ట్రంలో సుమారు నాలుగు లక్షల మంది ఒంటరి మహిళలు ఉన్నారు. కొత్త పథకాల నిర్వచనాల ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లో 30 ఏళ్లు, పట్టణాల్లో 35 ఏళ్లు దాటిన వివాహం కాని మహిళలను కూడా కలిపితే ఈ సంఖ్య మరింత పెరుగుతుంది. అయినప్పటికీ, ఇది ప్రజా విధానాలు, అభివృద్ధి చర్చల్లో తరచూ నిర్లక్ష్యం చేయబడుతున్న పెద్ద సామాజిక వర్గం. ఒంటరి మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల మూలాలు పితృస్వామ్య సామాజిక నిర్మాణంలోనే ఉన్నాయి. మహిళ విలువను ఆమె భర్తతో ఉన్న సంబంధం ఆధారంగా కొలిచే పరిస్థితుల్లో, ఆ సంబంధానికి బయట ఉన్న మహిళలను సమాజం సాధారణానికి భిన్నంగా చూస్తుంది. దీని వల్ల వనరులపై హక్కులు తగ్గుతాయి, ఆస్తి, న్యాయ హక్కులు బలహీనపడతాయి. ఆర్థిక అసురక్షితత, సామాజిక ఒంటరితనం, మానసిక ఒత్తిడి ఒకదానికొకటి బలపరుస్తూ వీరి జీవితాలను మరింత సంక్లిష్టం చేస్తున్నాయి. వేగంగా అభివృద్ధి చెందుతున్న తెలంగాణ రాష్ట్ర చరిత్రలో, ఒంటరి మహిళలు ఇప్పటికీ వినిపించని స్వరాలుగానే ఉన్నారు. చాలామంది భద్రతలేని, తక్కువ జీతాల అసంఘటిత ఉపాధులకే పరిమితమవుతుండగా, కుటుంబ సంరక్షణ బాధ్యతలు మొత్తం వారి మీదే పడుతున్నాయి. స్థిర ఆదాయం లేకపోవడం వల్ల పేదరికం నుంచి బయటపడడం కష్టమవుతోంది.

అవసరమైన పత్రాలు, సరైన అవగాహన లేకపోవడం, సామాజిక వివక్ష, వారి తరఫున మాట్లాడే వ్యక్తి లేకపోవడం వంటి కారణాలతో పెన్షన్‌లు, ఆరోగ్య సేవలు, నివాస సదుపాయాలు వంటి ప్రభుత్వ ప్రాథమిక సంక్షేమ సేవలకే పొందడమనేది కూడా పెద్ద సవాలుగా మారుతోంది. ఒంటరి మహిళల గౌరవాన్ని కాపాడాలంటే కేవలం ఆర్థిక సహాయం సరిపోదు. సమాజపు దృక్పథంలో మార్పు రావలిసిన అవసరం ఉంది. ఈ వాస్తవాలను గుర్తించిన తెలంగాణ ప్రభుత్వం కొన్ని ముఖ్యమైన చర్యలు చేపట్టింది. 2025లో ఆసరా పథకం క్రింద ఒంటరి మహిళల పెన్షన్‌ను నెలకు రూ. 4,000కి పెంచింది. ఇది వారికి కీలక ఆదాయ సహాయంగా నిలుస్తోంది. అంతేకాకుండా, స్వావలంబనను ప్రోత్సహించే దిశగా ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజన ద్వారా అర్హులైన మైనారిటీ మహిళలకు ఒకసారి రూ. 50,000 ఆర్థిక సహాయం అందిస్తోంది. ఇది చిన్న వ్యాపారాలు, సూక్ష్మ ఉపాధులకు దోహదపడే చర్యగా మారింది. ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మహిళా స్వయం సహాయక సంఘాలు బలోపేతం అవుతూ, ఒంటరి మహిళలకు రుణాలు, నైపుణ్యాభివృద్ధి, ఆర్థిక అవగాహన, మార్కెట్ అనుసంధానాన్ని అందిస్తున్నాయి. ఆరోగ్య పథకాలు, పోషకాహార కార్యక్రమాలు, షీ- టీమ్ వంటి భద్రతా చర్యలు వారి గౌరవం, భద్రతపట్ల ప్రభుత్వ నిబద్ధతను చూపిస్తున్నాయి. అయితే పెన్షన్‌లు తాత్కాలిక ఉపశమనానికే పరిమితమవుతుండగా, అవగాహన లోపం, సామాజిక వివక్ష వల్ల చాలామంది లబ్ధి పొందలేకపోతున్నారు. చిన్న వ్యాపారాల స్థిరత్వానికి నిరంతర మార్గదర్శకత్వం, మార్కెట్ మద్దతు అవసరంబీ అలాగే ఒంటరి మహిళల మానసిక ఆరోగ్యానికి ఇంకా తగిన ప్రాధాన్యం లభించడం లేదు. ఒంటరి మహిళల సాధికారత అనేది కేవలం సంక్షేమ అంశం కాదుబీ అది అభివృద్ధికి కీలక అంశం. ఆర్థికంగా స్వతంత్రమైన మహిళ తన కుటుంబాన్ని ముందుకు తీసుకెళ్తుంది, పిల్లల భవిష్యత్తులో పెట్టుబడి పెడుతుంది, సమాజాన్ని బలోపేతం చేస్తుంది. ఆమె సాధికారత రాష్ట్ర ఆర్థిక, సామాజిక నిర్మాణంపై బహుళ ప్రభావాన్ని చూపుతుంది. సమగ్ర అభివృద్ధికి ఆదర్శంగా నిలవాలని ఆశిస్తున్న తెలంగాణ రాష్ట్రం, ఒంటరి మహిళల కోసం ప్రత్యేకమైన, సమగ్ర విధాన రూపకల్పన చేయాల్సిన అవసరం ఉంది. సామాజిక భద్రత, ఆర్థిక సాధికారత, న్యాయ పరిరక్షణ, కౌన్సెలింగ్ సేవలు, ఆరోగ్యం, విద్య, నైపుణ్యాభివృద్ధి, వివక్షను ఎదుర్కొనే చర్యలు అన్నీ ఒకే చట్రంలో ఉండాలి. చవకైన నివాసాలు, సురక్షిత ప్రజా స్థలాలు, అందుబాటులో ఉన్న న్యాయ సహాయం, లక్ష్యబద్ధమైన ఉపాధి కార్యక్రమాలు ఈ విధానానికి పునాది కావాలి. ఒంటరి మహిళల సాధికారత ఒక భిక్షకాదు అది వారి హక్కు, న్యాయం, సమానత్వానికి సంబంధించిన అంశం.తెలంగాణ అభివృద్ధి నిజంగా అర్థవంతంగా మారాలంటే, ఒంటరిగా నిలబడాల్సిన పరిస్థితుల్లో ఉన్న ఒక్క మహిళ కూడా వెనుకబడకూడదు.

## అమెరికా రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తెలంగాణ యువతుల మృతి

- మొదటి పేజి తరువాయి
మృతులను మహబూబ్ నగర్ జిల్లా గార్ల మండలానికి చెందిన కడియాల భావన (24), పుల్లఖండు మేఘన (24)గా గుర్తించారు. ఉన్నత విద్య, ఉద్యోగాల నిమిత్తం వారు అమెరికాకు వెళ్లారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియరాలేదు. అక్కడి స్థానిక అధికారులు ప్రమాదంపై దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనతో వారి కుటుంబ సభ్యులు విషాదంలో మునిగిపోయారు. వారి రోదన స్థానికులను కలచివేస్తోంది.

## సమయం సరిపోదు... 15 రోజులు కావాలి

- మొదటి పేజి తరువాయి
సరికాదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.మరోవైపు, ప్రస్తుతానికి ఒక వారం రోజుల పాటు సమావేశాలు నిర్వహించేందుకు అంగీకరించినట్లు ప్రభుత్వం తెలిపింది. అయితే, సమావేశాల సమయంలో పరిస్థితులను బట్టి అవసరమైతే మరిన్ని రోజులు పొడిగించే అంశంపై మరోసారి బీఏసీ సమావేశం నిర్వహించి నిర్ణయం తీసుకుంటామని ప్రభుత్వం హామీ ఇచ్చినట్లు హరీశ్ రావు వెల్లడించారు. దీంతో అసెంబ్లీ సమావేశాలు మొత్తం ఎన్ని రోజులు జరుగుతాయన్న దానిపై ఇంకా పూర్తి స్పష్టత రావాల్సి ఉంది.ఇదిలా ఉండగా, నదీ జలాల అంశంపై సభలో ఇప్పటికే రాజకీయ వేడి మొదలైంది.

ఈ అంశంపై ప్రభుత్వం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వడానికి సిద్ధమవుతుండగా, ప్రతిపక్ష బీఆర్ఎస్ కూడా తమకూ అదే అవకాశం ఇవ్వాలని బీఏసీ సమావేశంలో డిమాండ్ చేసింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులు, నీటి ప్రాజెక్టుల వివరాలను ప్రజలకు వివరించేందుకు తమకు కూడా సమాన అవకాశాలు కల్పించాలని హరీశ్ కోరారు.

## అధ్యక్షా ఐదు రోజులే..!

- మొదటి పేజి తరువాయి
మాజీ సర్పంచ్‌లు అసెంబ్లీ ముట్టడికి ప్రయత్నించారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు వారిని అడ్డుకుని, పలువురిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఆందోళన గురించి ముందే సమాచారం ఉండటంతో పోలీసులు రాష్ట్రవ్యాప్తంగా పలువురు బీఆర్ఎస్ నేతలను ముందస్తుగా అరెస్ట్ చేశారు. అసెంబ్లీ పరిసరాల్లో దాదాపు వెయ్యి మంది సిబ్బందితో మూడంచెల భద్రతను ఏర్పాటు చేసి భారీ బందోబస్తు నిర్వహించారు.

## అసెంబ్లీలో కేసీఆర్ తో రేవంత్ రెడ్డి కరచాలనం..

- మొదటి పేజి తరువాయి
కేసీఆర్ వద్దకు వెళ్లి పలకరించారు. కేసీఆర్ ఆరోగ్యం గురించి సీఎం రేవంత్ రెడ్డి వాకబు చేశారు. మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి, శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మ ణ్, సీతక్క, ఎమ్మెల్యే నవీన్‌యాదవ్ ఆయనను పలకరించి అభివాదం చేశారు.

**రెండు నిమిషాల తర్వాత వెళ్లిపోయిన కేసీఆర్**

అసెంబ్లీ సమావేశాల తొలిరోజు దివంగత మాజీ ఎమ్మెల్యేలు రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, కొండా లక్ష్మారెడ్డిలకు సంతాప తీర్మానాలను సభలో ప్రవేశపెట్టారు. అనంతరం సభ్యులు సంతాపం తెలిపారు. సంతాప తీర్మానాల అనంతరం కేసీఆర్ సభ నుంచి వెళ్లిపోయారు. మాజీ సీఎం కేసీఆర్ ఈ రోజు సభలో ఉన్నది కేవలం రెండు నిమిషాలు మాత్రమే.

## పాక్ ఆర్మీపై బలూచిస్థాన్ సాయుధుల మెరుపుదాడులు... 15 మంది సైనికుల మృతి

పాకిస్థాన్‌లోని బలూచిస్థాన్ ప్రావిన్స్‌లో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గత కొన్ని వారాలుగా బలోచ్ వేర్పాటువాద సాయుధ గ్రూపులు జరిపిన వరుస దాడుల్లో కనీసం 15 మంది పాకిస్థానీ సైనికులు మరణించారు. ప్రావిన్స్‌లోని కెచ్, పంజ్‌గూర్, తుర్బాత్, సురబ్, నసీరాబాద్ వంటి పలు ప్రాంతాల్లో ఈ దాడులు జరిగాయి. బలోచ్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ), బలూచిస్థాన్ లిబరేషన్ ఫ్రంట్ (బీఎల్ఎఫ్), బలోచ్ రిపబ్లికన్ గార్డ్స్ (బీఆర్‌జీ) అనే మూడు సంస్థలు ఈ దాడులకు బాధ్యత వహిస్తున్నట్లు సోమవారం స్థానిక మీడియా వెల్లడించింది. డిసెంబర్ 23న కెచ్ జిల్లాలోని తేజాబన్ ప్రాంతంలో పాక్ ఆర్మీ పోస్టుపై తమ ఫైటర్లు దాడి చేసి ఇద్దరు సైనికులను హతమార్చినట్లు బీఎల్ఏ ప్రతినిధి జీయండ్ బలోచ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆటోమేటిక్ ఆయుధాలు, గ్రెనేడ్ లాంచర్లతో ఈ దాడికి పాల్పడినట్లు పేర్కొన్నారు. డిసెంబర్ 25న చైనా-పాకిస్థాన్ ఎకనామిక్ కారిడార్ (సీపెక్) మార్గంలో సైనిక వాహనాన్ని లక్ష్యంగా చేసుకొని రిమోట్ కంట్రోల్ బాంబును పేల్చినట్లు తెలిపారు. ఈ ఘటనలో ఆరుగురు సైనికులు చనిపోగా, మరో నలుగురు గాయపడ్డారని వెల్లడించారు. అలాగే, తుర్బాత్‌లో పాక్ సైన్యం వినియోగిస్తున్న కమ్యూనికేషన్ టవర్‌ను ఆదివారం పేల్చివేసినట్లు 'ది బలూచిస్థాన్ పోస్ట్' పేర్కొంది.
మరోవైపు, డిసెంబర్ 27న సురబ్ జిల్లాలోని ఆర్‌సీడీ హైవేపై వాహనాలను అడ్డగించి, సైందక్ మైనింగ్ ప్రాజెక్టుకు చెందిన ట్రక్కులకు భద్రతగా
వస్తున్న కాన్వాయ్‌పై దాడి చేసినట్లు బలూచిస్థాన్ లిబరేషన్ ఫ్రంట్ (బీఎల్ఎఫ్) ప్రకటించింది. ఈ ఘటనలో ఐదుగురు సైనికులు మరణించినట్లు ఆ సంస్థ ప్రతినిధి మేజర్ గ్వాహ్రామ్ బలోచ్ తెలిపారు. నసీరాబాద్ జిల్లాలో శనివారం రాత్రి పాక్ సైనిక కాన్వాయ్‌తో తమ ఫైటర్లకు గంటపాటు ఎదురుకాల్పులు జరిగాయని, ఈ ఘటనలో ఇద్దరు సైనికులు మరణించారని బలోచ్ రిపబ్లికన్ గార్డ్స్ (బీఆర్‌జీ) ప్రకటించింది. బలూచిస్థాన్ స్వాతంత్ర్యం వచ్చేవరకు ఇలాంటి దాడులు కొనసాగిస్తామని ఆ సంస్థ స్పష్టం చేసింది.

## పాకిస్థాన్ లో కొత్త టెర్రరిస్ట్ లీడర్..

- మొదటి పేజి తరువాయి
వార్తల నుంచి మాయమయ్యారు. వారంతా అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఇదే సమయంలో పాకిస్థాన్ మరో కొత్త ఉగ్ర నేతను ముందుకు తెచ్చిందన్న ఆరోపణలు ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో చర్చకు వస్తున్నాయి.ఆ కొత్త ఉగ్ర నేత పేరు ఖారీ మొహమ్మద్ యాకూబ్ షేక్. లష్కరే తోయిబా నుంచి ఉగ్ర శిక్షణ పొందిన ఇతడు, ఇప్పుడు స్వతంత్రంగా తనకంటూ ఓ కొత్త సంస్థను నిర్మించుకున్నాడు. ఆ సంస్థ పేరు సెంట్రల్ ముస్లిం లీగ్. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే.. ఈ సంస్థను పాకిస్థాన్‌లో ఒక రాజకీయ పార్టీగా నమోదు చేశారు. అంతే కాదు, దీనికి పాక్ సైన్యం పరోక్షంగా మద్దతు ఇస్తోందన్న ఆరోపణలు కూడా ఉన్నాయి.

**యాకూబ్ షేక్ నేపథ్యం**

1972లో పాకిస్థాన్‌లోని బహవల్‌పూర్‌లో జన్మించిన ఖారీ యాకూబ్, మొదట మదర్సాలో చదువు పూర్తిచేసి మతప్రచారకుడిగా తన జీవితాన్ని ప్రారంభించాడు. అయితే క్రమంగా తీవ్రవాద భావజాలానికి లోనై ఉగ్రవాద మార్గంలోకి మళ్లాడు. 2012లోనే అమెరికా అతడిని అధికారికంగా ఉగ్రవాదిగా గుర్తించింది. అప్పట్లో అతడు లష్కరే తోయిబా కోసం పనిచేస్తున్నాడన్న ఆరోపణలు వచ్చాయి. అంతేకాదు, జైష్-ఎ-మొహమ్మద్ చీఫ్ మసూద్ అజార్‌తోనూ అతడికి సన్నిహిత సంబంధాలు ఉన్నాయని పలు ఇంటెలిజెన్స్ నివేదికలు చెబుతున్నాయి.
2017లో దిఫా-ఏ-పాకిస్థాన్ కౌన్సిల్ తరఫున ఎన్నికల్లో పోటీ చేసిన యాకూబ్ ఓడిపోయాడు. అయినా రాజకీయాల్ని, ఉగ్రవాదాన్ని కలిపి నడిపే ప్రయత్నాన్ని మాత్రం ఆపలేదు. 2025 ప్రారంభంలో ఆఫ్ఘనిస్థాన్ పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు పెరిగిన సమయంలో, యాకూబ్ తాలిబాన్ పాలనకు వ్యతిరేకంగా ఫత్వా జారీ చేశాడు. ఇదే అంశం పాక్ సైన్యానికి అతడిని దగ్గర చేసింది. అప్పటి నుంచి యాకూబ్‌కు సైన్యం అండగా నిలుస్తోందన్న ప్రచారం మొదలైంది.
ఆపరేషన్ సిందూర్‌లో మసూద్ అజార్ కుటుంబానికి చెందిన 14 మంది మరణించారు. హాఫీజ్ సయీద్‌కు చెందిన రహస్య స్థావరాలు కూడా ధ్వంసమయ్యాయి. ఆ తర్వాత వీరిద్దరూ పూర్తిగా అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ప్రస్తుతం వారు పాక్ సైన్యం నిఘాలోనే భద్రంగా ఉన్నారని సమాచారం. ఇదే సమయంలో పాకిస్థాన్ దేశంలో తెహ్రీక్-ఇ-తాలిబాన్, బలూచ్ లిబరేషన్ ఆర్మీ వంటి ఉగ్రసంస్థలు సైన్యానికి పెద్ద సవాలుగా మారాయి. వీటిని అణచివేయడంలో పాక్ సైన్యం విఫలమవుతోంది.
ఈ పరిస్థితుల్లోనే పాకిస్థాన్ మరోసారి పాత పద్ధతికే వెళ్లిందని విశ్లేషకులు చెబుతున్నారు. పాత ఉగ్రనేతలు అయిన హాఫీజ్, మసూద్ ఇక పనికిరారని భావించి, వారి స్థానంలో కొత్త ముఖాన్ని ముందుకు తెచ్చే ప్రయత్నమే ఖారీ యాకూబ్ షేక్ అని అంటున్నారు. ఉగ్రవాదాన్ని రాజకీయాల ముసుగులో దాచిపెట్టి, ప్రపంచాన్ని మభ్యపెట్టే ప్రయత్నం పాకిస్థాన్ చేస్తోందన్న విమర్శలు మరింత బలపడుతున్నాయి.

## ఐబొమ్మ రవి కేసులో వెలుగులోకి వచ్చిన మరో కోణం!

- మొదటి పేజి తరువాయి
రవిని కస్టడీలోకి తీసుకున్న పోలీసులు అన్ని కోణాల్లో విచారిస్తున్నారు. ఈ విచారణలో వెలుగుచూస్తున్న విషయాలు దర్యాప్తు అధికారులను కూడా షాక్‌కు గురిచేస్తున్నాయి. తాజాగా ఈ కేసులో మరో విస్తుపోయే విషయం వెలుగులోకి వచ్చింది. రవి కేవలం పైరసీ వరకే పరిమితం కాకుండా, ఇతరుల గుర్తింపు పత్రాలను దొంగిలించి భారీ అక్రమాలకు పాల్పడ్డాడన్న అనుమానాలు బలపడుతున్నాయి.గతంలో పోలీసుల ముందు రవి ఇచ్చిన వాంగ్మూలంలో... 'ప్రహ్లాద్ వెల్లేల' అనే వ్యక్తి తన రూమ్‌మేట్ అని, ఐబొమ్మ నిర్వహణలో అతడికి కూడా పాత్ర ఉందని చెప్పాడు. అయితే విచారణ ముందుకు సాగిన కొద్దీ, రవి చెప్పిన మాటలన్నీ అబద్ధాలేనని తేలింది. వాస్తవానికి ప్రహ్లాద్‌కు ఏమాత్రం తెలియకుండానే అతడి పాన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ వంటి కీలక డాక్యుమెంట్లను రవి దొంగలించినట్లు పోలీసులు గుర్తించారు.ఈ దొంగిలించిన పత్రాలతో ప్రహ్లాద్ పేరుపై నకిలీ పత్రాలు సృష్టించి, బ్యాంక్ ఖాతాలు తెరవడం, ఆన్‌లైన్ లావాదేవీలు నిర్వహించడం, వెబ్‌సైట్ కార్యకలాపాలకు ఉపయోగించుకున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ కోణంలో నిజాలను వెలికితీసేందుకు బెంగళూరులో నివసిస్తున్న ప్రహ్లాద్‌ను ప్రత్యేకంగా పిలిపించారు.రవి ఎదుటే ప్రహ్లాద్‌ను కూర్చోబెట్టి పోలీసులు విచారణ చేపట్టగా, అతడు ఇచ్చిన స్టేట్‌మెంట్ అధికారులను ఆశ్చర్యానికి గురిచేసింది. తనకు రవి ఎవరో తెలియదని, తామిద్దరం ఎప్పుడూ రూమ్‌మేట్స్‌గా ఉండలేదని ప్రహ్లాద్ స్పష్టంగా చెప్పాడు. తన పేరుతో పాన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ వాడుతున్నారన్న విషయం తెలిసి తీవ్రంగా కలత చెందానని పోలీసులకు వివరించాడు. తన డాక్యుమెంట్లను ఫోర్జరీ చేసి అక్రమాలకు పాల్పడిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు కూడా చేశాడు.
ఈ పరిణామాలతో ఇమంది రవి చేసిన నేరాల జాబితా మరింత పెద్దదిగా మారుతోంది. పైరసీతో పాటు ఐడెంటిటీ థెఫ్ట్, ఫోర్జరీ, మోసాలు వంటి తీవ్రమైన ఆరోపణలు అతడిపై నమోదయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇదే తరహాలో ఇంకెంతమంది అమాయకుల డాక్యుమెంట్లు దుర్వినియోగం అయ్యాయన్న కోణంలో పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. ఈ కేసులో రాబోయే రోజుల్లో మరిన్ని సంచలన విషయాలు బయటపడే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

## 14 ఏళ్ల తర్వాత హంతకుడికి మరణశిక్ష విధించిన కోర్టు

- మొదటి పేజి తరువాయి
సనత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని భరత్ నగర్‌లో 2011లో జరిగిన హత్య కేసులో కోర్టు ఈ తీర్పును వెలువరించింది. ఈ కేసులో నిందితుడు కరణ్ సింగ్‌కు మూడవ అదనపు డిస్ట్రిక్ట్ జడ్జి వెంకటేశ్వర రావు మరణశిక్ష విధిస్తూ తీర్పును వెలువరించారు. నిందితుడికి 14 సంవత్సరాల తర్వాత శిక్ష పడింది.కరణ్ సింగ్ 2011లో ఒక మహిళను హత్య చేశాడు. వివాహేతర సంబంధం నేపథ్యంలో ఈ హత్య జరిగిందని పోలీసుల విచారణలో తేలింది. అప్పటి సనత్ నగర్ పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ రాము ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అనంతరం ఛార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసు దర్యాప్తులో పాల్గొన్న పోలీసులకు, అధికారులకు సీపీ అవినాశ్ మహంతి అభినందనలు తెలిపారు.

## ఒకేసారి 52 ఉపగ్రహాలను ప్రయోగించిన రష్యా

- మొదటి పేజి తరువాయి
కక్ష్యలో ప్రవేశపెట్టింది. వీటిలో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) కోసం రూపొందించిన ఒక విద్యా ఉపగ్రహం కూడా ఉండటం గమనార్హం.ఈ ప్రయోగంలో భాగంగా యూఏఈకి చెందిన QMR`KWT`2 ఉపగ్రహాన్ని నింగిలోకి పంపారు. రష్యా, యూఏఈ, కువైట్ మధ్య సహకారాన్ని పెంచడంతో పాటు అరబ్ దేశాల్లో అంతరిక్ష పరిశోధనల పట్ల ఆసక్తిని పెంపొందించడం, అమెచ్యూర్ రేడియో బ్రాడ్‌కాస్టింగ్ సేవలు అందించడం ఈ ఉపగ్రహం ముఖ్య ఉద్దేశమని స్పుత్నిక్స్ గ్రూప్ ప్రతినిధులు తెలిపారు.వీటితో పాటు సముద్రంలో నౌకల కదలికలను గుర్తించేందుకు రష్యా తన శాటిలైట్ ఆధారిత ఆటోమేటిక్ ఐడెంటిఫికేషన్ సిస్టమ్ వ్యవస్థను మరింత విస్తరించింది. ఇందులో భాగంగా పదుల సంఖ్యలో క్యూబ్‌శాట్ 3ఖ ఉపగ్రహాలను కక్ష్యలోకి చేర్చింది. శాటిలైట్ ఆధారిత ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ టెక్నాలజీని పరీక్షించేందుకు సిట్రో-టీడీ ఉపగ్రహాలను కూడా ప్రయోగించినట్లు కంపెనీ పేర్కొంది.ఈ ప్రయోగంలో ఏఐఎస్‌టీ-2టీ సిరీస్‌కు చెందిన రెండు ఉపగ్రహాలు ప్రధానమైనవి. ఇవి భూమి ఉపరితలాన్ని ఫోటోలు తీసి, డిజిటల్ మ్యాప్‌లను రూపొందించడంలో సహాయపడతాయి. అగ్నిప్రమాదాలు, వరదలు వంటి ప్రకృతి విపత్తులను పర్యవేక్షించేందుకు కూడా ఉపయోగపడతాయి. కనీసం ఐదేళ్ల పాటు పనిచేసేలా ఈ ఉపగ్రహాలను రూపొందించారు.

## బంగ్లాదేశ్ చొరబాటుదారులు దేశంలో ఎక్కడున్నా పంపించేస్తాం

- మొదటి పేజి తరువాయి
సంస్కృతి, గుర్తింపులకు ముప్పుగా పరిణమిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ వారిని ఓటు బ్యాంకుగా చూస్తోందని ఆయన ఆరోపించారు.ఆ ఓటు బ్యాంకును కాపాడుకునేందుకు ప్రతిపక్ష కూటమి ఓటరు జాబితా ఎస్ఐఆర్‌ను వ్యతిరేకిస్తోందని విమర్శించారు. అసోంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నో ఏళ్లు అధికారంలో ఉన్నప్పటికీ రాష్ట్రంలో ఎలాంటి అభివృద్ధి చేయలేదని దుయ్యబట్టారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రజల సాంస్కృతిక గుర్తింపును కాపాడటంతో పాటు రాష్ట్ర సమగ్ర అభివృద్ధిపై దృష్టి సారించిందని తెలిపారు.బంగ్లాదేశ్ చొరబాటుదారులు ఆక్రమించుకున్న లక్షకు పైగా బిఘాల భూమిని ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం విడిపించిందని కొనియాడారు. రాష్ట్రంలో పాతుకుపోయిన చొరబాటుదారులను పూర్తిగా నిర్మూలించడానికి బీజేపీకి మరో అవకాశం ఇవ్వాలని కోరారు. గత 11 ఏళ్లలో బీజేపీ ప్రభుత్వం రాష్ట్రంలోని పలు మిలిటెంట్ సంస్థలతో శాంతి ఒప్పందం చేసుకుందని గుర్తు చేశారు.

## రిటైర్మెంట్ హోమ్ లో మంటలు.. ఇండోనేసియాలో 16 మంది వృద్ధుల మృతి

- మొదటి పేజి తరువాయి
చుట్టుపక్కల వారు సమాచారం అందించడంతో పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.
మంటల ధాటికి అప్పటికే 16 మంది వృద్ధులు మృతి చెందారు. అగ్నిమాపక సిబ్బంది హోమ్ లోని 15 మందిని కాపాడి ఆసుపత్రులకు తరలించారు. మృతదేహాలను గుర్తించి బంధువులకు అప్పగించేందుకు చర్యలు చేపట్టామని పోలీసులు తెలిపారు. ప్రాథమిక పరిశీలనలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగానే మంటలు చెలరేగినట్లు తేలిందని, పూర్తి వివరాలను అధికారికంగా ప్రకటిస్తామని చెప్పారు.

# చెక్ డ్యాములను బాంబులతో పేల్చారు

## అసెంబ్లీలో కౌశిక్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు



**హైదరాబాద్ పెన్ పవర్:** బీఆర్ఎస్ నేత, హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అసెంబ్లీలో చేసిన బాంబ్ కామెంట్స్ తీవ్ర దుమారం రేపాయి. ఈ వ్యాఖ్యలపై కాంగ్రెస్ సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. సోమవారం (డిసెంబర్ 29) ఉదయం 10.30 గంటలకు అసెంబ్లీ శీతాకాల సమావేశాలు ప్రారంభమయ్యాయి. అనంతరం ఇటీవల మరణించిన సూర్యాపేట మాజీ ఎమ్మెల్యే రాంరెడ్డి దామోదర్ రెడ్డి, చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కొండా లక్ష్మారెడ్డికి సభ ప్రగాఢ సానుభూతిని తెలియజేసింది.ఆ తర్వాత ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ.. మేడిగడ్డ బ్యారేజ్ పిల్లర్లను బాంబులతో పేల్చినట్లు తన హుజురాబాద్ నియోజకవర్గంలో కూడా చెక్ డ్యాములను కూడా బాంబులతో పేల్చివేశారని, ఈ అంశంపై విచారణ జరపాలని స్పీకర్‌ను కోరారు. ఈ క్రమంలో కౌశిక్ రెడ్డి వ్యాఖ్యలపై కాంగ్రెస్ సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. బాంబులు పెట్టి పేల్చారని అనడం ఏంటని ప్రశ్నించారు. కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని కాంగ్రెస్ సభ్యులు స్పీకర్‌కు విజ్ఞప్తి చేశారు. కౌశిక్ రెడ్డి వ్యాఖ్యలను పరిశీలించి నిర్ణయం తీసుకుంటానని స్పీకర్ చెప్పారు. మొత్తానికి కౌశిక్ రెడ్డి బాంబ్ కామెంట్స్ తొలి రోజు సభలో కాకరేపాయి.

# పెన్ పవర్ తెలంగాణ రౌండప్

**జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డులు, భద్రత వంటి మౌలిక డిమాండ్లను పక్కన పెట్టి, జీవోలతో వర్గీకరణ చేయడం, అంగీకరించ బోమని హెచ్చరించారు. పోరాటమే మార్గంగా ముందుకు వెళ్తామని అధ్యక్ష-కార్యాదర్శి పేర్కొన్నారు.. జీవో 252ను వెంటనే ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ.. జర్నలిస్టులను ఐక్యం చేసి, ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని అన్నారు.. రాష్ట్ర కమిటీ సూచనలు, సలహాలు పాటించి, ప్రభుత్వ నిర్ణయాలకు లొంగకుండా, జర్నలిస్టుల హక్కులు, గౌరవం కోసం పోరాటం కొనసాగటంలో కీలకంగా వ్యవహరిస్తామని టీయూడబ్ల్యూజేటీజేఎఫ్ మేడ్చల్ జిల్లా నూతన అధ్యక్షుడు కోలా వెంకటేశ్వర్లు, కార్యదర్శి కొలెపాక వెంకట్ స్పష్టం చేశారు..**

### జీవో252కు వ్యతిరేకంగా పోరాడుతాం: అధ్యక్ష-కార్యదర్శి..

జర్నలిస్టుల ఐక్యతను దెబ్బతీసే విధంగా, వృత్తి స్వేచ్ఛపై పరోక్ష ఆంక్షలు విధించేలా ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 252 ఉందని టీయూడబ్ల్యూజేటీజేఎఫ్ (హెచ్143) మేడ్చల్ జిల్లా నూతన అధ్యక్షుడు కోలా వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి కొలెపాక వెంకట్ తీవ్రంగా విమర్శించారు.. తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టుల మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా నూతన అధ్యక్షుడు కోలా వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి కొలిపాక వెంకట్ మాట్లాడుతూడ

ఈ జీవో నెం.252 ద్వారా జర్నలిస్టులను విభజించి, కొందరిని మాత్రమే గుర్తించి, మిగతావారిని పక్కన పెట్టే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు..ప్రజాస్వామ్యంలో నాలుగో స్థంభమైన జర్నలిజాన్ని నియంత్రించే కుట్రలో భాగంగా తీసుకున్న నిర్ణయాలంటూ ఆరోపించారు.. ప్రభుత్వానికి అనుకూలంగా లేని స్వరాలను అణచివేయడానికే ఈ జీవో 252ను తెరపైకి తెచ్చారని వారు మండిపడ్డారు..



అల్లం నారాయణ, ఆస్కాని మారుతి సాగర్ చేతుల మీదుగా నియామక పత్రం అందుకుంటున్న కార్యదర్శి వెంకట్..

# టీయూడబ్ల్యూజే- టీజేఎఫ్ (హెచ్-143)..!

## మేడ్చల్ జిల్లా కొత్త నాయకత్వం..! అధ్యక్ష-కార్యదర్శి నియామకం..



మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు కోలా వెంకటేశ్వర్లు..




మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొలెపాక వెంకట్..

- జిల్లా అధ్యక్షుడిగా కోలా వెంకటేశ్వర్లు.. ప్రధాన కార్యదర్శిగా కొలెపాక వెంకట్..
- రాష్ట్ర అధ్యక్షులు అల్లం నారాయణ, ప్రధాన కార్యదర్శి మారుతి సాగర్ చేతుల మీదుగా..
- నియామక ఉత్తర్వులను అధికారికంగా అందజేశారు..
- జర్నలిస్టులను చీల్చే విధంగా తెచ్చిన జీవో నెం.252కి వ్యతిరేకంగా పోరాడుతాం..

### సంక్షేమం పేరుతో వడపోత..?

జర్నలిస్టుల సంక్షేమం పేరుతో తీసుకొచ్చిన ఈ జీవోలో, ఎవరు జర్నలిస్టులు..? ఎవరికి ఏ హక్కులు కల్పించాలో..? ఎవరు అర్హులు కారు..? అనే అంశాలను ప్రభుత్వమే నిర్ణయించే పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు.. ఇది నేరుగా వృత్తి స్వేచ్ఛపై దాడిగా పేర్కొన్నారు.. ఐక్యతే లక్ష్యంగా జీవోలు తీసి, జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం..! సమస్యలు సృష్టించేందుకు, జర్నలిస్టు సంఘాలను చీల్చే దిశగా అడుగులు వేయడం దురదృష్టకరం అన్నారు..

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, డిసెంబర్ 29:** తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (టీయూడబ్ల్యూజే), టీజేఎఫ్ (హెచ్-143) మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా నూతన అధ్యక్షుడిగా కోలా వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా కొలెపాక వెంకట్ ఎన్నికయ్యారు.. ఈ మేరకు టీయూడబ్ల్యూజేటీజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు అల్లం నారాయణ, ప్రధాన కార్యదర్శి ఆస్కానీ మారుతి సాగర్ నియామక ఉత్తర్వులను సోమవారం అధికారికంగా అందజేశారు.. కోలా వెంకటేశ్వర్లు ప్రస్తుతం మేడ్చల్ జిల్లా సాక్షి రిపోర్టర్‌గా, కొలిపాక వెంకట్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నమస్తే తెలంగాణ ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన జిల్లా అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ తమపై నమ్మకంతో పదవీ బాధ్యతలు అప్పగించిన అల్లం నారాయణ, ఆస్కానీ మారుతి సాగర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లాలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి యూనియన్ తరఫున నిరంతరం కృషి చేస్తామని స్పష్టం చేశారు.. ముఖ్యంగా జర్నలిస్టులను విభజించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన జీవో 252కు వ్యతిరేకంగా జర్నలిస్టులందరినీ ఐక్యం చేసి పోరాటం కొనసాగిస్తామని ప్రకటించారు. అదే సమయంలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డులు అందేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని అన్నారు.. జిల్లాలో యూనియన్‌ను మరింత బలోపేతం చేస్తూ, జర్నలిస్టుల హక్కులు, భద్రత, సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తామని వారు పేర్కొన్నారు..



TELANGANA UNION OF WORKING JOURNALISTS
PRESIDENT : ALLAM NARAYANA GENERAL SECRETARY : A.MARUTHY SAGAR

Date 28-12-2025

నియామక పత్రం

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా టియుడబ్ల్యూజే నూతన కమిటీ
అధ్యక్షులుగా : కోలా వెంకటేశ్వర్లు (సాక్షి జిల్లా స్టాఫర్)
ప్రధాన కార్యదర్శి గా : కొలిపాక వెంకట్ (నమస్తే తెలంగాణ)
నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం అయినది. జిల్లా ఇంచార్జ్ అమరేందర్ బొమ్మ వ్యవహరిస్తారు. వీరు రెండు మాసాలలోపు జిల్లా పరిధిలో సభ్యత్వ నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని, తదనంతరం జరిగే మహాసభలో పూర్తిస్థాయి కార్యవర్గాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుంది.

అల్లం నారాయణ
అధ్యక్షులు.

అస్కాని మారుతి సాగర్
ప్రధాన కార్యదర్శి

Flat 103, Block - I, New MLA Quarters, Adarshnagar, Hyderabad, Email : tuwjh143stateoffice@gmail.com
Mobile No : 90107 56666, 80087 11884

# జిల్లాలో యూరియా కొరత లేదు..!

## రైతులు ఆందోళన చెందవద్దన్న మేడ్చల్ జిల్లా కలెక్టర్ మను చౌదరి..

- జిల్లాలో 773 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు సిద్ధం..!
- కృత్రిమ కొరతకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ హెచ్చరిక..
- ప్రతి యూరియా సేల్స్ కౌంటర్ వద్ద సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ ఆదేశాలు..
- అవసరానికి మించి కొనుగోలు చేయకుండా శాస్త్రీయ పద్ధతిలో వినియోగించాలి..

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, డిసెంబర్ 29:**మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా రైతులకు అవసరమైన యూరియా ఎరువులు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్నాయని జిల్లా కలెక్టర్ మను చౌదరి స్పష్టం చేశారు. యూరియా కొరతపై ఎలాంటి అపోహలకు తావు లేదని, రైతులు నిర్భయంగా సాగు పనులు కొనసాగించవచ్చని భరోసా ఇచ్చారు.. సోమవారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో కలెక్టర్ స్పష్టంగా పేర్కొన్నారు.. జిల్లాలో నేటికీ 773 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు.. ప్రస్తుత సాగు అవసరాలకు ఇవి పూర్తిగా సరిపోతాయని, అవసరాన్ని బట్టి అదనపు సరఫరాలు కూడా క్రమం తప్పకుండా జిల్లాకు చేరుతున్నాయని వెల్లడించారు.. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రతి యూరియా సేల్ కౌంటర్ వద్ద షామియానాలు, త్రాగునీటి సౌకర్యాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా ఉదయం 6 గంటల నుంచే యూరియా విక్రయాలు ప్రారంభించాలని సూచించారు.. యూరియా పంపిణీ ప్రక్రియపై వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది నిరంతర పర్యవేక్షణ చేపడుతున్నారని తెలిపారు.. ఎవరైనా కృత్రిమ కొరత సృష్టించడం, అధిక ధరలకు విక్రయించడం వంటి అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు.యూరియా సరఫరాలో ఏవైనా సమస్యలు ఎదురైతే రైతులు సమీప వ్యవసాయ అధికారులను సంప్రదించాలని తెలిపారు.. అలాగే అవసరానికి మించి యూరియా కొనుగోలు చేయకుండా, శాస్త్రీయ పద్ధతుల్లో వినియోగించాలని రైతులకు కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.. జిల్లాలో యూరియా సరఫరా వ్యవస్థ పటిష్టంగా ఉందని, రైతుల ప్రయోజనాలే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కలెక్టర్ మరోసారి స్పష్టం చేశారు..




మిక్కినేని మను చౌదరి.. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్..

# చైనా మాంజ పట్టిస్తే 5 వేలు గిఫ్ట్ ..

## ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆఫర్




**హైదరాబాద్ పెన్ పవర్:**ఎమ్మెల్యే దానం నాగేందర్ హైదరాబాద్ నగర వాసులకు బంపర్ ఆఫర్ ఇచ్చారు. చైనా మాంజ పట్టిస్తే 5 వేలు గిఫ్ట్ ఇస్తానని ప్రకటించారు. చైనా మాంజ కారణంగా మనుషులతో పాటు పక్షులకు ప్రమాదాలు సంభవిస్తున్నాయని దానం అన్నారు. ఖైరతాబాద్ నియోజకవర్గంలో ఎవరైన చైనా మాంజను విక్రయిస్తే ఉపేక్షించమని హెచ్చరించారు. ఏ షాపులో అయినా చైనా మాంజ అమ్ముతున్నట్లు సమాచారం ఇస్తే , విక్రయిస్తున్న వారిపై కేసులు నమోదు చేయిస్తామన్నారు.

సమాచారం ఇచ్చిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని... వారికి తన నుండి 5 వేల నగదు బహుమతిగా ఇస్తానని దానం నాగేందర్ ప్రకటించారు. ముఖ్యంగా ఖైరతాబాద్ నియోజకవర్గంలో మాంజా అమ్ముతున్నట్లు తెలియజేస్తే నగదు బహుమతి ఇస్తామని సోమవారం (డిసెంబర్ 29) అన్నారు.

# రాష్ట్రంలో సరిపడా యూరియా నిల్వలు..

## గత సీజన్ కంటే 92 వేల మెట్రిక్ టన్నులు అధికంగా అమ్మకాలు

**హైదరాబాద్ పెన్ పవర్:**రాష్ట్రంలో రబీ సీజన్ కు సరిపడా యూరియా నిల్వలు రాష్ట్ర ప్రభుత్వం వద్ద అందుబాటులో ఉన్నాయని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం (డిసెంబర్ 29) ఫెర్టిలైజర్ (యూరియా) యాప్, యూరియా పంపిణీలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన మంత్రి.. యూరియా సరఫరాలో ఇబ్బందులు రానీయవద్దంటూ ఆదేశించారు. గత సీజన్ కంటే 92 వేల మెట్రిక్ టన్నులు అధికంగా యూరియా అమ్మకాలు జరిగాయని ఈ సందర్భంగా మంత్రి తుమ్మల చెప్పారు. 5 జిల్లాల్లో ప్రయోగాత్మకంగా ప్రారంభించిన ఫెర్టిలైజర్ యాప్ విజయవంతం అయినట్లు తెలిపారు. కేవలం 9 రోజుల్లో 2 లక్షల ఒక వెయ్యి 789 బస్తాల యూరియాను




-4 లో

# రాష్ట్రంలో సరిపడా యూరియా నిల్వలు..
# గత సీజన్ కంటే 92 వేల మెట్రిక్ టన్నులు అధికంగా అమ్మకాలు

- 3 పేజి తరువాయి

యాప్ ద్వారా రైతుల కొనుగోలు చేసినట్లు చెప్పారు. ఈ రబీకి కేంద్ర ప్రభుత్వం మొత్తం 10.40 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించగా, అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు రావాల్సిన 5.60 లక్షల మెట్రిక్ టన్నులకు గాను 5.70 లక్షల మెట్రిక్ టన్నులు ఇప్పటికే రాష్ట్రానికి చేరుకున్నాయని వివరించారు. గత సంవత్సరం ఇదే సమయానికి 2.81 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అమ్మకాలు జరగగా, ఈ సీజన్‌లో రోజుకు సగటుగా 8,692 మెట్రిక్ టన్నుల చొప్పున మొత్తం 3.72 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా రైతులు కొనుగోలు చేశారని తెలిపారు. ఇది గత సీజన్ కంటే 92 వేల మెట్రిక్ టన్నులు అధికం అని మంత్రి అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 2.15 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు ఉన్నట్లు తెలిపారు.

**ఫెర్టిలైజర్ యాప్ సక్సెస్:**
వ్యవసాయశాఖ ప్రవేశపెట్టిన ఫెర్టిలైజర్ (యూరియా) యాప్ ను ఆదిలాబాద్, మహబూబ్ నగర్, జనగామ, నల్లగొండ, పెద్దపల్లి జిల్లాల్లో డిసెంబర్ 20 నుంచి అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటి వరకు ఈ ఐదు జిల్లాల్లో 82 వేల 59 మంది రైతులు యాప్ ద్వారా యూరియా బుకింగ్ చేసి 2 లక్షల వెయ్యి 789 యూరియా బస్తాలు కొనుగోలు చేశారు. యాప్ ప్రారంభించిన కేవలం 9 రోజుల్లోనే ఈ జిల్లాల్లో రోజుకు 22 వేలకు పైగా బస్తాలు పంపిణీ అయ్యాయని తెలిపారు. రాష్ట్రంలో యూరియా లభ్యతపై రైతులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, రాష్ట్ర ప్రభుత్వం దగ్గర రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉందని మంత్రి స్పష్టం చేశారు. అదేవిధంగా రైతుల సౌకర్యార్థం వ్యవసాయ కమిషనరేట్ లో టోల్ ఫ్రీ నెం. 18005995779 ఏర్పాటు చేయడమైనదని తెలియజేశారు. ఈ సమావేశంలో వ్యవసాయశాఖ సెక్రెటరీ సురేంద్ర మోహన్, వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపి, మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి, మార్క్ ఫెడ్ ఎండీ శ్రీనివాస్ రెడ్డి, కోఆపరేటివ్ అడిషనల్ రిజిస్ట్రార్ చంద్రమోహన్ రెడ్డి మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# అన్నిదానాల్లో కెల్ల అన్నదానం మిన్న

- దాతల సహకారంతో 1712 రోజులుగా పేదలకు అన్నదాన కార్యక్రమం
- అన్నార్తుల పేదల అన్నదానానికి సహకారం అందిస్తున్న దాతలకు కృతజ్ఞతలు తెలియ జేసిన మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు
- అన్నపూర్ణే! సదాపూర్ణే! శంకర ప్రాణ వల్లభే! జ్ఞానవైరాగ్య సిద్ధ్యర్థం భిక్షాం దేహీ చ పార్వతి



**వేములవాడ పెన్ పవర్:** ట్రస్టు ఆధ్వర్యంలో దాతల సహకారంతో 1712 రోజులుగా నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమంలో భాగంగా సోమవారం రోజున దాతలు అందించిన సహకారంతో లక్ష్మీ గణపతి,రాజన్న భీమేశ్వర ఆలయం వద్ద పేదలకు మరియు అన్నార్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని నేటి అన్నదాతలుగా సోమవారం సందర్భంగా పేదలకు అన్నదానం చేయాలన్న సంకల్పంతో గత 3 సంవత్సరాలుగా అన్నదానానికి ప్రతీ సోమవారం సహకారం అందిస్తున్న జగిత్యాల వాస్తవ్యులు నల్ల వసంత సతీష్ దంపతులు,పుట్టినరోజు సందర్భంగా చౌటి రాజేశ్వర్ శర్మ శ్రావ్య దంపతులు మరియు కుటుంబ సభ్యులు శాశ్వత దాతలుగా డాక్టర్ జువ్వాడి వెంక టేశ్వరరావు స్నేహలత దంపతులు ప్రతాప స్వప్న సంపత్ దంపతులు నగుబోతు రవీందర్ జ్యోతి దంపతులు గణాచారి మఠం శైలజ సాంబశివు దంపతులు,దేవరాజు ఉమ బాలచందర్ రాజు దంపతులు రామడుగు శ్రీలత,కొడుకులు కోడళ్లు ప్రజ్ఞ శరత్చంద్ర దంపతులు,శిరీష సాయిచంద్ర దంపతులు,శర్వాణి రవిచంద్ర దంపతులు హైదరాబాద్ వాస్తవ్యులు చిన్నారులు శ్రీహర్ష సాయికృష్ణ ఉన్నారని మీయొక్క పుట్టినరోజు,పెళ్ళిరోజు మరియు ఇతరత్ర కార్యక్రమాలకు పేదలకు అన్నార్తులకు ఒక్కపూటైనా భోజనం అందించడానికి సహకారం అందించే దాతలు ట్రస్టు సభ్యులను గాని 92469 39388 నంబరుకు సంప్రదించాలని,ట్రస్టు నిర్వాహకులు మధు మహేష్ కోరారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు మధు మహేష్ తోట రాజు సగ్గు రాహుల్ పసుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఇద్దరు సీఎంలకు రమణారెడ్డి క్లాస్

**హైదరాబాద్ పెన్ పవర్:** రాజకీయాల్లో విమర్శ ఉండాలి, కానీ విద్వేషం ఉండకూడదు. వాదన ఉండాలి, కానీ వేదన కలిగించే భాష ఉండకూడదు. దురదృష్టవశాత్తూ, గత కొన్నేళ్లుగా తెలంగాణ రాజకీయ ముఖచిత్రం పూర్తిగా మారిపోయింది. "ఎవరు ఎంత గట్టిగా తిడితే, అంత గొప్ప నాయకుడు" అనే కొత్త, ప్రమాదకరమైన నిర్వచనం తెరపైకి వచ్చింది. సరిగ్గా ఇటువంటి సమయంలో, తెలంగాణ అసెంబ్లీ సాక్షిగా కామారెడ్డి బీజేపీ ఎమ్మెల్యే కాటేపల్లి వెంకటరమణారెడ్డి చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో ఆత్మవిమర్శకు తెరలేపాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో కామారెడ్డి నియోజకవర్గం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఒకవైపు అప్పటి సీఎం కేసీఆర్, మరోవైపు అప్పటి పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి.. ఇద్దరు హేమాహేమీలు బరిలో నిలిచారు. ఆ ఇద్దరినీ మట్టికరిపించి, 'జెయింట్ కిల్లర్'గా అసెంబ్లీలో అడుగుపెట్టారు వెంకటరమణారెడ్డి. ఆశ్చర్యకరంగా, ఇప్పుడు ఆ ఇద్దరు నేతలు పాటిస్తున్న లేదా ప్రోత్సహిస్తున్న దూషణల పర్వంపైనే ఆయన మొట్టమొదటి సారిగా గళం విప్పారు. సామాన్య ఎమ్మెల్యేగా కాకుండా, ప్రజల నాడిని పర్ఫెక్ట్‌గా పట్టుకున్న నాయకుడిగా ఆయన అసెంబ్లీ సాక్షిగా పీకిన క్లాస్ ఇప్పుడు ప్రాధాన్యత సంతరించుకుంది.అసెంబ్లీలో వెంకటరమణారెడ్డి వాడిన పదాలు చాలా పదునుగా ఉన్నాయి. "హైదరాబాద్ నగరాన్ని మనం వన్ క్లాస్ సిటీ అని గొప్పగా చెప్పుకుంటున్నాం. కానీ మనం మాట్లాడే మాటలు మాత్రం థర్డ్ క్లాస్‌కు పడిపోతున్నాయి" అని ఆయన చేసిన వ్యాఖ్య సిగ్గుపడేలా చేసింది. అభివృద్ధిలో పోటీ పడాల్సిన నాయకులు, బూతుల్లో పోటీ పడుతుండటం వల్ల సమాజంలో రాజకీయ నాయకులపై గౌరవం తగ్గిపోతోందన్న ఆయన ఆవేదనలో వంద శాతం నిజముంది. ముఖ్యంగా, "ఒకరు మనల్ని తిట్టినప్పుడు, మనం అంతకంటే రెండు మాటలు ఎక్కువ తిడితే జనం మెచ్చుకుంటారని అనుకోవడం మూర్ఖత్వం" అని ఆయన తేల్చి చెప్పారు. ఇది కేవలం అధికార పక్షానికో, ప్రతిపక్షానికో పరిమితం కాదు.. అందరికీ వర్తించే సార్వజనీన సత్యం.రాజకీయ నాయకులు తమను తాము గౌరవించుకోనప్పుడు, ఇతరులు తమను ఎందుకు గౌరవిస్తారు? అనే ప్రాథమిక ప్రశ్నను ఆయన లేవనెత్తారు. ప్రధానమంత్రి మోదీ, సీఎం రేవంత్ రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్ వంటి వారిని మీడియా ప్రతినిధులు ఏకవచనంతో సంబోధించడాన్ని ఆయన తప్పుబట్టారు. అయితే, దానికి కారణం మీడియా కాదని, రాజకీయ నాయకులు ఒకరినొకరు పిలుచుకుంటున్న విధానమేనని ఆయన విశ్లేషించడం గమనార్హం. "మనమే బూతులు తిట్టుకుంటూ, మీడియా వాళ్లు మనల్ని క్లాస్‌మేట్స్ లాగా ట్రీట్ చేస్తున్నారు" అనడం ద్వారా.. వ్యవస్థలో లోపం ఎక్కడుందో ఆయన వేలు పెట్టి చూపించారుఈసారి తెలంగాణ అసెంబ్లీకి దాదాపు 57 మంది కొత్త ఎమ్మెల్యేలు ఎన్నికయ్యారు. వీరంతా సీనియర్లను చూసి నేర్చుకోవాలి. కానీ, సభలో సీనియర్లు ప్రదర్శిస్తున్న ప్రవర్తన, వాడుతున్న భాష కొత్తవారిని తప్పుదోవ పట్టించేలా ఉందని వెంకటరమణారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. సభలో హుందాతనం, సంప్రదాయాలు, పరస్పర గౌరవం ఉండాలని.. ఒకరు మూర్ఖంగా మాట్లాడితే, మరొకరు సద్విమర్శతో సరిచేయాలే తప్ప, అంతకంటే దిగజారిపోకూడదని ఆయన హితవు పలికారు.సభలో వెంకటరమణారెడ్డి లేవనెత్తిన ఆవేదనతో మంత్రి శ్రీధర్ బాబు ఏకీభవించడం స్వాగతించదగ్గ పరిణామం. అయితే, ఇది కేవలం మాటలకే పరిమితం కాకూడదు. తిట్టడమే రాజకీయం అనే భావన నుంచి ప్రశ్నించడమే రాజకీయం అనే స్థాయికి మన ప్రజాస్వామ్యం ఎదగాలి. కామారెడ్డి ప్రజలు ఇద్దరు ముఖ్యమంత్రులను ఓడించి వెంకటరమణారెడ్డిని గెలిపించింది బహుశా.. ఇలాంటి నిష్ఠూర సత్యాలు చెప్పడానికేనేమో! ఆయన మాటలు ఎంతమంది చెవికెక్కుతాయో కాలమే నిర్ణయించాలి. కానీ, రాజకీయాల్లో పడిపోతున్న విలువలను కాపాడటానికి ఒక ప్రయత్నం మాత్రం జరిగింది.

# ఓసిలకు ప్రత్యేక జాతీయ కమిషన్ ఏర్పాటు చేయాలి

ఓసి సామాజిక సంక్షేమ సంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు

ఓసి ల సింహ గర్జన సభను విజయవంతం చేయాలి

రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్నం కిషన్ రెడ్డి పిలుపు



**జగిత్యాల, పెన్ పవర్:** ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల పటిష్ట అమలుకు జాతీయ, రాష్ట్ర స్థాయిలో ఓసి కమిషన్ ఏర్పాటు చేయాలని ఓసి ఐకాస నాయకులు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. జనవరి 11నవరంగల్ లోలక్ష మందితో నిర్వహించ తలపెట్టిన ఓసి ల సింహగర్జన సభ ఏర్పాట్లపై సోమవారం జగిత్యాల లోని పద్మనాయక ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన జగిత్యాల జిల్లా స్థాయి ఓసి ఐకాస నాయకుల సన్నాహక సమావేశంలో రెడ్డి, వెలమ, వైశ్య, బ్రాహ్మణ సామాజిక వర్గాల నాయకులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఓసి సామాజిక సంక్షేమ సంఘాల జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావుతో పాటు ఐకాస రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్నం కిషన్ రెడ్డి, చీటి శిరీష రావు, ఐకాస నాయకులు అయిల్నేని సాగర్ రావు, మహంకాళి రాజన్న, సిరిసిల్ల శ్రీనివాస్, పుల్లూరి సత్యనారాయణ, సిరిసిల్ల రాజేందర్ శర్మ, చీటి శ్రీనివాస్ రావు లు మాట్లాడారు జాతీయ అధ్యక్షులు రామారావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు కిషన్ రెడ్డి ప్రసంగిస్తూ...

ఈడబ్లూఎస్ సర్టిఫికెట్ జారీకి షరతులు లేని 5 ఏళ్ల కాలపరిమితి కలిగి ఉండేలా చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈడబ్ల్యూఎస్ విద్యార్థులకు విద్యా, ఉద్యోగ పోటీ పరీక్షల వయోపరిమితి పెంచాలని, ఈడబ్లూఎస్ వారికి కేటాయించిన మిగిలి పోయిన బ్యాక్ లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు.

ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ జారీకి వార్షిక ఆదాయ పరిమితి 10 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. టెట్ రాత పరీక్ష అర్హతకు 90 మార్కుల నుంచి 70 మార్కులకు తగ్గించాలని ,కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలను వర్తింప చేయాలని కోరారు. తమ డిమాండ్లను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టికి తీసుకెళ్ళేందు కోసం జనవరి 11 న సాయంత్రం 3 గంటలకు హన్మకొండ లోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ గ్రౌండ్ లో లక్ష మందితో నిర్వహించే రాష్ట్ర స్థాయి "ఓసి ల సింహగర్జన" భారీ బహిరంగ సభకు ఓసి లంతా రాజకీయాల కతీతంగా అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఐకాస జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు పిలుపు నిచ్చారు.

ఈ సందర్భంగా సింహగర్జన బహిరంగ సభకు సంబంధించిన వాల్ పోస్టర్, కరపత్రాలను ఐకాస నాయకులు ఆవిష్కరించారు.

ఈసమావేశంలో నాయకులు మోతే ఉమాపతి శర్మ, వెంకటేశ్వర్ రావు,దేవరశెట్టి జనార్దన్, బద్దం నారాయణ రెడ్డి, మందల గోపాల్ రెడ్డి, నవీన్ రెడ్డి,నాగిశెట్టి అపర్ణ, అయిల్నేని స్వప్న, పురుషోత్తం రావు, సందీప్ రావు, సిరిసిల్ల వేణుగోపాల్, చంద్రశేఖర్,తదితరులు పాల్గొన్నారు.

## ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యం




**మిర్యాలగూడ, డిసెంబర్ 29 పెన్ పవర్:** మిర్యాలగూడ రైల్వేస్టేషన్‌లో నూతనంగా నిర్మించిన రైల్వే రక్షణ దళ కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం సౌత్ సెంట్రల్ రైల్వే ఐజీ ఆరోమాసింగ్ ఠాకూర్ మాట్లాడుతూ, రైలు ప్రయాణికుల భద్రతకు పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. ప్రయాణికులు సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చేందుకు ఆధునిక రక్షణ చర్యలు తీసుకుంటున్నామని, దక్షణమధ్య రైల్వే పరిధిలోని స్టేషన్లలో భద్రతా బృందాలను పెంచి సెల్‌ఫోన్, చైన్ స్నాచింగ్ వంటి నేరాలను అరికట్టే చర్యలు తీసుకుంటున్నామని ఆమె వెల్లడించారు.

## నల్లగొండ మున్సిపల్ కమిషనర్‌కు పదోన్నతి

**నల్లగొండ, డిసెంబర్ 29 పెన్ పవర్:** నల్లగొండ మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్‌కు గ్రేడ్–1 మున్సిపల్ కమిషనర్‌గా పదోన్నతి కల్పిస్తూ సీడీఎంఏ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం గ్రేడ్–2 కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న ముసాబ్ అహ్మద్‌కు ఈ పదోన్నతి లభించింది. పదోన్నతి పొందిన ఆయనకు మున్సిపల్ కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

## చలి వణికిస్తున్నా.. తొణకరు.. బెణకరు

**దేవరకొండ, డిసెంబర్ 29 పెన్ పవర్:** ఉమ్మడి నల్గొండ జిల్లాను చలితీవ్రత వణికిస్తోంది. తెల్లారినా.. మంచుదుప్పట్లు తొలగి భానుడి కిరణాలు నేలను తాకేంతవరకు ప్రజలు ఇళ్లు కదలని పరిస్థితి. కానీ..కాలం ఏదైనా సరే కోడికూతతోనే మేల్కొని తమ రోజువారి విధుల్లో నిమగ్నం అయ్యేవారున్నారు. వారు కూడా ముసుగు తన్నేసి ఇల్లు కదలనంటే పల్లె, పట్నం జనజీవనం నిలిచిపోవాల్సిందే మరి.

## కామారెడ్డి జిల్లాలో నాటు బాంబు కలకలం

**కామారెడ్డి, డిసెంబర్ 29 పెన్ పవర్:** కామారెడ్డి మండలం గర్గుల్ గ్రామంలో శనివారం ఉదయం మొగుళ్ల సాయాగౌడ్ పంట చేనులో నాటు బాంబు పేలింది. నీళ్లు పారించడానికి వెళ్ళిన సాయాగౌడ్ తమ్ముడు రామా గౌడ్ భారీ శబ్దం విని వెళ్లి చూడగా, ఒక కుక్క తల పగిలి మృతి చెంది ఉంది. గుర్తు తెలియని వ్యక్తులు తమ పంట చేనులో బాంబులు పడేసి ఉండవచ్చని, అది తెలియని కుక్క నోట పట్టుకోవడంతో పేలి మృతి చెందిందని అనుమానిస్తున్నారు. తమకు హాని చేయడానికే బాంబులు పడేసి ఉంటారని రైతు సాయాగౌడ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అడవి పందుల కోసం పెట్టారా లేక కావాలని పెట్టారా అనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు.

## కరెంట్ బిల్లు కట్టలేదని విద్యుత్ సరఫరా నిలిపివేత

**నిజామాబాద్ అర్బన్, డిసెంబర్ 29 పెన్ పవర్:** జక్రాన్పల్లిలో వ్యవసాయ మోటార్ల కరెంట్ బిల్లు చెల్లించలేదని లైన్మెన్ రైతుల పొలాలకు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. బిల్లు చెల్లించడానికి కొంత సమయం కోరినా వినకుండా ట్రాన్స్ఫార్మర్ కు విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో, డబ్బులు కట్టిన రైతులకి కూడా విద్యుత్ సరఫరా ఆగిపోయింది. ప్రభుత్వ పథకాలు ఉన్నా, గడువు ఇవ్వకుండా విద్యుత్ సరఫరా నిలిపివేయడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ, లైన్మెన్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## సినిమా డైరెక్టర్‌గా కామారెడ్డి యువకుడు

**నిజామాబాద్ రూరల్, డిసెంబర్ 29 పెన్ పవర్:** పిట్లంకు చెందిన యువకుడు తుకారాం, సాధారణ గ్రామీణ నేపథ్యం నుంచి సినీ రంగంలో రాణిస్తున్నా రు. ఆయన దర్శకత్వం వహించిన తొలి చిత్రం 'కాగితం పడవలు' సుమారు రూ.5 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కింది. ఈ సినిమా టీజర్‌ను ఈ నెల 27న విడుదల చేశారు. గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చిన తనకు సినిమా రంగంపై ఉన్న మక్కువతో ఎన్నో సవాళ్లను అధిగమించి ఈ స్థాయికి చేరుకున్నానని తుకారాం తెలిపారు.

## అబద్ధాలకు భయపడేది లేదు..

**ఆర్మూర్, డిసెంబర్ 29 పెన్ పవర్:** సోమార్పేట్ ఘటనతో తనకు సంబంధం ఉందని సోషల్ మీడియాలో జరుగుతున్న దుష్ప్రచారాన్ని ఎల్లారెడ్డి మండల మాజీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కురుమ సాయిబాబా తీవ్రంగా ఖండించారు. ఇది రాజకీయ దురుద్దేశంతో కూడుకున్న చర్య అని, ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో తన ప్రభావాన్ని, ఎమ్మెల్యేతో తనకున్న సాన్నిహిత్యాన్ని చూసి ఓర్వలేక ప్రత్యర్థులు ఆడుతున్న డ్రామా అని ఆయన సోమవారం అన్నారు. ప్రజలతో ఉండే తన నిజాయితీ అందరికీ తెలుసని, చేతకానివారే వెన్నుపోటు పొడుస్తారని, దమ్మున్నవాడు ప్రజాక్షేత్రంలో గెలుస్తాడని, తప్పుడు ప్రచారాలు మానుకోకుంటే ప్రజలే బుద్ధి చెబుతారని ఆయన హెచ్చరించారు.

## రంగారెడ్డి జిల్లాలో భయం భయం



**ఇబ్రహీంపట్నం, డిసెంబర్ 29 పెన్ పవర్:** మాడ్గుల మండల పరిధిలోని ఆవురుపల్లి గ్రామంలో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్న పట్టించుకునే నాధుడు కరువయ్యాడని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పదుల సంఖ్యలో కుక్కలు రోడ్డుపై సంచరిస్తూ భయాందోళనకు గురిచేస్తున్నాయి. రోడ్డుపై వెళ్లే వాహనదారుల తో పాటు, చిన్నపిల్లలు రోడ్డు పైకి రావాలంటే భయభ్రాంతులకు గురవుతున్నారు. ఈ కుక్కల వల్ల ఎప్పుడు ప్రమాదం సంభవిస్తుందో అని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం జరగకముందే సంబంధిత అధికారులు స్పందించి ప్రమాద నివారణకు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## నిరుద్యోగులకు భృతి, యువ వికాసం: ప్రగతిశీల యువజన సంఘం డిమాండ్

**నాంపల్లి, డిసెంబర్ 29 పెన్ పవర్:** ప్రగతిశీల యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు రాకేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. రామకృష్ణ హైదరాబాద్‌లో మాట్లాడుతూ, ఉద్యోగ అవకాశాలు కల్పించి నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ వాగ్దానం చేసిన యువ వికాసం పథకాన్ని అమలు చేయాలని, నిరుద్యోగ యువతకు నెలకు 4,000 రూపాయల భృతి ఇవ్వాలని కోరారు. ఉపాధి అవకాశాలు కల్పించి నిరుద్యోగుల భవిష్యత్తును కాపాడాలని వారు అన్నారు.

## మందుబాబులకు ఎస్పీ వార్నింగ్

**జూబ్లీహిల్స్, డిసెంబర్ 29 పెన్ పవర్:** హైదరాబాద్‌లో డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వారు తమ పలుకుబడిని ఉపయోగించవద్దని సీపీ సుధీర్‌బాబు హెచ్చరించారు. 'నేనెవరో, మా డాడీ తెలుసా, అన్న ఎవరో తెలుసా అని అధికారులను అడగొద్దు. మీ ప్రైవసీకి మర్యాద ఇస్తాం. వాహనం పక్కన పెట్టి డేట్ వచ్చిన రోజు కోర్టులో పరిచయం చేసుకుందాం' అని ఆయన తనదైన శైలిలో హెచ్చరికలు జారీ చేశారు. మద్యం తాగి వాహనం నడిపితే ఉపేక్షించేది లేదని ఆయన స్పష్టం చేశారు.

## అర్ధరాత్రి నాలుగు దుకాణాలలో చోరీ కలకలం



**మెదక్, డిసెంబర్ 29 పెన్ పవర్:** కొల్చారం మండలంలోని దుంపలకుంట చౌరస్తాలో అర్ధరాత్రి దాటిన తర్వాత గుర్తు తెలియని వ్యక్తులు నాలుగు దుకాణాల షట్టర్ తాళాలు పగలగొట్టి, రూ.రెండున్నర లక్షల నగదుతో పాటు బంగారు, వెండి వస్తువులు, 5 సెల్ ఫోన్లు, దుస్తులు ఎత్తుకెళ్లారు. కిరాణా దుకాణం, సెల్ ఫోన్ దుకాణం, మెడికల్ షాపు, బట్టల దుకాణాలలో ఈ చోరీలు జరిగాయి. సోమవారం ఉదయం బాధితులు పోలీసులకు సమాచారం అందించగా, సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

## స్వయంగా ట్రాక్టర్ నడుపుతూ ఇంటింటికి చెత్తను సేకరించిన సర్పంచ్

**దుబ్బాక, డిసెంబర్ 29 పెన్ పవర్:** సిద్ధిపేట జిల్లా దుబ్బాక నియోజకవర్గంలోని బొప్పాపూర్ గ్రామ సర్పంచ్ మాదవనేని భాను ప్రసాద్ స్వచ్ఛతకు శ్రీకారం చుట్టారు. బాధ్యతలు స్వీకరించిన తర్వాత, ప్రజలకు చేతల్లో సేవ చేయాలనే సంకల్పంతో, స్వయంగా గ్రామ పంచాయతీ ట్రాక్టర్ నడిపి ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. నాయకుడు ముందు నడిస్తేనే ప్రజల్లో మార్పు వస్తుందని ఆయన అన్నారు.

## చైనామాంజాను విక్రయించడం చట్టరీత్యా నేరము

**సిద్దిపేట, డిసెంబర్ 29 పెన్ పవర్:** సిద్ధిపేట టూ టౌన్ పోలీసులు పట్టణంలోని గాలిపటాలు, మాంజా విక్రయ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ప్రభుత్వం నిషేధించిన 'చైనా మాంజా'ను విక్రయించడం చట్టరీత్యా నేరమని, నిబంధనలు అతిక్రమిస్తే దుకాణాల లైసెన్సులు రద్దు చేయడంతో పాటు కేసులు నమోదు చేస్తామని ఇన్స్పెక్టర్ ఉపేందర్ తెలిపారు. ఈ గ్లాస్ కోటెడ్ చైనా మాంజా వల్ల పక్షులు, పశువులతో పాటు ద్విచక్ర వాహనాల ప్రయాణికులు తీవ్ర గాయాలపాలవుతున్నారని ఆయన పేర్కొన్నారు.

## చెకుముకి పోటీల్లో ప్రథమ స్థానంలో సిద్ధిపేట జిల్లా

**గజ్వేల్, డిసెంబర్ 29 పెన్ పవర్:** సిద్దిపేట అర్బన్ మండల విద్యాధికారి ప్రభాకర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం, రాష్ట్రస్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ పరీక్షలో సిద్దిపేట జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. జిల్లాలోని ఇందిరానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సానియా, రక్షిత, రామ్ చరణ్ లు రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతిని సాధించారు. వీరి అద్భుత ప్రతిభను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం అభినందించారు. భవిష్యత్తులోనూ పాఠశాలను అన్ని సబ్జెక్టులలో అగ్రగామిగా నిలబెట్టాలని సూచించారు.

## వైకుంఠ ఏకాదశికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

**హుస్నాబాద్, డిసెంబర్ 29 పెన్ పవర్:** దుబ్బాక పట్టణంలోని వెంకటేశ్వరాలయంలో ఈనెల 30న వైకుంఠ ఏకాదశి సందర్భంగా నిర్వహించనున్న 'ఉత్తర ద్వార దర్శనం' సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్ సరఫరా, క్యూలైన్లు, టాయిలెట్ల సౌకర్యం వంటి విషయాల్లో లోటుపాట్లు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్, విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు.

## ఆర్టీసీ బస్సులో గుండెపోటుతో వృద్ధుడి మృతి

**నాగర్‌కర్నూల్, డిసెంబర్ 29 పెన్ పవర్:** సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న ఓ వృద్ధుడు గుండెపోటుతో మృతి చెందాడు. కల్వకుర్తి వెళ్లేందుకు భార్యతో కలిసి బస్సు ఎక్కిన అతన్ని టికెట్ కోసం కండక్టర్ పలకరించగా స్పందించలేదు. బస్సు సిబ్బంది అతన్ని కిందకు దించి సీపీఆర్ చేసినా ఫలితం లేకపోయింది. అనంతరం 108 అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

## కారు బోల్తా.. డ్రైవర్ సురక్షితం

**అచ్చంపేట, డిసెంబర్ 29 పెన్ పవర్:** నాగర్ కర్నూల్ జిల్లా తాడూరు మండలంలోని అల్లాపూర్ గేటు వద్ద సోమవారం ఒక కారు అదుపుతప్పి బోల్తా పడింది. అతివేగం కారణంగా ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. అదృష్టవశాత్తూ డ్రైవర్ స్వల్ప గాయాలతో సురక్షితంగా బయటపడ్డారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానిక రైతులు స్పందించి డ్రైవర్‌కు సహాయం అందించారు. ఘటనపై మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

## నల్లమలలో గుప్త నిధుల తవ్వకాల కలకలం

**కొల్లాపూర్, డిసెంబర్ 29 పెన్ పవర్:** నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని నల్లమల అడవిలో గుప్తనిధుల తవ్వకాల కోసం వచ్చిన 15 మంది ముఠా సభ్యులను అర్ధరాత్రి అటవీ శాఖ అధికారులు అరెస్ట్ చేశారు. కొల్లాపూర్ మండలం మొలచింతపల్లి గ్రామానికి సమీపంలోని చలి బొందల ప్రదేశంలో ఉన్న పురాతన శివాలయం గుహలో గుప్తనిధులు ఉన్నాయని భావించి, కుడికిళ్ల గ్రామానికి చెందిన బంగారయ్య అనే వ్యక్తి తన అనుచరులతో కలిసి ఈ ముఠాను ఏర్పాటు చేశాడు. రాళ్లు కొట్టే పని ఉందని చెప్పి, ఒక్కొక్కరికి రూ. 10వేలు అడ్వాన్స్ ఇచ్చి, జనరేటర్, తిండి వస్తువులతో సహా 16 మందిని అక్కడికి తరలించాడు. అటవీ అధికారుల నిఘాలో పడి, గుప్తనిధుల తవ్వకాలకు ప్రయత్నిస్తున్నారని నిర్ధారించుకున్నాక, అధికారులు వారిని అదుపులోకి తీసుకున్నారు.

## గ్రామ పంచాయతీకి పూజ చేసి బాధ్యతలు స్వీకరించిన సర్పంచ్

**నారాయణపేట, డిసెంబర్ 29 పెన్ పవర్:** నారాయణపేట మండలం కోటకొండ గ్రామంలో, గ్రామ పంచాయతీకి పూజ చేసి, గ్రామ సర్పంచ్ వెంకట్రాములు గౌడ్, ఉపసర్పంచ్ చెన్నప్ప యాదవ్, మరియు వార్డు సభ్యులు తమ పదవీ బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా వారికి శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. ఈ సంఘటన గ్రామ ప్రజలలో నూతన ఆశలను రేకెత్తించింది.

## కోటకొండ ప్రభుత్వ ఆసుపత్రి సమస్యలపై సర్పంచ్ దృష్టి

**మక్తల్, డిసెంబర్ 29 పెన్ పవర్:** నారాయణపేట మండలం కోటకొండ గ్రామంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను గ్రామ సర్పంచ్ ఇ వెంకట్ రాములు గౌడ్, మాజీ ఎంపిటిసి కించ శ్రీనివాసులు, వార్డ్ సభ్యులు కోస్గి లక్ష్మప్ప, గాజుల భగవాన్ శంకర్, మరియు ఇతర నాయకులు పరిశీలించారు. ఆసుపత్రిలో లేని వస్తువులను త్వరలోనే తీసుకు వస్తామని సర్పంచ్ హామీ ఇచ్చారు.

## కన్నకూతురిపై తండ్రి అఘాయిత్యం..!

**గద్వాల, డిసెంబర్ 29 పెన్ పవర్:** గద్వాల జిల్లాలో కన్నకూతురిపై తండ్రే లైంగిక దాడికి పాల్పడిన దారుణం ఆలస్యంగా వెలుగుచూసింది. తన 16 ఏళ్ల మైనర్ కుమార్తెపై పలుమార్లు లైంగిక దాడి చేయడంతో ఆమె గర్భం దాల్చింది. బాధితురాలు నిందితుడి రెండో భార్య కుమార్తె కావడం గమనార్హం. తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి, నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

# చెట్టు కోసం అలైన్ మెంట్ మార్పు...

**హైదరాబాద్, డిసెంబర్ 29,పెన్ పవర్:** వినాశనం లేకుండా వికాసం సాధ్యం కాదు అంటారు. ఇప్పటివరకు జరిగిన వికాసం మొత్తం వినాశనం తర్వాతే చోటుచేసుకుంది. ఇప్పటికైతే ప్రకృతి తన వినాశనాన్ని తట్టుకుంది కానీ.. ఇకపై తట్టుకునే అవకాశం లేదు. ఎందుకంటే ఇప్పటికే ప్రకృతిలో అనేక రకాల మార్పులు చోటుచేసుకుంటుంది. కాలం కాని కాలంలో వర్షాలు కురుస్తున్నాయి. ఎండల గురించి, శీతల గాలుల గురించి ఇక ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు.. దాని పర్యవసనాలు మనిషి జీవితం మీద తీవ్రమైన ప్రభావం చూపిస్తున్నాయి. వినాశనం లేకుండా వికాసం వైపు అడుగులు వేయాలంటే సాధ్యమయ్యే పని కాదు. అయితే దీనిని సాధ్యం చేసి చూపించారు. అది కూడా తెలంగాణ రాష్ట్రంలో..తెలంగాణ రాష్ట్రంలో హైదరాబాద్ నగరానికి దగ్గరలో ఉన్న ఔటర్ రింగ్ రోడ్డు ను ఆనుకుని బీజాపూర్ రహదారి నిర్మిస్తున్నారు. 2018లో ఈ రోడ్డు విస్తరణకు కేంద్ర ప్రభుత్వం పచ్చ జెండా ఊపింది. అయితే ఎన్ని రోజులపాటు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ లో ఈ కేసు పెండింగ్లో ఉంది. దీంతో ఇన్ని సంవత్సరాలపాటు ఈ రోడ్డు నిర్మాణం ఆగిపోయింది.నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ లో కేసు పరిష్కారం కావడంతో రోడ్డు నిర్మాణ పనులకు మోక్షం లభించింది. 18 నెలల కాలంలోనే ఈ పనులు పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. తెలంగాణ పోలీస్ అకాడమీ వద్ద ఉన్న ఔటర్ రింగ్ రోడ్డు నుంచి మొయినాబాద్, చేవెళ్ల మీదుగా మన్నెగూడ వరకు బీజాపూర్ రోడ్డు విస్తరణ చేస్తున్నారు. దాదాపు 46 కిలోమీటర్ల మేర ఉన్న ఈ రహదారిని 60 మీటర్ల వెడల్పుతో నాలుగు వరుసలలో నిర్మిస్తున్నారు. ఈ రోడ్డు నిర్మాణానికి కేంద్రం ఏకంగా 956 కోట్ల నిధులను మంజూరు చేసింది. బైపాస్ రోడ్డు ను చేవెళ్ల, మొయినాబాద్ ప్రాంతాలలో నిర్మిస్తున్నారు. ఎనిమిది నెలల క్రితం బైపాస్ రోడ్డు పనులు పూర్తయ్యాయి. ఇప్పటివరకు 50 శాతం పనులను పూర్తి చేశారు. గత నెల 3న చేవెళ్ల మండలంలో మీర్జాగూడ ప్రాంతంలో ఆర్టీసీ బస్సు, టిప్పర్ ఢీ కొట్టుకున్నాయి. ఈ ప్రమాదంలో 19 మంది చనిపోయారు. దీంతో ప్రభుత్వం అప్రమత్తమైంది.. నేరుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ పనులను పర్యవేక్షిస్తున్నారు. దాదాపు ఈ రోడ్డు నిర్మాణంలో 15 అండర్ పాస్ లను నిర్మిస్తున్నారు. ఈ రోడ్డు హైదరాబాద్ నుంచి కర్ణాటక రాష్ట్రాన్ని కలుపుతూ ఉంటుంది. వాహన రద్దీకి అనుగుణంగా ఈ రోడ్డును నిర్మిస్తున్నారు. ఇది గతంలో అంతరాష్ట్ర రహదారిగా ఉంది. 2018లో కేంద్రం దీన్ని జాతీయ రహదారిగా గుర్తించింది. దీనికి ఎన్ హెచ్ 163 అని పేరు పెట్టింది. ఈ రోడ్డుకు ఇరువైపులా మర్రి చెట్లు ఉన్నాయి. రోడ్డు నిర్మాణంలో మర్రి చెట్లను తొలగించకూడదని ఓ సంస్థ చెన్నైలోని గ్రీన్ ట్రిబ్యునల్ ను ఆశ్రయించింది. దీంతో పనులు ఎక్కడికి అక్కడ ఆగిపోయాయి. ఈ క్రమంలోనే మర్రి చెట్లను తొలగించకుండా అలైన్మెంట్లో మార్పులు చేశారు. దీంతో మరి చెట్లు అలాగే ఉన్నాయి. రోడ్డు నిర్మాణంలో ఆ లైన్ మెంట్ మార్పు వల్ల చెట్లు బతికి బట్ట కట్టాయి.

# ఇందిరమ్మ ఇళ్ల పథకం.. 32.98 లక్షల మందికి ఇళ్లు రద్దు.

**ఖమ్మం, డిసెంబర్ 29,పెన్ పవర్:** తెలంగాణ ప్రభుత్వం నిరుపేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు 'ఇందిరమ్మ ఇళ్ల' పథకాన్ని వేగవంతం చేసింది. రాబోయే రెండేళ్లలో 9 లక్షల ఇళ్లను అర్హులైన ఎల్–1 జాబితాలోని లబ్ధిదారులకు మంజూరు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. సొంత స్థలం ఉండి ఇల్లు లేని వారికి ప్రాధాన్యత ఇస్తూ, మిగిలిన వారికి తర్వాతి దశల్లో అవకాశం కల్పించనుంది. అయితే ఎల్–3 జాబితాలోని దాదాపు 32.98 లక్షల ఇండ్లను రద్దు చేసేందుకు యోచిస్తోంది.తెలంగాణ రాష్ట్రంలో నిరుపేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఇందిరమ్మ ఇళ్ల' పథకం కార్యాచరణ వేగవంతమైంది. రాబోయే రెండేళ్లలో అర్హులైన లబ్ధిదారులకు పెద్ద ఎత్తున ఇళ్లను మంజూరు చేసేందుకు యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. ఈ పథకంలో భాగంగా ఏడాదికి 4.50 లక్షల ఇళ్ల చొప్పున.. రెండు సంవత్సరాల్లో మొత్తం 9 లక్షల ఇళ్లను పంపిణీ చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అయితే.. ఈ ప్రాధాన్యతను కేవలం ఎల్–1 జాబితాలో ఉన్న లబ్ధిదారులకే పరిమితం చేయాలని నిర్ణయించడం గమనార్హం.ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం మొత్తం 77,68,134 దరఖాస్తులు వచ్చాయి. ఇంటింటి కుటుంబ సర్వే ద్వారా ప్రభుత్వం వీటిని నిశితంగా పరిశీలించి మూడు వర్గాలుగా (ఎల్–1, ఎల్–2, ఎల్–3) విభజించింది. సొంత స్థలం ఉండి, నివసించడానికి ఇల్లు లేని అత్యంత నిరుపేదలను ఎల్–1 జాబితాలో చేర్చారు. ఈ విభాగంలో 23,20,490 మంది దరఖాస్తుదారులు ఉండగా.. ప్రస్తుత, రాబోయే రెండేళ్ల కేటాయింపులు కలిపి మొత్తం 13.50 లక్షల మందికి లబ్ధి చేకూరనుంది. మిగిలిన 9.70 లక్షల మంది దరఖాస్తుదారులకు తర్వాతి దశల్లో అవకాశం కల్పించనున్నారు.మరోవైపు.. ఇటు స్థలం, అటు ఇల్లు రెండూ లేని నిరుపేదలను ఎల్–2 జాబితాలో




చేర్చారు. వీరి సంఖ్య సుమారు 21.49 లక్షలుగా ఉంది. వీరికి ఇంటి స్థలంతో పాటు రూ. 5 లక్షల నిర్మాణ సాయం అందించడంపై ప్రభుత్వం ఇంకా తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. స్థలాల లభ్యతను బట్టి బ్లాక్‌ల వారీగా ఇళ్లను నిర్మించి ఇవ్వాలనే యోచనలో కూడా అధికారులు ఉన్నారు. ఇక ఆదాయపు పన్ను చెల్లింపుదారులు, ప్రభుత్వ ఉద్యోగులు, ఇప్పటికే సొంత ఇల్లు ఉన్నవారిని ఎల్–3 జాబితాలో చేర్చి వారిని అనర్హులుగా గుర్తించినట్లు సమాచారం. ఈ జాబితాలో సుమారు 32.98 లక్షల మంది ఉన్నారు. వీరికి ఇళ్ల కేటాయింపు రద్దు చేయనున్నట్లు సమాచారం.ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో గ్రేటర్ హైదరాబాద్ మినహా రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 3,69,014 మందికి ఇళ్లు మంజూరు చేయగా.. అందులో 2.45 లక్షల ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో కొనసాగుతున్నాయి. ప్రభుత్వం ప్రతి నియోజకవర్గానికి సమాన ప్రాతిపదికన ఇళ్లను కేటాయించాలని చూస్తోంది. కేవలం పాత దరఖాస్తులే కాకుండా, కొత్తగా వచ్చిన 1.66 లక్షల అర్జీలను కూడా పరిశీలిస్తోంది. పారదర్శకమైన ఎంపిక ద్వారా నిజమైన పేదలకు గూడు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ రెండేళ్ల కార్యాచరణను రూపొందించింది.

# ఫస్ట్ నుంచి నూమాయిష్...

**హైదరాబాద్, డిసెంబర్ 29,పెన్ పవర్:** బాగ్యనగర సంస్కృతికి నిదర్శనమైన నాంపల్లి నుమాయిష్ 85వ ఎడిషన్ జనవరి 1 నుంచి ప్రారంభం కానుంది. ఈ ప్రదర్శన ఫిబ్రవరి 15 వరకు మొత్తం 46 రోజుల పాటు కొనసాగుతుందని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు.దేశవిదేశాలకు చెందిన సుమారు 2,000 స్టాళ్లను ఇక్కడ ఏర్పాటు చేస్తున్నారు. ప్రవేశ రుసుము రూ.50 కాగా.. ఐదేళ్ల లోపు పిల్లలకు ఉచితం. సందర్శకుల కోసం ఉచిత పార్కింగ్, మెట్రో రాత్రి 12 గంటల వరకుఅందుబాటులో ఉంటాయి. అగ్నిప్రమాదాల నివారణకు 82 ఫైర్ పాయింట్లు, ప్రత్యేక నిఘా టవర్లను ఏర్పాటు చేశారు.హైదరాబాద్ సంస్కృతిలో విడదీయలేని భాగమైన ఆల్ ఇండియా ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్ (నుమాయిష్) మరోసారి అలరించేందుకు సిద్ధమైంది. జనవరి 1వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ఈ ప్రదర్శన గురించి రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదివారం కీలక వివరాలను వెల్లడించారు.సుమారు 85 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ ప్రదర్శన.. హైదరాబాద్ వాసులకు కేవలం షాపింగ్ వేదిక మాత్రమే కాదు.. ఒక భావోద్వేగంతో కూడిన వేడుక అని ఆయన పేర్కొన్నారు.85వ నుమాయిష్ జనవరి 1 నుంచి ఫిబ్రవరి 15 వరకు మొత్తం 46 రోజుల పాటు వైభవంగా సాగనుంది. జనవరి 1న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క , మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఈ ప్రదర్శనను అధికారికంగా ప్రారంభిస్తారు. సాధారణ రోజుల్లో ప్రతిరోజూసాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 10.30 గంటల వరకు ఉంటుంది. శని, ఆదివారాలు మరియు ప్రభుత్వ సెలవు దినాల్లో రాత్రి 11 గంటల వరకు సందర్శకులకు అనుమతి ఉంటుంది.ప్రవేశ రుసుము ఒక్కొక్కరికి50 రూపాయలుగా నిర్ణయించారు. అయితే.. 5 ఏళ్లలోపు పిల్లలకు ప్రవేశం పూర్తిగా



ఉచితం. ఈసారి నుమాయిష్‌లో గతంలో కంటే ఎక్కువ స్టాళ్లు, వైవిధ్యమైన ఉత్పత్తులు అందుబాటులో ఉండనున్నాయి. దేశ విదేశాలకు చెందిన ఉత్పత్తులతో మొత్తం 2,000 కంటే ఎక్కువ స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నారు. సుమారు 1,050 మంది తయారీదారులు, కళాకారులు తమ నైపుణ్యాన్ని ఇక్కడ ప్రదర్శించనున్నారు.మహిళాపారిశ్రామికవేత్తలను ప్రోత్సహించే ఉద్దేశంతో వారికి స్టాళ్ల కేటాయింపులో ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యతనిచ్చింది. రిజర్వ్ బ్యాంక్, అటవీ శాఖ, పర్యాటక శాఖ వంటి ప్రభుత్వ విభాగాలు కూడా తమ సేవలపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నాయి. సందర్శకుల కోసం 20కి పైగా ఫుడ్ కోర్టులు అందుబాటులో ఉంటాయి. ఇక్కడ హైదరాబాద్ ప్రత్యేక రుచులతో పాటు వివిధ ప్రాంతాల వంటకాలను ఆస్వాదించవచ్చు.సుమారు 25 లక్షల మంది సందర్శకులు వస్తారని అంచనా వేస్తున్న నేపథ్యంలో.. ప్రభుత్వం కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టింది. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని 82 ఫైర్ పాయింట్లుఏర్పాటు చేశారు. లక్షన్నర లీటర్ల సామర్థ్యం కలిగిన రెండు నీటి సంపులను సిద్ధం చేశారు. ప్రతి రెండు పాయింట్లకు ఒక అగ్నిమాపక సిబ్బంది పహారా కాస్తారు. పర్యవేక్షణ కోసం ప్రత్యేక వాచింగ్ టవర్లు, సీసీటీవీ కెమెరాలను అమర్చారు. 330 మంది వలంటీర్లు సందర్శకులకు సహకరించనున్నారునాంపల్లి, గాంధీ భవన్ మెట్రో స్టేషన్ల నుంచి రాత్రి 12 గంటల వరకు మెట్రో రైళ్లు అందుబాటులో ఉంటాయి. ఆర్టీసీ కూడా ప్రత్యేకబస్సులను నడిపిస్తోంది. సందర్శకుల కోసం ఉచిత పార్కింగ్ సౌకర్యాన్ని కూడా కల్పించారు.నుమాయిష్ కేవలం వ్యాపార కేంద్రం మాత్రమే కాదు.. ఒక విద్యా నిధి కూడా. ఈ ఎగ్జిబిషన్ ద్వారా వచ్చే ఆదాయంతో ఎగ్జిబిషన్‌సొసైటీ సుమారు 19 విద్యా సంస్థలను నిర్వహిస్తోంది. ఇందులో దాదాపు 30 వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. 2 వేల మంది సిబ్బంది పని చేస్తున్నారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యనుఅందించడంలో ఈ ప్రదర్శన కీలక పాత్ర పోషిస్తోంది. షాపింగ్, వినోదం , సామాజిక సేవల కలయికగా సాగే నాంపల్లి ఎగ్జిబిషన్, ఈ ఏడాది కూడా హైదరాబాద్ వాసులకు సరికొత్త అనుభూతిని అందించబోతోంది.

# సింగిల్ డిజిట్ కు టెంపరేచర్

**హైదరాబాద్, డిసెంబర్ 29, పెన్ పవర్:** తెలంగాణ రాష్ట్రాన్ని తీవ్రమైన చలి వణికిస్తోంది. గత కొన్ని రోజులుగా ఉత్తర, దక్షిణ జిల్లాల్లో ఉష్ణోగ్రతలు కనిష్ఠ స్థాయికి పడిపోతున్నాయి. ముఖ్యంగా శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు నమోదైనగణాంకాలను పరిశీలిస్తే.. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(యు)లో అత్యల్పంగా 7.1 డిగ్రీలు, సంగారెడ్డి జిల్లా కోహీర్‌లో 7.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆదిలాబాద్, రంగారెడ్డి, కామారెడ్డి, మెదక్,నిర్మల్ వంటి జిల్లాల్లో కూడా ఉష్ణోగ్రతలు 10 డిగ్రీల లోపే ఉండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. రాబోయే సోమ, మంగళవారాల్లో చలి ఇంకా పెరిగే అవకాశం ఉందని.. సాధారణం కంటే 2 నుంచి 3 డిగ్రీలుతక్కువగా ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వాతావరణ శాఖ 14 జిల్లాలకు 'ఆరెంజ్' అలర్ట్ జారీ చేసింది.ఈ తీవ్రమైన చలి గాలుల నేపథ్యంలో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవడం అత్యవసరమని ఆరోగ్య నిపుణులుచెబుతున్నారు. చలి ప్రభావం వల్ల కేవలం జలుబు, దగ్గు మాత్రమే కాకుండా.. రక్తపోటు పెరగడం, కీళ్ల నొప్పులు, శ్వాసకోశ ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని ముఖ్యంగా వృద్ధులు, చిన్న పిల్లలు, గర్భిణీలు ఈసమయంలో బయట తిరగకపోవడమే మంచిదని చెబుతున్నారు. చలి నుంచి రక్షణ పొందడానికి ఉన్ని దుస్తులు, స్వెటర్లు, మఫ్లర్లు, సాక్సులు తప్పనిసరిగా ధరించాలని.. పడక గదిలో వెచ్చదనం ఉండేలాచూసుకోవాలన్నారు.ఎప్పుడూ వేడిగా ఉండే తాజా ఆహారాన్ని తీసుకోవాలని.. ఇది శరీరాన్ని లోపలి నుంచి వెచ్చగా ఉంచుతుందని చెబుతున్నారు. చలికాలంలో దాహం తక్కువగా వేస్తుంది, కానీ డీహైడ్రేషన్ బారినపడకుండా ఉండటానికి గోరువెచ్చని నీటిని తగినంతగా తాగుతూ ఉండాలని... అల్లం టీ, కషాయం లేదా సూప్‌లు తీసుకోవడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుందని అంటున్నారు. చలి వల్ల చర్మం పొడిబారి పగుళ్లు వచ్చేఅవకాశం ఉంటుంది, కాబట్టి మాయిశ్చరైజర్లు లేదా కొబ్బరి నూనెను రాసుకోవాలని సూచిస్తున్నారు. రాత్రి వేళల్లో, తెల్లవారుజామున చలి తీవ్రత ఎక్కువగా ఉంటుంది కాబట్టి.. ఆ సమయంలో ప్రయాణాలను వీలైనంతవరకు వాయిదా వేసుకోవాలని. ఒకవేళ బయటకు వెళ్లాల్సి వస్తే తల, చెవులను కప్పి ఉంచేలా జాగ్రత్త పడాలని చెబుతున్నారు.ఇంటి లోపల వెచ్చదనం కోసం నిప్పు రగిల్చినప్పుడు గాలి ఆడేలా చూసుకోవాలని..లేదంటే కార్బన్ మోనాక్సైడ్ వంటి విషవాయువుల వల్ల ప్రమాదం సంభవించవచ్చునని అంటున్నారు. వాతావరణ శాఖ హెచ్చరికలను గమనిస్తూ.. అప్రమత్తంగా ఉండటం ద్వారా ఈ చలి కాలం వచ్చే అనారోగ్యాల నుంచిమనల్ని మనం రక్షించుకోవచ్చునని చెబుతున్నారు.

# రాజాసింగ్ రీ ఎంట్రీ....?



**హైదరాబాద్, డిసెంబర్ 29, పెన్ పవర్:** తెలంగాణలో భారతీయ జనతా పార్టీ పరిస్థితి ముందు నుయ్యి.. వెనుక గొయ్యి అన్న చందంగా తయారైంది. మొన్నటి అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఆశాజనకమైన ఫలితాలు సాధించినప్పటికీ, ఆ తర్వాత ఆశించిన స్థాయిలో పార్టీ పుంజుకోలేకపోవడం ఇప్పుడు కమలనాథులను కలవరపెడుతోంది. క్షేత్రస్థాయిలో కేడర్ ఉన్నా, వారిని నడిపించే నాయకత్వ లోపం, అంతర్గత కుమ్ములాటలు పార్టీని రోజురోజుకూ బలహీనపరుస్తున్నాయి.ఈ స్తబ్దతను బద్దలు కొట్టేందుకు ఇప్పుడు అధిష్టానం రంగంలోకి దిగింది. ముఖ్యంగా, ఫైర్ బ్రాండ్, గోషామహల్ ఎమ్మెల్యే రాజా సింగ్ వంటి కీలక నేతలను తిరిగి పార్టీలో క్రియాశీలం చేయడం ద్వారా మళ్లీ పునర్జీవం పోసుకోవాలని భావిస్తోంది.ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ రాష్ట్ర నాయకత్వంపై తీవ్ర అసహనం వ్యక్తం చేసినట్లు విశ్వసనీయ సమాచారం. అధికారంలోకి వచ్చే అవకాశాలు ఉన్న రాష్ట్రంలో ఎందుకింత నిర్లక్ష్యం? ప్రతిపక్షంగా ఎందుకు విఫలమవుతున్నారు? అంటూ మోదీ రాష్ట్ర నేతలకు గట్టిగానే క్లాస్ పీకినట్లు తెలుస్తోంది. పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయకుండా, కేవలం గాలి వాటం విజయాలపై ఆధారపడటం సరికాదని ఆయన హెచ్చరించారు. దీంతో ఢిల్లీ పెద్దల ఆదేశాల మేరకు రాష్ట్ర నాయకత్వం ఆత్మశోధనలో పడింది. పార్టీ బలోపేతానికి ఉన్న ఏకైక మార్గం.. అలిగి దూరంగా ఉన్న పాతకాపులను, సిద్ధాంతపరంగా బలంగా ఉన్న నేతలను మళ్లీ దగ్గరకు చేర్చుకోవడమేనని డిసైడ్ అయ్యారు.తెలంగాణ బీజేపీ అంటే ఠక్కున గుర్తొచ్చే పేర్లలో రాజా సింగ్ ముందు వరుసలో ఉంటారు. కరుడుగట్టిన హిందూవాదిగా, గోషామహల్ టైగర్ గా ఆయనకున్న మాస్ ఫాలోయింగ్ అంతా ఇంతా కాదు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు ఒంటిచేత్తో సీటు గెలిపించిన చరిత్ర ఆయనది. అయితే, గత కొంతకాలంగా రాష్ట్ర నాయకత్వ పోకడ నచ్చక, తనకు తగిన ప్రాధాన్యత దక్కడం లేదనే ఆవేదనతో ఆయన పార్టీని తీవ్రంగా తప్పుబట్టారు. దీంతో ఆయన్ను పార్టీ సస్పెండ్ చేసింది. ఆయన మరే ఇతర పార్టీలో చేరకుండా అలాగే సొంతంగా పోరాడుతున్నారు.రాజా సింగ్ లాంటి నేత పార్టీకి దూరమవ్వడం అంటే.. పార్టీ తన కోర్ ఓటు బ్యాంకు అయిన హిందుత్వ ఓటు బ్యాంకు దూరం చేసుకోవడమేనని విశ్లేషకులు చెబుతున్నారు. సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండే యువత, క్షేత్రస్థాయిలో ఉండే హిందూ కార్యకర్తలు రాజా సింగ్ వైఖరికి మద్దతుగా నిలుస్తున్నారు. ఆయనను పక్కన పెట్టి పార్టీని నడపడం ఆత్మహత్యాసదృశ్యమని అనేకసార్లు రుజువైంది. రాజా సింగ్ లేని సభలు వెలవెలబోతుంటే, ఆయన అడుగుపెడితే వచ్చే ఊపు వేరుగా ఉంటుంది. ఈ విషయాన్ని ఇన్నాళ్లకు రాష్ట్ర నాయకత్వం గుర్తించినట్లుంది.రాజా సింగ్ ను తిరిగి పార్టీలో క్రియాశీలం చేసేందుకు, ఆయన అలక పాన్పు దింపేందుకు అధిష్టానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాష్ట్రంలో పార్టీని భ్రష్టుపట్టిస్తున్నారని, నిజమైన కార్యకర్తలకు న్యాయం జరగడం లేదని రాజా సింగ్ గతంలో బాహాటంగానే విమర్శలు చేశారు. ఆయన లేవనెత్తిన అంశాల్లో వాస్తవం ఉందని గ్రహించిన అధిష్టానం, ఆయన్ను బుజ్జగించి మళ్లీ ప్రధాన స్రవంతిలోకి తీసుకురావాలని రాష్ట్ర శాఖను ఆదేశించింది. రాజా సింగ్ రీ-ఎంట్రీ కేవలం ఒక వ్యక్తి రాక మాత్రమే కాదు.. అది పార్టీలో ఒక నూతన ఉత్తేజానికి నాంది అని కేడర్ భావిస్తోంది. హైదరాబాద్ లోనే కాకుండా, తెలంగాణ వ్యాప్తంగా ఆయన పర్యటిస్తే యువతలో మళ్లీ పార్టీ పట్ల ఆకర్షణ పెరుగుతుందన్నది రాజకీయ పండితుల విశ్లేషణ.నిజానికి రాష్ట్ర నాయకత్వంలో కొందరికి రాజా సింగ్ రాక ఇష్టం లేకపోయినా, ప్రస్తుత పరిస్థితుల్లో ఆయన అవసరం ఎంతైనా ఉందని ఒప్పుకోక తప్పని పరిస్థితి. కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటం చేయాలన్నా, బీఆర్ఎస్ ను దీటుగా ఎదుర్కోవాలన్నా రాజా సింగ్ వంటి గట్టి గొంతుక పార్టీకి అత్యవసరం. అందుకే, విభేదాలను పక్కనబెట్టి ఆయన్ను సాదరంగా ఆహ్వానించేందుకు రంగం సిద్ధమైంది.మొత్తానికి, మోదీ వార్నింగ్ తో తెలంగాణ బీజేపీలో మార్పు మొదలైంది. రాజా సింగ్ ను తిరిగి చేర్చుకోవడం ద్వారా పార్టీ తన
తప్పులను సరిదిద్దుకుంటున్నట్లు కనిపిస్తోంది. అయితే, ఇది కేవలం ఎన్నికల స్టంట్ లా కాకుండా, నిజమైన కార్యకర్తలకు, సిద్ధాంతానికి కట్టుబడి ఉన్న నేతలకు పట్టం కట్టేలా ఉండాలి. రాజా సింగ్ రాకతోనైనా తెలంగాణ బీజేపీలో నిద్రాణంగా ఉన్న కేడర్ మేల్కొంటుందా? పార్టీ మళ్లీ రేసులోకి వస్తుందా? అనేది రాబోయే రోజుల్లో తేలనుంది. కానీ ఒక్కటి మాత్రం నిజం.. రాజా సింగ్ లేని తెలంగాణ బీజేపీ ఉప్పు లేని పప్పు లాంటిదే!

# కొత్త ఏడాదిలో సేమ్ జోష్...

**హైదరాబాద్, డిసెంబర్ 29, పెన్ పవర్:**
తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయింది. రెండో ఏడాది పాలనపై ప్రజలు అనేక అంచనాలు పెట్టుకున్నారు. ఆమేరకు పాలన అందించలేకపోయినా.. పార్టీకి ఈ ఏడాది కూడా బాగా కలిసి వచ్చింది. 2025లో ఇందిరమ్మ ఇళ్లు, సన్నబియ్యం పథకం ప్రారంభించారు. ఇక జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు, పంచాయతీ ఎన్నికల్లో పార్టీ విజయం సాధించింది. దీంతో పార్టీపై ప్రజల్లో పెద్దగా వ్యతిరేకత లేదు అన్న భావన హస్తం నేతల్లో నెలకొంది.ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తెలంగాణలో సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలోని ప్రభుత్వం 2025 ప్రారంభంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభించింది. మొదట స్థలం ఉండి ఇల్లు లేనివారిని ఎంపిక చేశారు. నియోజకవర్గానికి 3500 చొప్పున 119 నియోజకవర్గాల్లో లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు చేశారు. దీంతో లబ్ధిదారుల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఇక ఈ ఏడాది ఉగాది నుంచి రేషన్‌కార్డు లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ ప్రారంభించారు. దీంతో లబ్ధిదారుల్లో సంతోషం కనిపిస్తోంది. ఇదే ఏడాది కొత్త రేషన్‌కార్డుల జారీ మొదలు పెట్టారు. 2024లో దరఖాస్తులు స్వీకరించినా.. జారీ మాత్రం ఈ ఏడాది మొదలైంది. అర్హులందరికీ కార్డులు జారీ అయ్యాయి. దీంతో రేవంత్ సర్కార్‌పై సానుకూలత నెలకొంది. అయితే సన్నవడ్ల బోనస్ యాసంగిలో ఇవ్వలేదు. ఇక మహిళలకు రూ.2,500 నగదు, పింఛన్ల పెంపు హామీ నెరవేరలేదు.ఈ ఏడాది ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం అమలు చేశారు. మహిళా సంఘాలకు క్యాంటీన్లు, బస్సులు, పెట్రోల్ బంకులు, సోలార్ యూనిట్లు ఇచ్చారు. మహిళల ఆర్థిక శక్తి పెంపే లక్ష్యంగా
ప్రభుత్వం మహిళలకు అధిక ప్రాధాన్యం ఇస్తోంది. దీంతో మహిళా సంఘాల్లో రూ.2,500 ఆర్థికసాయం అందలేదన్న ఆలోచన కలుగడం లేదు. ఇక ఉచిత బస్సు ప్రయాణం కొనసాగుతోంది. 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500లకే గ్యాస్ పథకాలు అమలవుతున్నాయి.2025లో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు నిర్వహించారు. సిట్టింగ్ ఎమ్మెల్యే మరణంతో ఉప ఎన్నికలు వచ్చాయి. బీఆర్ఎస్ స్థానం అయిన జూబ్లీహిల్స్‌లో హస్తం పార్టీ విజయం సాధించింది. ఈ ఎన్నికలను సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. సమష్టిగా పనిచేసి విజయం సాధించారు. ఇక డిసెంబర్‌లో నిర్వహించిన పంచాయతీ ఎన్నికల్లోనూ హస్తం పార్టీ సత్తా చాటింది. కాంగ్రెస్ మద్దతుదారులు అత్యధిక స్థానాల్లో విజయం సాధించారు. దీంతో కాంగ్రెస్ పార్టీలో కొత్త జోష్ కనిపిస్తోంది.స్థానిక సంస్థల్లో బీజీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రయత్నం చేసింది. అసెంబ్లీ తీర్మానం చేసి గవర్నర్‌కు పంపగా ఆయన ఆమోదం తెలుపలేదు. దీంతో చట్టరూపం దాల్చలేదు. అయినా రేవంత్ సర్కార్ జీవో ద్వారా రిజర్వేషన్ల అమలుపై జీవో ఇచ్చింది. అయితే దీనిని కోర్టులు కొట్టేశాయి.
దీంతో రేవంత్ సర్కార్ ప్రయత్నించింది అన్న భావన బీసీల్లో నెలకొంది. దీంతో పంచాయతీ ఎన్నికలోల సానుకూల ఫలితాలు వచ్చాయి.ఇక బీఆర్ఎస్ నుంచి గెలిచి. కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేల విషయంలో త్వరగా నిర్ణయం తీసుకోవాలని సుప్రీం కోర్టు స్పీకర్‌ను ఆదేశించింది. దీంతో గడ్డం ప్రసాద్‌కుమార్ విచారణ పూర్తి చేశారు. పార్టీ మారినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేల వివరణ తీసుకున్నారు. కడియం శ్రీహరి, దానం నాగేందర్ మినహా 8 మంది వివరణ ఇచ్చారు. ఇందులో ఐదుగురు ఎమ్మెల్యేలు పార్టీ మారలేదని స్పీకర్ బీఆర్ఎస్ ఫిర్యాదులను కొట్టేశారు. మరో ముగ్గురి విషయంలో త్వరలో నిర్ణయం తీసుకోనున్నారు.మొత్తంగా 2025 హస్తం పార్టీకి కలిసి వచ్చిందనే చెప్పాలి. ఎన్నికల్లో విజయాలు. పథకాల అమలులో జాప్యం జరిగినా వ్యతిరేకత లేకపోవడం, పాలన సాఫీగా సాగిపోవడంతో రేవంత్‌రెడ్డి ఊపిరి పీల్చుకున్నారు.

# గ్రేటర్ లో కాంగ్రెస్ దూకుడు



**హైదరాబాద్, డిసెంబర్ 29, పెన్ పవర్:**
గ్రేటర్ రూపు మారింది. ఔటర్ వరకు విస్తరించింది. 20 మున్సిపాలిటీలు..ఏడు కార్పొరేషన్ల విలీనంతోడమహానగర విస్తీర్ణం పెద్దగా అయిపోయింది. దేశంలోనే అతిపెద్ద మున్సిపల్ కార్పొరేషన్‌గా మారిపోతుంది. అయితే విలీనం తర్వాత గ్రేటర్‌ను మూడు ముక్కలు చేస్తారన్న టాక్ నడిచింది. కానీ గతంలో 150 వార్డులు ఉంటే..ఇప్పుడు 3 వందల వార్డులకు పెంచి ఆ చర్చను వెనక్కి నెట్టింది సర్కార్.డీలిమిటేషన్‌పై పొలిటికల్ పార్టీలు
కస్సుబుస్సుమంటుండగానే..జోనల్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లు అంటూ పోస్టింగ్‌లు ఇచ్చేసింది. అధికారులు కూడా ఎవరికి వారు పైరవీలు, లాబీయింగ్‌లు చేసి కోరుకున్న చోట పోస్టింగ్ తెచ్చుకున్నారు. అయినావిషయంలో ప్రభుత్వ వైఖరి ఏంటో స్పష్టత రావడం లేదు. గ్రేటర్ మొత్తాన్ని ఒకే మున్సిపల్ కార్పొరేషన్ కింద ఉంచుతారా లేక వంద వార్డులకు ఒక కార్పొరేషన్ కింద మూడు ముక్కలు చేస్తారా అన్నది ఇప్పటికీ డౌట్‌గానేఉంది.విలీనం, విభజనపై గందరగోళం నడుస్తూ ఉండగానే..పోస్టింగులు, ఆఫీసులు..అంటూ అన్నీ చక్కబెట్టే ప్రయత్నం చేస్తోంది రేవంత్ సర్కార్. విలీనం, వార్డుల విభజన లెక్కేంటనేదానిపై విపక్ష పార్టీలకు క్లారిటీవచ్చేలోపే సర్కార్ డెసిషన్స్ షాకింగ్ మారాయి. కలెక్టర్లు, వివిధ శాఖలకు బాస్‌లుగా పనిచేసిన అధికారులను కమిషనర్ కింద పోస్టింగ్ వేశారు. కొంతమందిని పూర్తిగా డిప్యూటీ కమిషనర్ పోస్ట్ నుంచి తొలగించి జాయింట్‌కమిషనర్లుగా నియమించి చర్చకు దారితీశారు బల్దియా బాస్.ఈ పోస్టింగ్‌లల్లో అవినీతి ఆరోపణలు వస్తున్నాయ్. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారి విషయంలో కఠిన చర్యలు తీసుకోకపోగా..అదే హోదాలో కంటిన్యూ
చేయడం విమర్శలు వెల్లువెత్తున్నాయి. ఇలా సర్కిల్స్, వార్డులు, జోనల్స్..అధికారుల పరిధిలు ఎన్నో సమస్యలున్నా..సర్కార్ మాత్రం స్పీడ్‌గా డెసిషన్స్ తీసుకోవడం వెనక ప్లానేంటన్నది హాట్ టాపిక్ అవుతోంది.గ్రేటర్‌లో విలీనం, విభజన విషయంలో ఇప్పటికీ చాలా సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని..అవేమి పట్టించుకోకుండా సర్కార్ ముందుకెళ్తుందని విపక్షాలు గగ్గోలు పెడుతున్నాయి. అయినా ఐ డోంట్ కేర్ అంటున్నారుసీఎం రేవంత్. అయితే విషయంలో రేవంత్ దూకుడు నిర్ణయాల వెనక పెద్ద స్కెచ్చే ఉందంటున్నారు.ఫిబ్రవరిలో పాలక వర్గం గడువు ముగుస్తుంది. దీంతో జనవరి చివరిలో ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చి షెడ్యూల్ ప్రకారంఎన్నికలు పెట్టి గ్రేటర్‌లో పాగా వేయాలని రేవంత్ ప్లాన్ అంటున్నారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల కంటే ముందు. ఎలక్షన్స్ పెట్టి తీరాలని భావిస్తున్నారట. జనవరి చివరిలో ఎన్నికల నోటిఫికేషన్ ఇవ్వాలంటే అంతాలోపే మొత్తం సెట్ చేయాలని డిసైడ్ అయ్యారట.అందుకే విపక్షాలు ఎన్ని అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నా..లాస్ట్‌కు కొందరు కోర్టుకు వెళ్లినా అన్ని అడ్డంకులను దాటి వార్డుల విభజన..సర్కిల్స్, జోన్ల వారీగా అధికారులకుపోస్టింగ్ వంటి కీలక డెసిషన్స్ తీసుకున్నారని అంటున్నారు. అయితే మున్సిపల్ ఎన్నికలకు ప్రధాన అడ్డంకిగా మారిన బీసీ రిజర్వేషన్ల విషయంలో కూడా ఓ క్లారిటీకి వచ్చారట. బీసీ కోటా అంశం కోర్టులో ఉండటంతో చట్టప్రకారం రిజర్వేషన్లు ఇవ్వడం సాధ్యం కాదు కాబట్టి..పార్టీ పరంగా రిజర్వేషన్లు ఇచ్చి ఎన్నికలకు వెళ్లాలనుకుంటున్నారట.జనవరి మధ్యలో సంక్రాంతి పండగ ముగిసిన వెంటనే మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ రిలీజ్
అయ్యే అవకాశం ఉందంటున్నారు. ఫిబ్రవరిలో మూడు విడతల్లో పోలింగ్ పెట్టేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారట. మార్చిలో విద్యార్థులకు ఎగ్జామ్స్ ఉండటంతో, ఫిబ్రవరి నెలాఖరుకల్లా ఎన్నికల ప్రక్రియను క్లోజ్ చేయాలనిభావిస్తున్నారట. గ్రేటర్‌పై రేవంత్ వ్యూహం ఎంతవరకు వర్కౌట్ అవుతుందో చూడాలి మరి.

## పెరిగిన పత్తి ధర.. స్థిరంగా మిర్చి ధరలు

**మధిర, డిసెంబర్ 29 పెన్ పవర్:** ఖమ్మం వ్యవసాయ మార్కెట్లో సోమవారం మిర్చి, పత్తి ధరలు స్థిరంగా కొనసాగాయి. ఏసీ మిర్చి క్వింటాకు రూ. 15,050, కొత్త మిర్చి రూ. 14,500 ధర పలికింది. పత్తి ధర రూ. 7,500 వద్ద జెండా పాట పలికింది. బుధవారంతో పోల్చితే పత్తి ధర రూ. 100 పెరిగింది, అయితే మిర్చి ధరలలో మార్పు లేదు. మార్కెట్ శాఖ అధికారులు ఈ వివరాలను వెల్లడించారు.

## యాప్ ఎఫెక్ట్.. రోడెక్కిన రైతన్నలు



**వైరా, డిసెంబర్ 29 పెన్ పవర్:** తల్లాడలో యూరియా కొరతపై రైతులు సోమవారం నిరసన తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యూరియా అందించడంలో విఫలమయ్యాయని, యాప్‌ల ద్వారా బుకింగ్ సాధ్యం కావడం లేదని రైతులు ఆరోపించారు. సొసైటీ కార్యాలయాల్లో మామూలు పద్ధతిలోనే యూరియా అందించాలని డిమాండ్ చేస్తూ తల్లాడ రింగ్ రోడ్డు సెంటర్‌లో సుమారు గంట పాటు రాస్తారోకో నిర్వహించారు. దీంతో ట్రాఫిక్ జామ్ అయింది. విషయం తెలుసుకున్న ఏవో తాజుద్దీన్, మామూలు పద్ధతిలోనే యూరియా అందిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ధర్నా విరమించారు.

## చైనా మాంజాను వినియోగిస్తే చర్యలు తప్పవు:

**పాలేరు, డిసెంబర్ 29 పెన్ పవర్:** పక్షులతో పాటు, ప్రజలకు ప్రమాదకరంగా మారిన చైనా మాంజాను విక్రయించినా, వినియోగించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ హెచ్చరించారు. గాలిపటాలు ఎగురవేయడానికి వినియోగించే చైనా మాంజా (సింథటిక్ దారం, గాజు పొడి) చాలా ప్రమాదకరమని, ఈ దారాన్ని ఉపయోగించడం వల్ల పక్షులు, మనుషులకు హాని కలుగుతుందన్నారు. చైనా మాంజాను విక్రయించినా, వినియోగించిన వారికి జైలు శిక్ష పడే అవకాశం ఉందన్నారు. చట్టవిరుద్ధమైన చైనా మాంజా నియంత్రించడానికి ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి..
## నలుగురికి తీవ్రగాయాలు

**సత్తుపల్లి, డిసెంబర్ 29 పెన్ పవర్:** ఓ కారు ఆగి ఉన్న లారీని ఢీకొన్న ఘటనలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన ఖమ్మం- వైరా ప్రధాన రహదారిలో సోమవారం తెల్లవారు జామున చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. రఘునాథపాలెం మండలం వి.వెంకటాయపాలెం వద్ద ఆగి ఉన్న లారీని ఓ కారు ఢీకొట్టింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న దీపక్ అగర్వాల్(40) అక్కడికక్కడే మృతి చెందగా.. మిగిలిన నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. వీరు అరకు విహారయాత్రకు వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదం జరిగింది. ప్రమాదానికి నిద్రమత్తే కారణమని పోలీసులు భావిస్తున్నారు. వీరంతా హైదరాబాద్‌కు చెందినవారిగా గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## సీఎం రేవంత్ రెడ్డికి ఎమ్మెల్యే నాగరాజు కృతజ్ఞతలు

**వర్ధన్నపేట, డిసెంబర్ 29 పెన్ పవర్:** మొంథా తుఫాన్ కారణంగా ఓరుగల్లు నగరంలోని అనేక కాలనీలు నీట మునిగాయని, వరద ముంపు ప్రాంతాల్లో సీఎం రేవంత్ రెడ్డి పర్యటించి బాధితులకు ధైర్యం నింపి నష్టపరిహారం అందించారని ఎమ్మెల్యే నాగరాజు తెలిపారు. వర్ధన్నపేట నియోజకవర్గ ప్రజల తరపున సీఎంకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. గత పదేళ్లలో గోపాలపూర్ చెరువు పరిసరాల్లో భూములు అన్యాక్రాంతం కావడం, చెరువు కట్ట తెగిపోవడంతో సమీప కాలనీల్లోని ఇళ్లకు రూ.15 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు నష్టం వాటిల్లిందని ఆయన ఆరోపించారు.

## గోపాల్‌పూర్ రోడ్డులో ఆక్రమణల తొలగింపు

**వరంగల్ ఈస్ట్, డిసెంబర్ 29 పెన్ పవర్:** గోపాల్‌పూర్ క్రాస్ రోడ్ నుంచి గోపాలపురం వెళ్లే మార్గంలో ట్రాఫిక్ అడ్డంకులను తొలగించేందుకు హనుమకొండ ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. ట్రాఫిక్ సీఐ సీతారెడ్డి ఆధ్వర్యంలో రోడ్డును ఆక్రమించి ఏర్పాటు చేసిన సైన్ బోర్డులు, అక్రమ షెడ్డులను సిబ్బంది తొలగించారు. ఈ మార్గంలో వాహనాల రద్దీ విపరీతంగా పెరగడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని గుర్తించిన పోలీసులు ఈ నిర్ణయం తీసుకున్నారు.

## భూపాలపల్లిలో చైనా మంజాపై నిషేధం:



**భూపాలపల్లి, డిసెంబర్ 29 పెన్ పవర్:** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో చైనా మంజాను పూర్తిగా నిషేధించినట్లు జిల్లా ఎస్పీ సంకీర్త్ సోమవారం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నిషేధం విధించిన నేపథ్యంలో, నిబంధనలు ఉల్లంఘించి విక్రయించినా, వినియోగించినా లేదా ప్రమాదం సంభవిస్తే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పర్యావరణానికి, ప్రజలకు, వాహనదారులకు, పక్షులకు హాని కలిగించే చైనా మంజాపై పర్యావరణ పరిరక్షణ చట్టం %-% 1986 ప్రకారం కేసులు నమోదు చేస్తామని ఎస్పీ వివరించారు. సంక్రాంతి నేపథ్యంలో సీసీఎస్ పోలీసులు ప్రత్యేక తనిఖీలు చేపట్టారు.

## మేడారం అభివృద్ధిపై సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి:

**వరంగల్ వెస్ట్, డిసెంబర్ 29 పెన్ పవర్:** గ్రేటర్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజనాల శ్రీహరి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మేడారం సమ్మక్క-సారలమ్మ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఈసారి మహా జాతర నిర్వహణకు, 200 ఏళ్ల పాటు చెక్కుచెదరకుండా ఉండేలా గద్దెల శాశ్వత పునర్నిర్మాణానికి సీఎం ప్రాధాన్యత ఇస్తున్నారని అన్నారు. మొత్తం 251 కోట్లతో మేడారం సమగ్ర అభివృద్ధి, గద్దెల విస్తరణకు 101 కోట్లు, 4000 టన్నుల గ్రానైట్‌తో గద్దెల ప్రాంగణ నిర్మాణం, 750 మంది కోయ వంశీయుల పేర్లతో 7,000 పైగా శిల్పాలు, 930 ఏళ్ల నాటి కొయ్యల తాళపత్ర గ్రంథాల ఆధారంగా శిల్ప రూపకల్పన, 46 స్తంభాలతో విస్తరణ పనులు పూర్తి చేస్తున్నారని వివరించారు.

## యాప్ ద్వారా యూరియా పంపిణీ

**నర్సంపేట, డిసెంబర్ 29 పెన్ పవర్:** మహబూబాబాద్ జిల్లాలో నేటి నుంచి యూరియా పంపిణీ యాప్ ద్వారా జరగనుంది. వానాకాలంలో రైతులు ఎదుర్కొన్న ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని రాష్ట్ర ప్రభుత్వం ఈ యాప్‌ను రూపొందించింది. ప్లే స్టోర్ నుంచి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, ఫోన్ నంబర్‌తో లాగిన్ అయి, పట్టా పాస్‌బుక్ నంబర్ నమోదు చేసి యూరియా తీసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారిణి విజయనిర్మల తెలిపారు.

## అల్లీపూర్ తండా నీటి కష్టాలు:
## సర్పంచ్ ఆవేదన, తక్షణ చర్యలకు పిలుపు

**నర్సాపూర్, డిసెంబర్ 29 పెన్ పవర్:** మెదక్ జిల్లా, నర్సాపూర్ నియోజకవర్గం, అల్లీపూర్ తండాలో నెలకొన్న తీవ్ర నీటి సమస్యపై సర్పంచ్ చింతకాయల కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ ప్రజలు తాగునీటి కోసం పడుతున్న ఇబ్బందులను ప్రస్తావిస్తూ, ప్రతి కుటుంబానికి నీరు అందేలా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను కోరారు. శాశ్వత పరిష్కారం కోసం పైప్‌లైన్ మరమ్మతులు, కొత్త బోర్ల ఏర్పాటు, ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా వంటి చర్యలు చేపట్టాలని సూచించారు. “అల్లీపూర్ తండాలో ఎవరూ నీటి కోసం కష్టాలు పడకూడదు అందరికీ నీరు అందాలి అనేది నా లక్ష్యం” అని సర్పంచ్ స్పష్టం చేశారు.

## అర్జీలను స్వీకరించిన ఆదిలాబాద్ కలెక్టర్

**ఆదిలాబాద్, డిసెంబర్ 29 పెన్ పవర్:** సోమవారం ఆదిలాబాద్ కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ రాజర్షిషా ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు శ్యామలాదేవి, రాజేశ్వర్ కూడా పాల్గొన్నారు. ప్రజల సమస్యలను ఆలకించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.

## ఆసిఫాబాద్ పోలీసులపై చర్యలు తీసుకోవాలి:



**బోథ్, డిసెంబర్ 29 పెన్ పవర్::** ఆసిఫాబాద్ డిపో డ్రైవర్‌పై నాన్-బెయిలబుల్ సెక్షన్లతో అక్రమ కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపిన రెబ్బన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ జేఏసీ డిమాండ్ చేసింది. ఈ నెల 23న జరిగిన ప్రమాదంలో బస్సు డ్రైవర్ రామారావు తప్పు లేకపోయినా, రోడ్డు పక్కన బస్సు ఆపినప్పటికీ, పోలీసులు అతన్ని అరెస్టు చేసి జైల్లో ఉంచారని ఆరోపించారు. ఆర్టీసీ యాజమాన్యం వెంటనే స్పందించి, డ్రైవర్‌పై కేసును ఉపసంహరించుకుని, అతన్ని విడుదల చేయించాలని జేఏసీ కోరింది. ఈ వ్యవహారంలో డిపో మేనేజర్ నిర్లక్ష్యం కూడా ఉందని జేఏసీ నేతలు తెలిపారు.

## కుష్టు వ్యాధి నివారణకు ప్రజల సహకారం తప్పనిసరి:

**నిర్మల్, డిసెంబర్ 29 పెన్ పవర్:** ఆదిలాబాద్ పట్టణంలో కుష్టు వ్యాధి నివారణకు ప్రజలందరూ సహకరించాలని ఎయిడ్స్ అండ్ లెప్రసీ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ శిరీన్ కోరారు. సోమవారం సంజయ్ నగర్, రిక్షా కాలనీలలో ఆశా కార్యకర్తలు నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను ఆమె పరిశీలించారు. శరీరంపై పాలిపోయిన, రాగి రంగు గల మొద్దు బారిన మచ్చలు, కాళ్లు చేతుల్లో తిమ్మిర్లు ఉన్నట్లయితే ఆశా కార్యకర్తలకు చూపించుకోవాలని, ఎం.డి.టి.తో ఈ వ్యాధి పూర్తిగా నయం అవుతుందని తెలిపారు. అనుమానితుల వివరాలను నమోదు చేసుకొని వైద్యాధికారులకు పంపాలని ఆదేశించారు.

## పాత్రికేయులకు ఇండ్ల స్థలాలు వెంటనే ఇవ్వాలి:

**ముథోల్, డిసెంబర్ 29 పెన్ పవర్:** నిర్మల్ జిల్లాలో అర్హులైన పాత్రికేయులందరికీ ప్రభుత్వం వెంటనే ఇండ్ల స్థలాలను కేటాయించాలని బీఆర్ఎస్ జిల్లా సమన్వయకర్త కె.రాం కిషన్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు మరుగొండ రాము డిమాండ్ చేశారు. సోమవారం, ఆరు రోజులుగా పాత్రికేయులు చేస్తున్న దీక్ష శిబిరానికి చేరుకొని వారికి సంఘీభావం తెలిపారు. ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా ఉండి సేవలందించే పాత్రికేయులు రోడ్డున పడడం దారుణమని వారు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## ఆసిఫాబాద్: గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

**ఖానాపూర్, డిసెంబర్ 29 పెన్ పవర్:** కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజనగర్ మండలం ఈసగామ్ కు చెందిన మనోజిత్ అనే యువకుడు పెద్దవాగులో ఈతకు వెళ్ళగా గల్లంతు అయ్యాడు. సోమవారం ఉదయం స్థానికులు అతని మృతదేహాన్ని వెలికి తీశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## పెండింగ్ బిల్లుల కోసం సర్పంచ్‌ల చలో అసెంబ్లీ యత్నం



**మానకొండూరు, డిసెంబర్ 29 పెన్ పవర్:** రాజన్న సిరిసిల్ల జిల్లా మానకొండూర్ నియోజకవర్గం ఇల్లంతకుంట మండలంలో, పెండింగ్ బిల్లుల కోసం తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా సర్పంచ్‌లు హైదరాబాద్‌లో చలో అసెంబ్లీకి పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో, అసెంబ్లీ ముట్టడికి బయలుదేరిన ఇల్లంతకుంట మండలంలోని మాజీ సర్పంచ్‌లు కట్ట వెంకట్ రెడ్డి, కేతిరెడ్డి అనసూయ వెంకటనర్సింహా రెడ్డి, ఉడుతల వెంకన్న, బిల్లవేణి పర్శరాంలను ఇల్లంతకుంట పోలీసులు సోమవారం అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

## పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేసిన మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్

**హుజూరాబాద్, డిసెంబర్ 29 పెన్ పవర్:** సోమవారం నాడు హుజురాబాద్ కు చెందిన గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్, హన్మకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలోని ఎం జె పి బాలుర పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న 110 మంది విద్యార్థులకు సోమవారం పరీక్ష ప్యాడ్లను అందించింది. ట్రస్ట్ నిర్వాహకులు గంగిశెట్టి జగదీశ్వర్, పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి రవీందర్ చేతులమీదుగా ఈ ప్యాడ్లను విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## అగ్నిప్రమాదం.. చెలరేగిన మంటలు

**చొప్పదండి, డిసెంబర్ 29 పెన్ పవర్:** ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని అంబేద్కర్ నగర్లో బలిజ శేఖర్ కిరాణం కొట్టు డబ్బాలో సోమవారం ఉదయం 9:30 గంటల సమయంలో అగ్నిప్రమాదం సంభవించింది. దేవుని ఫొటోలకు అగర్ బత్తులు వెలిగించిన తర్వాత షట్టర్ మూసివేసి వెళ్లగా, మంటలు వ్యాపించాయి. సమీపంలో ఉన్న ఏఆర్ కానిస్టేబుల్ అంగూరి నవీన్ ధైర్యంగా షట్టర్ తెరిచి, నల్లాల నీటితో మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో సుమారు పదివేల విలువైన నిత్యావసర వస్తువులు కాలిపోయాయి. నష్టపోయిన వ్యాపారికి ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు. మంటలను ఆర్పివేసిన కానిస్టేబుల్ నవీన్ను పలువురు అభినందించారు.

## మేడారం జాతర.. కిటకిటలాడుతున్న వేములవాడ

**కరీంనగర్, డిసెంబర్ 29 పెన్ పవర్:** మేడారం జాతర నేపథ్యంలో వేములవాడలో భక్తుల రద్దీ గణనీయంగా పెరిగింది. శ్రీ భీమేశ్వర స్వామిని దర్శించుకున్న తర్వాత, భక్తులు బద్ది పోచమ్మ ఆలయానికి చేరుకుని బోనం మొక్కులు సమర్పిస్తున్నారు. స్వామిని దర్శించుకున్న భక్తులు సోమవారం తెల్లవారుజాము నుంచే బద్ది పోచమ్మ ఆలయం వద్ద క్యూ కట్టారు. అదే సమయంలో, భీమేశ్వర క్షేత్రంలో కోడె మొక్కుల సమర్పణలు కూడా కొనసాగుతున్నాయి. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

## ఆశా వర్కర్ల ముందస్తు అరెస్టు.. ఖండించిన సిఐటియు

**సిరిసిల్ల, డిసెంబర్ 29 పెన్ పవర్:** రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఆశా వర్కర్లను ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్కు తరలించడాన్ని జిల్లా సిఐటియు తీవ్రంగా ఖండించింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఆశా వర్కర్ల డిమాండ్లను నెరవేర్చాలని, అరెస్టులు, అవమానాలు ఆపాలని కోరింది. ఫిక్స్ వేతనం, భద్రత, బీమా, మట్టి ఖర్చులు వంటి డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని, భవిష్యత్తులో ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా ఆదేశాలు జారీ చేయాలని సిఐటియు డిమాండ్ చేసింది. ఈ కార్యక్రమంలో గురిజాల శ్రీధర్, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

## యూరియా యాప్ కు వ్యతిరేకంగా రైతులు ఆందోళన

**ఖమ్మం, డిసెంబర్ 29 పెన్ పవర్::** ఖమ్మం జిల్లా తల్లాడ మండల కేంద్రంలో యూరియా సరఫరా ఆన్లైన్ యాప్ పద్ధతిలో కాకుండా నేరుగా రైతులకు అందించాలని డిమాండ్ చేస్తూ రైతులు సోమవారం నిరసన తెలిపారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కేంద్రం వద్ద యూరియా కోసం బారులు తీరిన రైతులు, తమ డిమాండ్లను నెరవేర్చాలని రోడ్డుపై బైఠాయించారు. ఈ నిరసన కారణంగా భారీగా ట్రాఫిక్ జామ్ అయింది.

# రాష్ట్రంలో ఈ నెల 31వ తేదీ వరకు చలి తీవ్రత



**హైదరాబాద్ డిసెంబర్ 28 పెన్ పవర్:** రాష్ట్రం చలి గాలులతో గజగజ వణుకుతుంది. రోజురోజుకు ఉష్ణోగ్రతలు పడిపోతుండటంతో ప్రజలు బయటకు రావాలంటేనే జంకుతున్నారు. కనిష్ట ఉష్ణోగ్రతలకు తోడు చలి గాలులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ప డుతున్నారు. ఉదయం 11 గంటలు అయినా చలి తీవ్రత తగ్గకపోవడం, మధ్యాహ్నం ఒక్కసారిగా ఎండవేడి వాతావరణం, సాయంత్రానికే మళ్లీ చలి ప్రారంభం కావడంతో చిన్నారులు, వృద్ధులు, మ హిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాష్ట్రంలో పలు జిల్లాల్లో సింగిల్ డిజిట్ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రాష్ట్రంలో ఈ నెల 31వ తేదీ వరకు ఈ చలి తీవ్రతం కొనసాగే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఆ తర్వాత ఉష్ణోగ్రతలు పెరిగి చలి తగ్గుముఖం పడుతుందని అంచనా వేస్తున్నారు. జనవరి నెల ప్రారంభంలో సాధారణ శీతాకాలం ఉన్నా, సంక్రాంతికి మళ్లీ చలి పెరిగి, చివరి వారం నుంచి తగ్గుముఖం పడుతుందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. రాష్ట్రంలో క్రింది స్థాయి గాలులు ప్రధానంగా తూర్పు, ఆగ్నేయ దిశల నుండి వీస్తున్నాయి. దీంతో నాలుగైదు రోజులు రాష్ట్రవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు 3 నుండి 4 డిగ్రీలు తక్కువ నమోదయ్యే అవకాశాలున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఆదివారం, సోమవారం రాష్ట్రంలో పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉందని తెలిపింది. రాష్ట్రంలో శనివారం ఉదయం వరకు కొమరంభీం ఆసిఫాబాద్ జిల్లాల్లో 7.4 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు కాగా, సంగారెడ్డి 7.6, ఆదిలాబాద్ 8.8, రంగారెడ్డి 9.2, సిద్దిపేట 9.4, కామారెడ్డి 9.5, నిర్మల్ 10 డిగ్రీల ఉష్ణోగత్రల నమోదయింది. దీంతో పాటు ఆదివారం తొమ్మిది జిల్లాలకు వాతావరణ కేంద్ర ఆరంజ్ హెచ్చరికలు జారీ చేసింది.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో తెరపైకి సంధ్య శ్రీధర్ రావు



**హైదరాబాద్, డిసెంబర్ 29, పెన్ పవర్:** భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు కీలకమైన వ్యక్తుల ఫోన్ లు ట్యాప్ చేసినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం ఈ కేసును దర్యాప్తు చేస్తోంది. ఈ నేపథ్యంలో నాడు ఇంటిలిజెన్స్ భాగంలో కీలకంగా పనిచేసిన ప్రభాకర్ రావు, భుజంగరావు, రాధా కిషన్ రావు, తిరుపతన్న ను అనేక దఫాలుగా ప్రత్యేక దర్యాప్తు బృందం విచారించింది. వీరు మాత్రమే కాకుండా ఓ మీడియా సంస్థను నిర్వహిస్తున్న శ్రవణ్ రావు అనే వ్యక్తిని కూడా విచారించింది. ప్రభాకర్ రావు ను ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం గదిలో అధికారులు విచారించారు. మిగతా వారిని కూడా విచారించడానికి అదే విధానాన్ని కొనసాగించారు. చార్జిషీట్, సుప్రీంకోర్టుకు అందించే నివేదికలో ఏమాత్రం తప్పులు లేకుండా జాగ్రత్తలు తీసుకుంది ప్రత్యేక దర్యాప్తు బృందం. నిందితుల కన్ ఫెషన్ రిపోర్ట్ లో పలు అంశాలను పేర్కొనగాడ వాటి ఆధారంగా తమ అనుమానాలను నివృత్తి చేసుకున్నారు. అంతేకాదు రిమాండ్ రిపోర్టులు, ఎఫ్ ఎస్ ఎల్ రిపోర్ట్ లో అంశాలతో సిట్ అధికారులు దాదాపుగా డ్రాఫ్టింగ్ పూర్తి చేశారు.సిట్ విచారిస్తున్న సమయంలో ప్రభాకర్ రావుకు సంబంధించిన మన వ్యవహారం కూడా వెలుగు వచ్చింది. ఫోన్ ట్యాపింగ్ ద్వారా ప్రభాకర్ రావు తనను ఇబ్బంది పెట్టారని సంధ్యా కన్వెన్షన్ ఎండి శ్రీధర్ రావు ప్రత్యేక దర్యాప్తు బృందం అధికారులకు ఫిర్యాదు చేశాడు. తనను బెదిరింపులకు గురిచేసి భారత రాష్ట్ర సమితికి 12 కోట్లు ఎలక్టోరల్ బాండ్లు రాయించాడని శ్రీధర్ రావు ఆరోపించారు. అంతేకాదు, ఓ భూ వివాదంలో ప్రభాకర్ వియ్యంకుడు రవీంద్రరావు కొంత డబ్బు కూడా వచ్చిందని శ్రీధర్ రావు సిట్ కు చేసిన ఫిర్యాదులో స్పష్టం చేశాడు. దీంతో రవీంద్రరావు సిట్ దర్యాప్తు చేసింది. మరోవైపు ప్రభాకర్ రావు పెద్ద కుమారుడు నిశాంత్ ను ఇప్పటికే సిట్ అధికారులు అనేక దఫాలుగా విచారించారు. నిశాంత్ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. అక్కడికి వచ్చిన పెట్టుబడులు, ఇతర వ్యవహారాల గురించి పోలీసులు లోతుగా ఆరా తీస్తున్నారు. ప్రభాకర్ రావు, నిశాంత్ బ్యాంకు ఖాతాలను సిట్ అధికారులు లోతుగా పరిశీలించారు.సిట్ దర్యాప్తు పూర్తయిన తర్వాత తదుపరి వ్యవహారాన్ని కొనసాగించడానికి అధికారులు కసరత్తు చేస్తున్నట్టు తెలుస్తోంది. ప్రభాకర్ రావు విచారణ ముగియడంతో సిట్ చీఫ్ సజ్జనార్, ఇంటలిజెన్స్ చీఫ్ విజయ్ కుమార్, సిద్దిపేట సిపి ఎస్ఎం విజయ్ కుమార్ సహా సిట్ సభ్యులు భేటీ అయ్యారు. బంజారాహిల్స్ ప్రాంతంలోని కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్లో ఈ కీలక సమావేశం నిర్వహించారు. ప్రభాకర్ రావు ను విచారించిన తర్వాత కేసు విషయంలో కీలకమైన నివేదిక సిద్ధం చేస్తున్నట్టు తెలుస్తోంది. అంతేకాదు సుప్రీంకోర్టులో దాఖలు చేసే స్టేటస్ రిపోర్ట్ కూడా పూర్తి చేస్తున్నట్టు సమాచారం. ఒకవేళ కెసిఆర్ ను విచారణకు పిలిస్తే ఎటువంటి పరిణామాలు చోటు చేసుకుంటాయని అంశాలపై కూడా చర్చించినట్టు తెలుస్తోంది.

# మహిళలకు మొబిలిటీ కార్డు...

**హైదరాబాద్, డిసెంబర్ 29, పెన్ పవర్:** తెలంగాణలో మహిళల ఉచిత బస్సు ప్రయాణం కోసం మహాలక్ష్మి పథకాన్ని అమల్లోకి తెచ్చిన సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం.. మరో కీలక నిర్ణయం తీసుకుంది. మహాలక్ష్మి పథకాన్ని వినియోగించుకుంటున్న మహిళల కోసండ కామన్ మొబిలిటీ కార్డ్ జారీ చేయనుంది.ప్రస్తుతం ఆధార్ కార్డుతో ప్రయాణిస్తున్న సమయంలో ఎదురవుతున్న ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ఈ స్మార్ట్ కార్డుల విధానాన్ని ప్రవేశపెడుతోంది. దీని రూపకల్పన కోసం ప్రభుత్వం ఇప్పటికే సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (సీజీజీ)తో ఒప్పందం చేసుకుంది.ఈ స్మార్ట్ కార్డు కేవలం బస్ పాస్ మాత్రమే కాదు, బహుళ ప్రయోజనకారిగా ఉపయోగపడనుంది. మహిళలుబస్సుల్లో ఈ కార్డును ట్యాప్ చేసి ఉచితంగా ప్రయాణించవచ్చు. అంతేకాకుండా ఇందులో డబ్బులు లోడ్ చేసుకుని మెట్రో రైలు, ఎంఎంటీఎస్ వంటి ఇతర రవాణా సేవలను కూడా వినియోగించుకోవచ్చు. దీనివల్లప్రయాణికులు ప్రతిసారీ ఆధార్ కార్డును వెంట తీసుకెళ్లాల్సిన అవసరం ఉండదు.ఈ కార్డుల జారీతో ప్రభుత్వానికి ప్రయాణికుల డేటా కచ్చితంగా అందుబాటులోకి వస్తుంది. ఏయే మార్గాల్లో మహిళల రద్దీ ఎక్కువగా ఉందోగుర్తించి, దానికి అనుగుణంగా బస్సు సర్వీసులను సర్దుబాటు చేసే అవకాశం కలుగుతుంది. దీనివల్ల ఆర్టీసీకి నష్టాలు తగ్గడమే కాకుండా, రవాణా వ్యవస్థలో పారదర్శకత పెరుగుతుంది. భవిష్యత్తులో రేషన్, ఆరోగ్యసేవలు, ఇతర ప్రభుత్వ పథకాలను కూడా ఇదే కార్డుకు అనుసంధానించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ముందుగా మహిళలతో ప్రారంభించి, దశలవారీగా రాష్ట్ర ప్రజలందరికీ ఈ కార్డులను అందుబాటులోకి తీసుకురానున్నారు.మహాలక్ష్మి పథకం ద్వారా ఇప్పటివరకు మహిళలు సుమారు 255 కోట్ల ఉచిత ప్రయాణాలు చేశారు. దీనికోసం ప్రభుత్వం ఆర్టీసీకి రూ. 8,500 కోట్లు చెల్లించింది. అయితే, ప్రయాణ సమయంలో ఆధార్ కార్డు చూపించడం వల్ల కండక్టర్లు, ప్రయాణికుల మధ్య తరచూ ఘర్షణలు తలెత్తుతున్నాయి. ఆధార్‌పై ఫొటోలు స్పష్టంగా లేకపోవడం, నకిలీ కార్డుల వినియోగం వంటి సమస్యలను అధిగమించేందుకు ప్రభుత్వం ఈ కొత్త విధానాన్ని తెరపైకి తెచ్చింది.

## హైదరాబాద్‌ను చుట్టుముట్టిన వాయుకాలుష్యం

**230 దాటి ప్రమాదకర స్థాయికి చేరిన గాలి నాణ్యత ప్రమాణం**

**హైదరాబాద్ డిసెంబర్ 28: పెన్ పవర్:** హైదరాబాద్‌ను చుట్టుముట్టిన వాయుకాలుష్యం చలితో వణికిపోతున్న హైదరాబాద్ మహానగరాన్ని మరోవైపు వాయు కాలుష్యం చుట్టుముట్టింది. చలి, పొగ మంచు కారణంగా వాయు కాలుష్యం పెరిగింది. శీతాకాలపు పొగమంచుకు తోడు వాహనాల ఉద్గారాలు, చెత్త దహనం వల్ల గాలిలో సూక్ష్మ ధూళికణాలు భారీగా పెరిగిపోతున్నాయి. అయితే ఉదయం సమయంలో వాయు కాలుష్యం ఎక్కువగా ఉంటుంది. హైదరాబాద్‌లోని కొన్ని ప్రాంతాలతో పాటు, పారిశ్రామిక ప్రాంతాలు, ఐటీ జోన్లు, రద్దీ ఎక్కువగా ఉండే రోడ్ల వెంట ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ అధికంగా ఉంటుంది. హైదరాబాద్‌లో గాలి నాణ్యత ప్రమాణం 230 దాటి ప్రమాదకర స్థాయికి చేరింది. గరిష్టంగా అమీన్‌పూర్ 289 పాయింట్లు, గచ్చిబౌలిలో 286, మాదాపూర్, విట్టల్‌రావు నగర్‌లో 230 పాయింట్లుగా నమోదైంది. నగరంలోని పలు ప్రాంతాలలో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 200 పాయింట్లు దాటింది.

## కమల్ నగర్ డంపింగ్ యార్డును పట్టించుకోండి


### ఎమ్మెల్యే కసిరెడ్డికి కవిత సూచన



**హైదరాబాద్ పెన్ పవర్:** అమన్ గల్ లోని డంపింగ్ యార్డును తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆదివారం పరిశీలించారు. కవిత మాట్లాడుతూ ఆమన్ గల్ పట్టణంలోని గుర్రగుట్టం కమల్ నగర్ లో ఉన్నాం. ఇక్కడ జనావాసాల్లో పెద్ద డంపింగ్ యార్డ్ ను పెట్టారు. దీన్ని తీసేయాలని ఆరేళ్లుగా ప్రజలు ధర్నాలు చేస్తూ దరఖాస్తులు ఇస్తున్నారు. ఈ డంపింగ్ యార్డ్ కారణంగా ప్రజలు ఆరోగ్య పరంగా తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని అన్నారు. ఇటీవలే ఒక బాలింత కూడా చనిపోయిందని చెబుతున్నారు. ఇక్కడి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి ఈ డంపింగ్ యార్డ్ సమస్యపై శ్రద్ధ పెట్టాలి. అధికారులకు అప్లికేషన్ ఇచ్చినప్పటికీ వాళ్లు కనీసం పట్టించుకోవటం లేదు. ఇక్కడికి 8 కిలోమీటర్ల దూరంలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు కోసం కోటి 20 లక్షలు కూడా మంజూరు చేశారు. ఈ ప్రాంతంలో ప్రజలకు 1994 లో గుట్టలల్లో ఇళ్లలు ఇచ్చారు. అవి చాలా చిన్నగా ఉన్నాయి. ఇక్కడ కూడా వారిని పొమ్మన లేక పొగబెట్టినట్లు చేస్తున్నారు. ఎమ్మెల్యే మున్సిపల్ కమిషనర్ ను పిలిపించుకొని ఈ ప్రాంతాన్ని పరిశీలించాలి. చెత్తశాఖ మంత్రి మీ ముఖ్యమంత్రే కనుక ఆయనను డిమాండ్ లేక కమాండ్ చేసి ఈ సమస్య పరిష్కరించాలి. మా యాత్ర ఫిబ్రవరిలో పూర్తి అవుతుంది. అప్పటి వరకు ప్రభుత్వానికి సమయం ఇస్తాం. ఆ తర్వాత మేమే ఈ డంపింగ్ యార్డ్ ను క్లీన్ చేస్తాం. ఇక్కడ ప్లాస్టిక్ గుట్టలుగా పేరుకుపోయింది. పర్యావరణం మీద పట్టి లేకుండా రోజు చెత్తను కాల్చుతున్నారు. దీంతో విషవాయువులు ప్రబలి ప్రజలకు క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉంది. ఇక్కడి ఎమ్మెల్యే చదవుకున్న వారు, విజ్ఞులు. వీలైనంత త్వరగా సమస్య పరిష్కరిస్తారని భావిస్తున్నామని అన్నారు.

# గుంటూరుకు మహర్దశ

**గుంటూరు, డిసెంబర్ 29, పెన్ పవర్:** గుంటూరు త్వరలో మిలియన్ ప్లస్ సిటీగా మారనుంది. 18 గ్రామాలను జీఎంసీలో విలీనం చేసేందుకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. దీంతో గుంటూరు జనాభా ;పది లక్షలకు పైగా చేరనుంది. మిలియన్ ప్లస్ సిటీగా మారితే.. కేంద్ర ప్రభుత్వ ప్రత్యేక పథకాలు, భారీ నిధులతో గుంటూరుకు మహర్దశం పట్టనుంది. రాజధాని అమరావతికి దగ్గర ఉండటం కూడా కలిసి వచ్చే అంశం. అయితే, ఈ విలీనంపై కొందరు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు.గుంటూరు నగరాన్ని మిలియన్ ప్లస్ సిటీగా మార్చేందుకు రంగం సిద్ధమైంది. ఇప్పటి వరకు రాష్ట్రంలో మిలియన్ ప్లస్ నగరాలుగా విశాఖపట్నం, విజయవాడ మాత్రమే ఉండగా, ఇప్పుడీ జాబితాలోకి గుంటూరు కూడా చేరనుంది. 18 గ్రామాలను గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ (జీఎంసీ)లో విలీనం చేసేందుకుగాను, కౌన్సిల్ తాజాగా ఆమోదం తెలిపింది. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత, గుంటూరు నగరం 10 లక్షల జనాభాను దాటి మిలియన్ ప్లస్ సిటీగా అవతరిస్తుంది. మిలియన్ ప్లస్ సిటీగా మారడం వల్ల, కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టులు, ప్రత్యేక పథకాలు, భారీ ఎత్తున నిధులు గుంటూరుకు లభించనున్నాయి.పది లక్షల కంటే ఎక్కువ జనాభా ఉన్న నగరాలను మిలియన్ ప్లస్ సిటీలుగా పరిగణిస్తారు. 2011 లెక్కల ప్రకారం గుంటూరు జనాభా 7.43 లక్షలు. ప్రస్తుతం ఇది 9.40 లక్షలకు చేరుకుందని అంచనా. అయితే దీనిలో విలీనం చేయనున్న 18 గ్రామాల్లో సుమారు 65 వేల మంది జనాభా ఉంది. వీరందరినీ కలిపితే గుంటూరు జనాభా పది లక్షలు దాటుతుంది. ఈక్రమంలోనే కౌన్సిల్ 18 గ్రామాలను జీఎంసీలో విలీనం చేసే ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది.అయితే, కొందరు సభ్యులు ఈ విలీన ప్రక్రియపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల విలీనం వల్ల నిర్వహణపరమైన సమస్యలు తలెత్తుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే అధికారులు, సిబ్బంది కొరత ఉందని, జీఎంసీపై భారం పెరుగుతుందని వారు అభిప్రాయపడ్డారు. దీనికి ప్రత్యామ్నాయ మార్గాలను చూడాలని తూర్పు ఎమ్మెల్యే నసీర్ సూచించారు. ఈ ప్రక్రియను పూర్తి చేయడానికి మరో మూడు రోజులే గడువు ఉంది.పైగా ఈ విలీన ప్రక్రియ ఆఖరి క్షణాల్లో హడావుడిగా జరుగుతోందని విమర్శలు




వస్తున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు సంవత్సరం పొడవునా ఈ అంశాన్ని పట్టించుకోకుండా, చివరి నిమిషంలో గ్రామాల విలీనంపై దృష్టి సారించడంపై విమర్శలున్నాయి. జీఎంసీ అధికారులు మూడు నెలల క్రితమే డీపీవోకు లేఖ రాసి, డిసెంబర్ 31 తుది గడువు అని చెప్పినా, ఈ నెల మొదట్లో ప్రత్యుత్తరం రావడంతోనే చర్చ మొదలైంది.జొన్నలగడ్డ, గొర్లవారిపాలెం, తోకవారిపాలెం, దాసుపాలెం, మల్లవరం, చినపలకలూరు, తురకపాలెం, చల్లావారిపాలెం, వెంగళాయపాలెం, ఓబులనాయుడుపాలెం, లాల్‌పురం గ్రామాల్లో గ్రామసభలు తీర్మానాలు చేశాయి. లామ్, కొర్నిపాడు, పుల్లడిగుంట, తక్కెళ్లపాడు, అగతవరప్పాడు, వెనిగండ్ల, పెదకాకాని గ్రామాల్లో ఎమ్మెల్యేల ఆమోదం, పంచాయతీల తీర్మానం జరగాల్సి ఉంది.

విలీనం వల్ల ప్రయోజనాలు:

కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టులు, ప్రత్యేక పథకాలు, నిధులు లభించనున్నాయి.

భవిష్యత్తులో స్మార్ట్‌సిటీ నగరాల జాబితాలో చేరే అవకాశం ఉంది.

విలీన గ్రామాల పరిధిలో దాదాపు 3 వేల ఎకరాల ప్రభుత్వ భూములున్నాయి. వీటిపై కేంద్ర, రాష్ట్ర సంస్థలు, పరిశ్రమలు ఏర్పాటై ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి.

జిల్లా కేంద్రానికి 30 కిలోమీటర్ల దూరంలోనే రాజధాని అమరావతి రూపుదిద్దుకోవడం, విలీన గ్రామాల పరిసరాల్లో ఓఆర్ఆర్ (ఔటర్ రింగ్ రోడ్) వెళ్లడం కూడా కలిసొచ్చే అంశాలు.

జీఎంసీలో అదనపు కమిషనర్ పోస్టుతో పాటు మరికొన్ని విభాగాలు, పోస్టులు మంజూరవుతాయి.

సర్కిళ్లు, జోన్లు ఏర్పాటు చేసుకునే అవకాశం ఉందని సభ్యులకు వివరించారు.

# ఏపీలో కొత్త కూటమికి స్పేస్ ఉందా

**విశాఖపట్టణం , డిసెంబర్ 29, పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్ రాజకీయాల గురించి రాష్ట్ర ప్రజలకు స్పష్టమైన అవగాహన ఉంది. ప్రస్తుతం రాష్ట్రంలో మూడు ప్రధాన ప్రాంతీయ పార్టీలు కీలకంగా ఉన్నాయి. వాటిలో సీనియర్ పార్టీగా తెలుగుదేశం పార్టీ కొనసాగుతుండగా, రెండో స్థానంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీఉంది. ఇక 2024 ఎన్నికల తర్వాత జనసేన పార్టీ కూడా అధికార కూటమిలో భాగంగా మూడవ ప్రాంతీయ శక్తిగా నిలిచింది. జాతీయ పార్టీలుగా కాంగ్రెస్, బీజేపీ ఉన్నప్పటికీ, వాటిలో బీజేపీ మాత్రమే కూటమి రాజకీయాలతో ప్రభావం చూపుతోంది. కమ్యూనిస్టు పార్టీలు కూడా ఉన్నా, పెద్దగా రాజకీయ ప్రభావం చూపించలేకపోతున్నాయి.ఈ పరిస్థితుల్లో ఏపీలో మరో కొత్త ప్రాంతీయ పార్టీకి అవకాశం ఉందా అనే ప్రశ్న మళ్లీ తెరపైకి వచ్చింది. కొత్త పార్టీలు ఏర్పడినా, వాటిని ఆదరించే రాజకీయ ఖాళీ నిజంగా ఉందా అనే చర్చ కూడా కొనసాగుతోంది. గత నాలుగు నుంచి ఐదు దశాబ్దాల రాజకీయ చరిత్రను పరిశీలిస్తే, ఏపీలో ఎక్కువగా రెండు పార్టీల మధ్యే పోటీ నడుస్తూ వచ్చింది.ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీటీడీపీ మధ్య పోరు ఎన్నో ఏళ్లపాటు కొనసాగింది. రాష్ట్ర విభజన తర్వాత అదే పోరు టీడీపీ వర్సెస్ వైసీపీగా మారింది. జనసేన మూడవ పార్టీగా రంగప్రవేశం చేసినా, కావాల్సినంత రాజకీయ స్థలం లేదని భావించి కూటమిలో భాగమై అధికారంలో కొనసాగుతోందన్న అభిప్రాయం ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో కొత్త రాజకీయ ప్రయోగాలు ఎంతవరకు ఫలిస్తాయన్నది రాజకీయ వర్గాల్లో చర్చకు దారి తీస్తోంది.పార్టీ పెట్టడం సులువే అయినా, దానికి సరైన స్పేస్ ఉందా లేదా అన్నది ముఖ్యమని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల ఐపీఎస్ అధికారి పీవీ సునీల్ కుమార్ చేసిన వ్యాఖ్యలు ఆసక్తి రేపాయి. బీసీలు, మైనారిటీలు, ఎస్సీ, ఎస్టీ, కాపులు కలిసి ఒక బలమైన రాజకీయ వేదిక ఏర్పడుతుందని ఆయన చెప్పారు. ఈ వ్యాఖ్యల తర్వాత రంగానాడు పేరుతో విశాఖపట్నంలో వంగవీటి రంగా వర్ధంతి సందర్భంగా నిర్వహించిన భారీ సభ మరింత చర్చకు కారణమైంది.ఈ సభకు రంగా కుమార్తె ఆశాకిరణ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆమె రాజకీయ పార్టీ ఏర్పాటు గురించి స్పష్టంగా చెప్పకపోయినా, రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి రంగా ఆశయాల కోసం పోరాడతానని ప్రకటించారు. ఆమె తన ప్రసంగంలో టీడీపీ,




జనసేన, వైసీపీపై విమర్శలు చేయడంతో, ఆమె భవిష్యత్ రాజకీయ అడుగులపై ఊహాగానాలు మొదలయ్యాయి. ముఖ్యంగా ఆమె వైసీపీలో చేరుతారన్న వార్తలపై ఈ ప్రసంగం ఒక రకమైన సమాధానంగా మారింది.ఇదే సభకు నిర్వహణ బాధ్యతలు తీసుకున్న రాధా రంగా మిత్రమండలినేతలు, తాము ఏపీలో ఒక బలమైన రాజకీయ శక్తిగా అవతరిస్తామని ప్రకటించడంతో కొత్త చర్చకు దారి తెరచింది. రాజకీయ శక్తి అంటే పార్టీనేనా? రంగానాడు ఒక రాజకీయ వేదికగా మారుతుందా? అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. కొత్త పార్టీ వస్తే అదే పేరుతో ఏర్పడుతుందా అనే చర్చ కూడా సాగుతోంది.ఈ సభలో పాల్గొన్న తెలంగాణకు చెందిన బీసీ నేత, ఎంపీ ఆర్. కృష్ణయ్య కూడా బీసీలు, బడుగులు, కాపులు కలసి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. దీంతో బహుజన వర్గాల కోసం ఏపీలో కొత్త రాజకీయ పార్టీ ఏర్పడుతుందా అన్న ఆసక్తి పెరిగింది. ఆశాకిరణ్ రాష్ట్ర పర్యటన పూర్తయ్యాక ఆమె ప్రసంగాలు, ఆలోచనలు చూసిన తర్వాతే ఈ అంశంపై స్పష్టత వచ్చే అవకాశముందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

**చీలిక కోసం ఆరాటం**

2014 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీవిజయం సాధించింది.. అయితే తెరపైకి కాపు రిజర్వేషన్ ఉద్యమం వచ్చింది. ఎన్నికల్లో భాగంగా కాపులను బీసీల్లో చేరుస్తామని హామీ ఇచ్చినందున అమలు చేయాల్సిందేనని కాపు రిజర్వేషన్ ఉద్యమ నాయకుడు ముద్రగడ పద్మనాభం డిమాండ్ చేశారు. అప్పట్లో ఉద్యమం పతాక స్థాయికి చేరింది. ఈ క్రమంలోనే తునిలో రైలు విధ్వంసం ఘటన చోటుచేసుకుంది. 2015లో ఈ ఘటన జరిగింది. అయితే అప్పట్లో ఈ ఘటన వెనుక వైసీపీ హస్తం ఉందని ఆరోపణలు వచ్చాయి. సాక్షాత్ జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సంచలన ఆరోపణలు చేశారు. దీని వెనుక వైసిపి గుండాలు ఉన్నారని ఆరోపించారు. అయితే ఈ ఘటనతో కాపు సామాజిక వర్గంలో చేంజ్ కనిపించింది. అప్పటి తెలుగుదేశం పార్టీకి దూరమయ్యారు కాపులు. కాపుల్లో టిడిపి ప్రభుత్వం పట్ల అసంతృప్తి మొదలు కావడానికి తుని విధ్వంస ఘటన ఒకటి కారణం.ఇప్పుడు రంగా సేన ద్వారా కాపులు రాజకీయంగా యాక్టివ్ కావాలని భావిస్తున్నారు. అదే విషయాన్ని వైసిపి అనుకూల మీడియా హైలైట్ చేస్తోంది. తద్వారా కాపు సామాజిక వర్గంలో చీలికను ఆశిస్తున్నట్టు కనిపిస్తోంది. విశాఖలో ఈరోజు జరుగుతున్న భారీ బహిరంగ సభకు ఎక్కువమంది వైసిపి సానుభూతిపరులే వెళ్తుండటం కొత్త చర్చకు దారితీస్తోంది. ఇప్పటికే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రంగంలోకి దిగి కాపులను సమీకరించినట్లు ప్రచారం సాగుతోంది. త్వరలో వంగవీటి ఆశా కిరణ్ సైతం వైసీపీలో చేరుతారని ఒక ప్రచారం ఉంది. కూటమిలో కాపులు దూకుడుగా ఉన్నారు . దానికి కళ్లెం వేయాలని చూస్తోంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. అందుకే కాపు సేన ద్వారా ప్రయత్నాలు చేస్తోందన్న టాక్ ఉంది. అప్పట్లో తుని రైలు విధ్వంసం మాదిరిగానే.. ఈ సభతో టిడిపి పట్ల కాపుల్లో వ్యతిరేకత ప్రారంభమవుతుందని ఆశిస్తోంది. మరి ఏం జరుగుతుందో చూడాలి.

# రోడెక్కిన సిక్కోలు రాజకీయం

**శ్రీకాకుళం, డిసెంబర్ 29, పెన్ పవర్:** ప్రశాంతతకు మారుపేరుగా నిలిచే శ్రీకాకుళం జిల్లా రాజకీయాలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. ఎన్నికల ఫలితాల తర్వాత స్తబ్దుగా మారిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో అంతర్గత కుమ్ములాటలు ఇప్పుడు నడిరోడ్డుపై పడ్డాయి. ఆ పార్టీ సీనియర్ నేత, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్, పార్టీ నుంచి సస్పెన్షన్‌కు గురైన ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ మధ్య చెలరేగిన మాటల యుద్ధం.. ఇప్పుడు హత్యకు కుట్ర అనే తీవ్ర ఆరోపణల వరకు వెళ్లడం జిల్లావ్యాప్తంగా కలకలం రేపుతోంది. వ్యక్తిగత దూషణలు, రాజకీయ ఆధిపత్య పోరు కలగలిసి జిల్లా వైసీపీలో నిప్పు రాజేశాయి. అర్ధరాత్రి టెక్కలి జాతీయ రహదారిపై జరిగిన సంఘటన జిల్లా రాజకీయాల్లో తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. తనను హత్య చేయడానికి కుట్ర జరుగుతోందన్న సమాచారంతో హైదరాబాద్ నుంచి ఆగమేఘాల మీద శ్రీకాకుళం చేరుకున్న దువ్వాడ శ్రీనివాస్.. నేరుగా హైవేపైకి వచ్చి సవాల్ విసిరారు. “నా హత్యకు స్కెచ్ వేశారు.. దమ్ముంటే ఇక్కడికే వచ్చి చంపండి,” అంటూ ఆయన చేసిన సవాల్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ వ్యవహారం కేవలం రాజకీయ విమర్శల స్థాయిని దాటి, ప్రాణహాని ఉందని ఆరోపించే స్థాయికి చేరడం గమనార్హంఈ తాజా గొడవకు ప్రధాన కారణం ఒక ఫోన్ కాల్ అని తెలుస్తోంది. ధర్మాన కృష్ణదాస్‌కు అత్యంత సన్నిహితుడైన కింజరాపు అప్పన్న అనే వ్యక్తి.. దువ్వాడ శ్రీనివాస్ సన్నిహితురాలు దివ్వెల మాధురికి ఫోన్ చేసి బెదిరించినట్లు సమాచారం. దువ్వాడను అంతమొందించడానికి రంగం సిద్ధమైందని, ఈ కుట్ర వెనుక ధర్మాన వర్గం ఉందని ఆ కాల్ సారాంశంగా దువ్వాడ ఆరోపిస్తున్నారు. ఈ సమాచారం తెలిసిన వెంటనే తీవ్ర ఆగ్రహానికి గురైన దువ్వాడ, రాత్రికి రాత్రే రోడ్డెక్కి ధర్మాన సోదరులను టార్గెట్ చేశారుదువ్వాడ శ్రీనివాస్ ఆరోపణలు కేవలం కృష్ణదాస్‌కే పరిమితం కాలేదు. జిల్లాలో చక్రం తిప్పుతున్న ధర్మాన సోదరులు కృష్ణదాస్, ప్రసాదరావు.. తనను రాజకీయంగా అణగదొక్కడమే కాకుండా, ఇప్పుడు భౌతికంగా లేకుండా చేయాలని చూస్తున్నారని దువ్వాడ మండిపడ్డారు. ఇప్పటికే తనను పార్టీ నుంచి సస్పెండ్ చేయించడంలో వారి పాత్ర ఉందన్నది దువ్వాడ వాదన. “నన్ను పార్టీ నుంచి పూర్తిగా బహిష్కరిస్తేనే నాకు ఆనందం. అప్పుడు జిల్లాలో ఒక వర్గాన్ని అణచివేస్తున్న వీరిపై మరింత స్వేచ్ఛగా పోరాడగలను” అని దువ్వాడ వ్యాఖ్యానించడం.. ఆయన భవిష్యత్ కార్యాచరణనుక స్పష్టం చేస్తోంది. ధర్మాన సోదరుల ఆధిపత్యానికి గండి కొట్టాలన్నదే ఆయన ప్రధాన అజెండాగా కనిపిస్తోంది.మరోవైపు, ఈ ఆరోపణలను మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ తీవ్రంగా ఖండించారు. ఇదంతా దువ్వాడ ఆడుతున్న డ్రామాగా ఆయన అభివర్ణించారు. “దువ్వాడను చంపాల్సిన అవసరం నాకు ఏముంది? ఆయన చేస్తున్న ఆరోపణలు చూసి జనం నవ్వుకుంటున్నారు” అని కృష్ణదాస్ ఎద్దేవా చేశారు. కింజరాపు అప్పన్నతో తాను మాట్లాడింది నిజమే అయినా, దువ్వాడపై తనకు ఎలాంటి వ్యక్తిగత కక్ష లేదని స్పష్టం చేశారు. అనవసర రాద్ధాంతం చేసి సానుభూతి పొందాలన్నది దువ్వాడ ఎత్తుగడ అని ధర్మాన వర్గం వాదిస్తోంది.ఈ పరిణామాలను నిశితంగా పరిశీలిస్తే, ఇది కేవలం రాజకీయ వైరం మాత్రమే కాదని అర్థమవుతోంది. గత కొంతకాలంగా దువ్వాడ శ్రీనివాస్ వ్యక్తిగత జీవితం, దివ్వెల మాధురితో సహజీవనం, భార్య వాణితో విభేదాలు రచ్చకెక్కాయి. ఈ క్రమంలో పార్టీ అధిష్ఠానం ఆయనపై సస్పెన్షన్ వేటు వేసింది. అయితే, ఈ సస్పెన్షన్ వెనుక ధర్మాన సోదరుల హస్తం ఉందని దువ్వాడ బలంగా నమ్ముతున్నారు.ఎన్నికల్లో వైసీపీ ఓటమి తర్వాత జిల్లాలో కేడర్‌ను నడిపించే నాయకత్వం డీలా పడింది. ఈ సమయంలో సీనియర్ల మధ్య సమన్వయం లోపించడం, ఒకరిపై ఒకరు ఆధిపత్యం చెలాయించాలనుకోవడం ఈ రచ్చకు కారణమైంది. శ్రీకాకుళం జిల్లాలో బలమైన కాళింగ సామాజిక వర్గానికి చెందిన ఈ ఇద్దరు నేతల మధ్య పోరు.. అంతిమంగా ఆ సామాజిక వర్గంలో చీలికకు దారితీసే ప్రమాదం ఉంది. పార్టీ నుంచి సస్పెండ్ అయ్యాక, తన ఉనికిని చాటుకోవడానికి దువ్వాడ దూకుడు పెంచారు. ధర్మాన వంటి సీనియర్‌ను ఢీకొట్టడం ద్వారా.. తాను ఎవరికీ భయపడననే సంకేతాన్ని కేడర్‌కు, ప్రజలకు ఇవ్వాలని ఆయన భావిస్తున్నట్లు కనిపిస్తోంది.శ్రీకాకుళం వైసీపీలో ముదురుతున్న ఈ ముసలం ఎటు దారి తీస్తుందోనన్న ఆందోళన కార్యకర్తల్లో నెలకొంది. అధికారం కోల్పోయిన సమయంలో నేతలు సంయమనం పాటించాల్సింది పోయి, ఇలా రోడ్డెక్కి సవాళ్లు విసురుకోవడం పార్టీకి మరింత నష్టం చేకూరుస్తుందన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి.

## బాలారిష్టాలు దాటని పథకాలు

**ఏలూరు, డిసెంబర్ 29 పెన్ పవర్:** ఏపీలో ఎన్నికల వేళ రాజకీయ పార్టీలు ఇచ్చే హామీలు పాలనలో పెద్ద సవాలుగా మారతాయన్నది తెలిసిందే. అలాంటి హామీల్లో భాగంగా ప్రవేశపెట్టిన ముఖ్యమైన పథకమే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం. టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రకటించిన సూపర్ సిక్స్ హామీల్లో ఇది ఒకటి. ఈ పథకాన్ని ఈ ఏడాది ఆగస్టు 15 నుంచి అమల్లోకి తీసుకువచ్చారు. ఇప్పటికే నాలుగు నెలలకుపైగా ఈ పథకం కొనసాగుతోంది. అయితే ప్రయోజనాలతో పాటు ఆర్థిక భారం కూడా ప్రభుత్వం ఎదుర్కొంటోంది.రాష్ట్రవ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్ ఆర్టీసీ పరిధిలో పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, సిటీ ఆర్డినరీ మెట్రో ఎక్స్‌ప్రెస్ ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తున్నారు. దీంతో గ్రామాల నుంచి పట్టణాల వరకు మహిళలు ఎలాంటి టికెట్ ఖర్చు లేకుండా బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. అయితే ఈ పథకం కొనసాగాలంటే ఏటా సుమారు రెండు వేల కోట్ల రూపాయలు ప్రభుత్వ ఖజానా నుంచి ఖర్చు చేయాల్సి వస్తోంది.ఇప్పటికే ప్రభుత్వం రెండు విడతలుగా నిధులు విడుదల చేసింది. మొదట నాలుగు వందల కోట్ల రూపాయలు మంజూరు చేయగా, తాజాగా మరో ఎనిమిది వందల కోట్ల రూపాయలను రిలీజ్ చేసింది. మొత్తం కలిపి ఇప్పటివరకు దాదాపు 1200 కోట్ల రూపాయలు ఈ పథకానికి కేటాయించారు. ఈ నిధులు రావడంతో ఆర్టీసీకి ఊరట లభించింది. ఉద్యోగుల జీతాలు, డీజిల్ ఖర్చులు, ఇతర నిర్వహణ వ్యయాలను భరించేందుకు ఈ డబ్బు ఉపయోగపడుతోంది.ఈ పథకం రీయింబర్స్‌మెంట్ విధానంలో అమలవుతోంది. మహిళా ప్రయాణికులకు జీరో టికెట్ ఇస్తూ, వారి ప్రయాణ వివరాలను డేటాగా నమోదు చేస్తున్నారు. నెలకు ఎంత మంది మహిళలు ప్రయాణించారు, ఎంత ఖర్చు అయింది అనే వివరాలు ప్రభుత్వానికి చేరుతున్నాయి. సగటున నెలకు దాదాపు రెండు వందల కోట్ల రూపాయల మేర ఈ ఉచిత ప్రయాణాల ఖర్చు ఉంటుందని అంచనా. ఆ మొత్తాన్ని ప్రభుత్వం ఆర్టీసీకి తిరిగి చెల్లిస్తోందిఅయితే అమలులోకి వచ్చాక ఈ పథకంపై మిశ్రమ స్పందన వినిపిస్తోంది. మహిళలు ఉచిత ప్రయాణం చేస్తున్నప్పటికీ, సౌకర్యాల విషయంలో అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. చాలా చోట్ల బస్సులు ఆగడం లేదని, ఆగినా కొందరు కండక్టర్లు విసుగ్గా ప్రవర్తిస్తున్నారనే ఫిర్యాదులు ఉన్నాయి. మరోవైపు రద్దీ పెరగడంతో పురుషులకు సీట్లు దొరకడం కష్టమవుతోంది. దీంతో ఉద్యోగులకు, విద్యార్థులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మొత్తంగా చూస్తే ఈ పథకం ఇంకా బాలారిష్టాలు దాటలేదని పరిశీలకులు అంటున్నారు. రద్దీ ఉన్న మార్గాల్లో అదనపు బస్సులు నడపడం, ప్రతి బస్ స్టాప్‌లో కచ్చితంగా బస్సులు ఆగేలా చూడడం, సిబ్బందికి సరైన అవగాహన కల్పించడం జరిగితే మహిళలకు ఉచిత బస్సు పథకం నిజమైన ప్రయోజనం అందిస్తుందని అభిప్రాయం వ్యక్తమవుతోంది.

## ఆస్కింగ్ వర్సెస్ సేయింగ్....

**అనంతపురం, డిసెంబర్ 29 పెన్ పవర్:** జస్ట్ ఆస్కింగ్ పేరుతో సోషల్ మీడియాలో బీజేపీని వ్యతిరేకించే నటుడు ప్రకాష్ రాజ్ కు, బీజేపీ జాతీయ కౌన్సిల్ మెంబర్ అయిన విష్ణువర్ధన్ రెడ్డికి మధ్య సోషల్ మీడియాలో వార్ జరుగుతోంది. విశాఖపట్నంలో కమ్యూనిస్టు పార్టీ కార్యక్రమంలో మాట్లాడిన ప్రకాష్ రాజ్.. మావోయిస్టుల్ని ఎందుకు కాల్చి చంపుతున్నారని.. వారిని జన జీవన స్రవంతిలోకి వచ్చేలా చూడాలన్నారు. అదే సమయంలో ఆరెస్సెస్ లో మహిళలకు ఎందుకు ప్రాధాన్యత ఇవ్వరని ప్రశ్నించారు. ఈ విమర్శలపై బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యులు విష్ణువర్ధన్ రెడ్డి స్పందించారు. అయితే ఆయన స్పందనపైనా ప్రకాష్ రాజ్.. వెంటనే రియక్ట్ అయ్యారు కాలిందా అంటూ స్పందించారు. దీనికి విష్ణువర్ధన్ రెడ్డి ఘాటుగా రిప్లయ్ ఇచ్చారు. కాలిన వాసన ఎక్కడ వస్తుందో మీ మాటల ద్వారానే తెలిసిపోతోందని నిజం చెప్పులేసుకునేలోపు అబద్ధం ప్రపంచం అంతా చుట్టి వస్తుందన్నట్లుగా ఉద్దేశపూర్వకంగా చేసే తప్పుడు ప్రచారాలకు వెంటనే కౌంటర్ ఇవ్వకపోతే మీలాంటి వాళ్లు చేసే తప్పుడు ప్రచారాలు వేగంగా ప్రజల్లోకి వెళ్తాయన్నారుమావోయిస్టులు ఎంతో మంది అమాయకుల్ని చంపారు. అందులో ఎక్కువ మంది గిరిజనులు ఉన్నారు. పోలీసులు ఉన్నారు. రాజకీయ నేతలు ఉన్నారు. ఏ కారణంతో చంపినాడ అసలు అలా చంపే హక్కు ఉందని ఎప్పుడైనా ప్రశ్నించారా .. అడవిలో తమ పట్టు సడలిపోతుందని అడవి బిడ్డల్ని ఇన్‌ఫార్మర్ల పేరుతో ఇష్టారీతిన చంపినప్పుడు మాట్లాడారా.. అని ప్రశ్నించారు. మావోయిస్టులు లొంగిపోవడానికి అన్ని అవకాశాలు కల్పించారని.. లొంగిపోయిన వాళ్లు వేల మంది ఉన్నారని.. విష్ణువర్ధన్ రెడ్డి గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీలో పండిపోయిన నేతలు కూడా ఆరెస్సెస్ ఎంత గొప్పదో చెబుతున్నారని ఇప్పుడు ఆరెస్సెస్ గురించి ఎందుకు వ్యతిరేకతంగా మాట్లాడతారని ప్రశ్నించారు. అన్నీ తెలిసినా ఎర్రపార్టీల నీడకు వెళ్లి చల్లగా నాలుగు అబద్ధాలు చెప్పారని మేం స్పందించేసరికి నీకు కాలిందా అని రివర్స్ లో ప్రశ్నించారు. గతంలోనూ వీరి మధ్య వాదోపవాదాలు జరిగాయి.

## ఏడాదికి ఏడు రోజేలే.. స్వ చ్ఛ టాయ్ లెట్స్..

**నెల్లూరు, డిసెంబర్ 29పెన్ పవర్:** స్వచ్ఛ భారత్ మిషన్ కింద నెల్లూరులో రూ. 5.56 కోట్లతో కట్టిన 57 మరుగుదొడ్లు ఇప్పుడు నిరుపయోగంగా మారాయి. జనసంచారం ఎక్కువగా ఉండే చోట్ల నిర్మించిన ఈ స్వచ్ఛ్ టాయిలెట్లకు తాళాలు వేయడంతో ఇవి నిరుపయోగంగా మారాయి. ఇవి అందుబాటులో లేకపోవడంతో.. ప్రజలు డబ్బులు పెట్టి సులభ్ కాంప్లెక్స్‌లను ఆశ్రయించాల్సి వస్తోంది. బారాషహీద్ దర్గా రొట్టెల పండగప్పుడు మాత్రమే తెరిచే మరుగుదొడ్లు, మిగతా సమయాల్లో మూతపడుతున్నాయి.కేంద్రంలో అధికారంలో ఉన్న నరేంద్ర మోదీ ప్రభుత్వం.. నగరాలు, పట్టణాలను, గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడం మాత్రమే కాకుండా బహిరంగ మలవిసర్జన రహితంగా మార్చడం కోసం స్వచ్ఛ భారత్ మిషన్ ప్రారంభించింది. దీనిలో భాగంగా జనాభా అధికంగా ఉండే పలు నగరాలు, పట్టణాల్లో ప్రజా వినియోగం కోసం మరుగుదొడ్లు నిర్మించింది. అయితే ఆయా నగర పాలక సంస్థల అధికారుల నిర్లక్ష్యం వల్ల అవి నిరుపయోగంగా మిగులుతున్నాయి. ఫలితంగా కోట్ల రూపాయలు వ్యర్థం అవుతున్నాయి.ఈక్రమంలోనే ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు పట్టణంలో 2021 సంవత్సరంలో రూ. 5.56 కోట్లు ఖర్చు పెట్టి 57 ప్రాంతాల్లో స్వచ్ఛ మరుగుదొడ్లను నిర్మించారు. కానీ పర్యవేక్షణ లోపం వల్ల అవి నిరుపయోగంగా మారాయి. నెల్లూరు పట్టణ జనాభా సుమారు 10 లక్షలకు చేరింది. ఇది జిల్లా కేంద్రం కావడంతో.. నిత్యం వేర్వేరు మండలాలు, ఇతర ప్రాంతాల నుంచి సుమారు 2 లక్షల మంది వరకు వస్తుంటారు. ఇలా వచ్చే వారి అవసరాలను తీర్చడంతో పాటు.. నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడం కోసం కోట్ల రూపాయలు ఖర్చు చేసి మరుగుదొడ్లు నిర్మించారు.అయితే వీటిని వినియోగించుకునేందుకు వీలు లేకుండా.. ఈ మరుగుదొడ్లకు తాళాలు వేశారు. మరీ ముఖ్యంగా ఆర్టీసీ బస్టాండ్, పొగతోట, మూలాపేట గేటు, ఆత్మకూరు బస్టాండ్, స్టోన్‌హౌస్‌పేట, కొండాయపాళెం గేటుతదితర ప్రాంతాల్లో జన సంచారం ఎక్కువ. అయితే ఈ ప్రాంతంలో నిర్మించిన మరుగు దొడ్లకు తాళం వేశారు. దీంతో చాలా చోట్ల బహిరంగ మల, మూత్ర విసర్జన కొనసాగుతూ.. స్వచ్ఛత అటకెక్కుతోంది.అయితే ములమూడి బస్టాండ్, ఆర్టీసీ బస్టాండ్, ఆర్ఆర్ వీధి, ఏసీ సుబ్బారెడ్డి కూరగాయల మార్కెట్వంటి ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో ప్రజలు బస్సుల కోసం ఎదురు చూస్తుంటారు. అయితే ఈ ప్రాంతాల్లో కూడా నగరపాలక సంస్థకు చెందిన మరుగుదొడ్లకు తాళాలు వేయడంతో.. ప్రజలు.. ఇక్కడి సులభ్ కాంప్లెక్స్‌ల్లో డబ్బు చెల్లించి కాలకృత్యాలు తీర్చుకోవాల్సిన పరిస్థితి.ఇదిలా ఉంటే బట్వాడిపాళెం కూడలిలో ఉన్న మరుగుదొడ్డిని.. కేవలం బారాషహీద్ దర్గా రొట్టెల పండగ సందర్భంగా మాత్రమే.. ప్రతి సంవత్సరం 7 రోజులే తెరుస్తారు. ఆ పండగ అయిపోగానే మళ్లీ తాళం వేస్తారు. వీటిని మళ్లీ తిరిగి తెరిచేది ఏడాది తర్వాతే. దీనిపై అధికారులు స్పందిస్తూ చర్యలు తీసుకుంటామని తెలిపారు

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

# పరిశ్రమల్లో రక్షణ డొల్ల

**హైదరాబాద్ పెన్ పవర్:** దేశంలోని పరిశ్రమల్లో భద్రతా చర్యలపై తగిన శ్రద్ధ తీసుకోకపోవడంతో ప్రమాదాలు పెరుగుతున్నాయి. అత్యధిక ప్రమాదాలు, మరణాలు రసాయన కంపెనీల్లో చోటు చేసుకుంటున్నాయి. పరిశ్రమాధిపతుల కోసం ప్రభుత్వాలు పరిశ్రమల తనిఖీ, కార్మికుల భద్రత, రక్షణ వంటి అంశాలపై పని చేసే వ్యవస్థలను బలహీనం చేయడంతో ప్రమాదాల తీవ్రత పెరుగుతోంది. దేశంలో ఆంధ్రప్రదేశ్, గుజరాత్, మహారాష్ట్ర, తమిళనాడు, ఛత్తీస్‌గఢ్, ఉత్తరప్రదేశ్ లలో ఈ ప్రమాదాలు ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయి. 2022లో సెంటర్ ఫర్ సైన్సు అండ్ ఎన్విరాన్‌మెంట్ (సిఎస్ఇ) నిర్వహించిన అధ్యయనంలో గడచిన రెండున్నర సంవత్సరాల్లో దేశంలో 130కి పైగా జరిగిన రసాయన ప్రమాదాల్లో 218 మరణాలు సంభవించగా, 300 కంటే ఎక్కువ మంది గాయపడ్డారని గుర్తించింది. గత ఐదేళ్లలో ఎ.పి లో సుమారు 119కి పైగా జరిగిన ప్రమాదాల్లో 150 మంది మృతి చెందినట్లు వసుధ మిశ్రా కమిటీ తెలిపింది. భద్రతకు పరిశ్రమాధిపతులు ప్రాధాన్యత ఇవ్వకపోవడంతో అగ్ని ప్రమాదాలు, పేలుళ్లు చోటుచేసుకుంటున్నాయని నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ ప్రకటించింది. అనకాపల్లి జిల్లాలోని పరవాడ, అచ్యుతాపురం, రాంబిల్లి, నక్కపల్లి, పాయకరావుపేట మండలాల్లోని 138 ఔషధ, రసాయన పరిశ్రమల్లో 40 వేల మంది, ప్రత్యేక ఆర్థిక మండళు (ఎస్.ఇ.జెడ్)లో మరో 20 వేల మంది కార్మికులు పనిచేస్తున్నారు. అచ్యుతాపురంలోని అసెన్షియ కంపెనీలో ప్రమాదం యాజమాన్యం నిర్లక్ష్యంతో జరిగినట్లు పరిశ్రమల తనిఖీ ఇన్‌స్పెక్టర్ల విచారణలో తేలింది. బెయిల్‌పై బయటకు వచ్చేలా కంపెనీ యాజమాన్యంపై 106(1),125(బి), 125(ఎ) సెక్షన్ల కింద పోలీసు కేసు నమోదుచేశారు. సేఫ్టీ ఆడిట్ క్రమం తప్పకుండా నిర్వహించి, లోపాలను సరిదిద్దేలా చూడాల్సిన ప్రభుత్వం, ఆ బాధ్యత, పర్యవేక్షణ నుంచి తప్పుకొని యజమానుల కొమ్ము కాసే విధానాలు అమలు చేస్తోంది. అనుమతుల జారీకి కాలపరిమితి విధించి ఎటువంటి తనిఖీలు చేయకుండా, భౌతిక పరిశీలన లేకుండా అనుమతులు ఇచ్చే స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాన్ని ముందుకు తెచ్చింది. ఉత్పత్తి క్రమంలో ప్రమాదాలు జరగకుండా తగిన నియంత్రణా చర్యలు చేపట్టని యాజమాన్యాలపై కనీస చర్యలు తీసుకొనే అవకాశం లేకుండా ప్రభుత్వాలు చేస్తున్నాయి. తాజాగా లేబర్ కోడ్‌లు తెచ్చి కార్మికులకు హక్కుల్లేకుండా మోడీ ప్రభుత్వం చేసింది. ఆ యా శాఖలకు భద్రతపై పర్యవేక్షించే అధికారాలను కత్తిరించింది. అన్ని వైపుల నుంచి కార్మికులపై దాడికి దిగి, కార్పొరేట్ సంస్థలు, ధనికులకు లాభాలు చేకూర్చేందుకు నేనున్నానని ప్రభుత్వం భరోసా ఇస్తుంది. కార్మికుల ప్రాణాలకు ఏ విలువా లేనట్లు, వారు మనుషులు కానట్లు చూస్తోంది. ప్రమాదాలు జరిగినప్పుడు సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఏర్పాటు చేయాల్సిన సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిపై కూడా ప్రభుత్వాలు శ్రద్ధ చూపడంలేదు. పరిశ్రమల్లో కార్మికుల రక్షణకు సంబంధించి ప్రతి ఆరు నెలలకు ఆడిట్ నిర్వహించాలి. గుర్తించిన లోపాలను సరిచేయాలి. కార్మికులకు ప్రతీ పరిశ్రమలో భద్రతా పరికరాలు ఇచ్చేలా ప్రభుత్వ శాఖల పర్యవేక్షణ పెరగాలి. భద్రతకు ప్రాధాన్యత ఇవ్వని పరిశ్రమల అనుమతులు రద్దు చేయాలి. పని ప్రదేశంలో విద్యార్హతలు కల్గిన నైపుణ్య కార్మికులను నియమించాలి. భద్రతపై చర్యలు తీసుకోని ఫలితంగా ప్రమాద ముప్పు కార్మికులపై పొంచి వుంది. ప్రమాదకర రసాయనాల విడుదలతో ఏ చిన్న ప్రమాదం జరిగినా కార్మికుల ప్రాణాలు పోతున్నాయి. వారి కుటుంబాలు వీధిన పడుతున్నాయి. రసాయనాల శుద్ధిపై దృష్టి పెట్టక పోవడంతో నేల, గాలి, నీరు కలుషితమై ప్రజలు జబ్బుల పాలవుతున్నారు. పారిశ్రామిక ప్రమాదాల నివారణకు నిపుణులతో ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు చేసి, కమిటీ సూచనలు అమలుచేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. రాష్ట్రంలో పరిశ్రమల తనిఖీ శాఖలో ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ల ఖాళీలను భర్తీ చేసి తనిఖీలు పెంచాలి. పరిశ్రమలో ప్రమాదాలకు యాజమాన్యాన్ని బాధ్యులను చేసి క్రిమినల్ కేసులు పెట్టాలి. వలస కార్మికుల వివరాలను తహశీల్దార్ కార్యాలయంలో నమోదు చేయాలి. 8 గంటలకు మించి ఉచితంగా పని చేయించుకుంటున్న యజమానులపై కార్మిక శాఖ అధికారులు తనిఖీలు చేసి కేసులు నమోదు చేయాలి. పరిశ్రమలలో పర్మినెంట్ కార్మికుల నియామకాలు చేపట్టాలి. కార్మికులు అప్రమత్తమై తమకు జరుగుతున్న అన్యాయంపై సంఘటితం కావాలి. హక్కుల రక్షణ, సాధనకు ఐక్యంగా పోరాడాలి.

## పాకిస్తాన్‌లో13 మంది ఉగ్రవాదులు మృతి



**హైదరాబాద్ పెన్ పవర్:** పాకిస్తాన్ బలూచిస్తాన్ ప్రావిన్స్‌లో వివిధ నిఘా ఆధారిత కార్యకలాపాలలో పాకిస్తాన్ భద్రతా దళాలు నిషేధిత తిరుగబాటు గ్రూపులకు చెందిన 13 మంది ఉగ్రవాదుల్ని హతమార్చాయి. ఈ విషయాన్ని ఇంటర్ సర్వీసెస్ పబ్లిక్ రిలేషన్స్ (ఐఎస్‌పిఆర్) శనివారం వెల్లడించింది. డిసెంబర్ 24, 25 తేదీల్లో ప్రావిన్స్‌లోని కోహ్లు, కలాట్ ప్రాంతాల్లో నిర్వహించిన రెండు ఆపరేషన్లలో ఈ ఉగ్రవాదులు హతమైనట్లు మిలటరీ మీడియా విభాగం, ఐఎస్‌పిఆర్ తెలిపింది. రెండు ప్రకటనల్లో ఆయా ప్రాంతాలలో ఉగ్రవాదులపై నిఘా ఆధారిత కార్యకలాపాలు నిర్వహించినట్లు ఐఎస్‌పిఆర్ తెలిపింది. కొహ్లులో చేపట్టిన ఆపరేషన్‌లో ఐదుగురు, డిసెంబర్ 25న కలాట్ ప్రాంతంలో నిర్వహించిన ఆపరేషన్‌లో ఎనిమిది మంది ఉగ్రవాదులు మృతి చెందినట్లు ఐఎస్‌పిఆర్ వెల్లడించింది. సైనిక బలగాలు చేపట్టిన ఆపరేషన్స్‌లో మొత్తంగా 13 మంది ఉగ్రవాదులు హతమయ్యారు. ఉగ్రవాదుల నుంచి ఆయుధాలు, మందుగుండి సామాగ్రి, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసు భద్రతా దళాలు ప్రకటనలో తెలిపాయి. ఇక ఈ నెల ప్రారంభంలో కలాట్‌లో భద్రతా దళాలు 12 మంది ఉగ్రవాదులను హతమార్చాయి. గత కొంతకాలంగా పాకిస్తాన్ భద్రతా దళాలు ఉగ్రవాదుల ఏరివేత లక్ష్యంగా 'అజ్మ్-ఎ-ఇస్తేకామ్' ఆపరేషన్స్ నిర్వహిస్తున్నాయి.

## పౌరులు, ప్రార్థనా స్థలాలపై దాడులు ఆమోదయోగ్యం కాదు



**హైదరాబాద్ పెన్ పవర్:** సిరియాలోని హౌమ్స్‌లోని అలీ బిన్ అబీ తాలిబ్ మసీదులో శుక్రవారం ప్రార్థన సమయంలో ఉగ్రదాడి జరిగింది. ఈ దాడిలో ఎనిమిది మృతి చెందారు. ఈ దాడిని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ శనివారం ఖండించారు. ఈ ఘటనలో మృతులకు ఆయన సంతాపం తెలిపారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. 'సిరియాలోని హౌమ్స్‌లోని అలీ బిన్ అబీ తాలిబ్ మసీదు వద్ద శుక్రవారం ప్రార్థనల సమయంలో జరిగిన ఘోరమైన ఉగ్రవాద దాడిని నేను తీవ్రంగా ఖండిస్తున్నాను. పౌరులు, ప్రార్థనా స్థలాలపై దాడులు ఆమోదయోగ్యం కాదు. మృతుల కుటుంబాలకు నా సంతాపం. గాయపడిన వారందరికీ నా సానుభూతి. వారు త్వరగా పూర్తిగా కోలుకోవాలని కోరుకుంటున్నాను' అని గుటెరస్ ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు.

# ఉద్యోగ రంగంలో అన్యాయాలపై సుదీర్ఘ పోరాటాలు

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ ప్రాంతీయులకు ఉద్యోగ రంగంలో దశాబ్దాలుగా జరిగిన అన్యాయాన్ని సవరించి చక్క దిద్దేందుకు నాటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ 610 జీ.ఓ. (G.O. Ms.No.610 GA (SPF-A)Dept., Dt:30-12-1985) జారీ చేసిన రోజు డిసెంబర్ 30.. తెలంగాణ స్థానికులకు జరిగిన అన్యాయం ఏమిటి? అది ఎలా జరిగింది? సవరింపులు, చక్కదిద్దడాలు జరిగాయా? ముల్కి నిబంధనలు, ఆరు సూత్రాల పథకం, పెద్దమనుషుల ఒప్పందం, రాష్ట్రపతి ఉత్తర్వులు, 610 ఉత్తర్వులు, గిర్గ్లానీ నివేదికలు, తెలంగాణ వాసులకు జరిగిన అన్యాయాన్ని నిలువరించ లేక పోయాయి. ఇందుకు సంబంధించి 610 ఉత్తర్వుల జారీ పూర్వాపరాల గురించి తెలిపే ప్రయత్నం ఇది. ఆంగ్ల భాష రాదన్న సాకుతో, నిజాం పాలనలో ఉత్తరాది వారికే ఉద్యోగాలు అధికంగా దక్కగా, చాలాకాలం అనంతరం ఉవ్వెత్తున లేచిన ఉద్యమ ఫలితంగా మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ 1919లో ప్రవేశ పెట్టిన ముల్కి నిబంధనల ప్రకారం తెలంగాణలోని ఉద్యోగాలన్నీ స్థానికులకే చెందాల్సి ఉండెను. దీని ప్రకారం 15 సంవత్సరాల కనీస నివాస యోగ్యతగా స్థానికత్వ నిర్ధారణ జరగాల్సి ఉండెడిది. అంతేకాక ఉద్యోగ విమణ తర్వాత కూడా తెలంగాణలోనే ఉండాలనే షర్తులు విధించ బడినాయి. తెలంగాణ ప్రాంతంలో ఉద్యోగం పొందటానికి నివాస నిబంధన 12 సంవతరాలు ఉండాలని సవరించి, నిర్ణయించ బడింది. 1973 సెప్టెంబర్ 23న జారీ అయిన ఆరు సూత్రాల పథకంలో భాగంగా 1975 అక్టోబర్ 18న రాష్ట్రపతి ఉత్త ర్వులు 674 (ప్రెసిడెన్షియల్ ఆర్డర్) (+.ా.వీం.చీశీ.674, +ూ (శ్రాఖీ-ూ) ఐవజ్ఞ్., ణ: 20-10-1975) జారీ అయి రాష్ట్రాన్ని 1,2,3 కోస్తాంధ్ర, 4 రాయలసీమ మరియు 5,6 తెలంగాణ జోన్లుగా విభజించారు. ఈ ఉత్తర్వులోని పేరా 14 ప్రకారం కొన్నింటిని స్థానిక రిజర్వేషన్ల పరిధి నుండి తప్పించడం జరిగింది. హైదరాబాద్ లోని మినహాయించిన ఆఫీసులకు కాకుండా మిగిలిన అన్ని ప్రభుత్వ ఆఫీసులలో లోకల్ రిజర్వేషన్ పాటించాల్సిందని పేరా 20 సూచించింది. అలాగే పేరా 9 ప్రకారం 10వ తరగతి నుండి కింది స్థాయి 4వ తరగతి వరకు చదివిన విద్యా సంస్థ జిల్లా పరిధిగా, ఆ జిల్లాలో సంవత్సరాలు చదువును స్థానికంగా వివరించారు. రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం జిల్లాస్థాయి కేడర్లలో 80%, జోనల్ స్థాయిలో 60% స్థానికులకు ఉద్యోగాలు రిజర్వు చేయ బడినాయి. రిజర్వు చేయబడినవి పోగా మిగిలినవి ఓపెన్ కాంపిటీషన్ ద్వారా భర్తీ చేయాలి. వాటిని స్థానికేతరులకు రిజర్వు చేయరాదని ఉత్తర్వులు స్పష్టంగా పేర్కొన్నాయి. 1919 నుండి అమలులోనున్న నివాస యోగ్యతను 15 నుండి12 కు (1958లో) అనంతరం 1975లో 4సంవత్సరాలకు తగ్గించగా, వివక్షత కొనసాగింది. రాష్ట్రపతి ఉత్తర్వులలో పేర్కొన్న విధంగా జోనల్ వారీ విధానాన్ని సైతం తుంగలో తొక్కి, స్వార్ధమే పరమార్ధంగా పాలన కొనసాగించడం జరిగింది. నాటి ముఖ్య మంత్రి ఎన్టీ రామారావు నియమిం చిన జయభారత్ రెడ్డి, కమల నాథన్, ఉమాపతి తో కూడిన సీనియర్ ఐఎఎస్ అధికారుల త్రిసభ్య కమిటీ, 1975 నుండి 1984 మధ్య కాలంలో జరిగిన ఉద్యోగ నియామకాలను పరిశీలించి సమర్పించిన 36 పేజీల 1981 జూన్ నాటి నివేదికలో, జోన్ల రిజర్వేషన్లకు విరుద్ధంగా ఆంధ్ర ప్రాంతానికి చెందిన 1,2,3లకు చెందిన వారు తెలంగాణకు చెందిన 5,6 జోన్లలో 58,986 మంది నిబంధనలకు విరుద్ధంగా నియ మింప బడినట్లు పేర్కొనడం జరిగింది. ఈ నివేదికను పరిశీలించిన నాటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ 1985 డిసెంబర్ 30న 610 జీవోను జారీ చేశారు. గత పాలకులు చేసిన తప్పులను దిద్దుకునే క్రమంలో 1986 మార్చి 30కల్లా 610 జీవోను అమలు పరిచి, తెలంగాణలో ఉన్న ఆంధ్ర ఉద్యోగులందరినీ ఎవరి జోన్లకు వారిని పంపుతామని ఎన్టీఆర్ ప్రభుత్వం ప్రకటించడం జరిగింది. ఈ క్రమంలో రాయల సీమ ప్రాంతంలో నియుక్తులైన స్థానికేతర ఉద్యోగులను కోస్తాంధ్ర, తెలంగాణ ప్రాంతాలకు పంపిం చాలన్న "జీ.ఓ. 564, తేది: 05-12-1985" మాత్రం వెంటనే అమలయింది. ఎన్టీఆర్ ను గద్దె దింపి, ముఖ్యమంత్రి అయిన చంద్రబాబు, రిటైర్డ్ ఐఎఎస్ అధికారి గిర్గ్లానీ ఏకసభ్య కమిషన్ ను పునః పరిశీలనకై నియ మించగా, నివేదిక సమర్పించిన గిర్గ్లానీ స్థానికేతరులను నిర్ధారించ గల సంపూర్ణ సమాచారం పొంద కుండానే, సమర్పిత నివేదికలో రాష్ట్రపతి ఉత్తర్వులను 128 పద్ధతులలో ఉల్లంఘించడం జరిగిం దని వివరించి, వాటిని 18రకాలుగా వర్గీకరించి, పరిష్కార మార్గాలను సూచించడం జరిగింది. ఉద్యోగ నియామకాలన్నీ జోనల్ నిబంధ నలను అనుసరించి జరగాల్సి ఉండగా, జోనల్ ఆఫీసులను రాష్ట్ర స్థాయి కార్యాలయాలుగా మార్చి ఇష్టారాజ్యంగా బదిలీలు చేయడం జరిగిందని, ఈ బదిలీలు తప్పని కమిషన్ అభిప్రాయ పడ్డది. గిర్గ్లానీ నివేదిక ప్రకారం సగం మంది స్థానికేతరులు ఉన్నారని స్పష్టం అయింది. తెలంగాణ స్వరాష్ట్ర ప్రభుత్వ పాలనలో సదరు అన్యాయానికి అడ్డుకట్ట వేసేందుకు చర్యకు తీసుకోవాలని నిర్ణయించారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి అంకురార్పణ జరిగింది సదరు వివక్షత కారణం ప్రధానం కాగా, అట్టి వివక్షత రూపు మాపేందుకు, సిఎం కేసిఆర్ ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించి, పలు అంశాలపై చర్చించి, 7జోన్లు, 2 మల్టీ జోన్లను 31 జిల్లాలను కలిపి ఖరారు చేశారు. తర్వాత 33 జిల్లాలతో కలిపి తెలంగాణ పబ్లిక్ ఎంప్లాయిమెంట్ ఆర్డర్ - 2018ను అమల్లోకి తెచ్చారు. దీనికి అనుగుణంగా 33 జిల్లాలకు ఉద్యోగులను విభజించే ప్రక్రియ చేపట్టారు. 33 జిల్లాలతో రాష్ట్రపతి ఆమోదించిన కొత్త జోనల్ వ్యవస్థ-2018కి అను గుణంగా ప్రభుత్వం ఈ మార్గదర్శ కాలను రూపొందించింది. కొత్త జోనల్ వ్యవస్థలో స్థానిక కోటా కింద 95 శాతం, ఓపెన్ కోటా కింద 5 శాతం చొప్పున జరిగే నియామకాల్లో పూర్తిగా 100 శాతం ఉద్యోగాలు తెలంగాణ నిరుద్యోగులకే చెందేలా, ఓపెన్ కోటాలోని 5 శాతం ఉద్యోగాలకు కూడా తెలంగాణ నిరుద్యోగులు మాత్రమే దరఖాస్తు చేసుకునేందుకు కొత్త జోనల్ వ్యవస్థ అవకాశం కలిగించింది.

# కోరికలు తీర్చు యాదాద్రి లక్ష్మీనరసింహుడు

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణలోని ప్రముఖ ఆలయాలలో ఒకటైన, ఉమ్మడి నల్లగొండజిల్లా ప్రస్తుత యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండల కేంద్రము సమీపములో ఎత్తయిన గుట్టపై ఉన్న శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవాలయములో డిసెంబర్ 30న స్వామివారి వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు ఘనంగా జరుగనున్నాయి. ఋష్యశృంగ మహర్షి, శాంతల పుత్రుడు యాదమహర్షి చిన్నతనం నుంచే హరిభక్తుడు. ఆంజనేయస్వామి సలహాపై ప్రస్తుతం యాదగిరిగా పిలవబడుతున్న ప్రదేశంలో చాలా కాలం తపస్సు చేశారు. అప్పుడు ఒక రాక్షసుడు ఆహార అన్వేషణలో అటుగావచ్చి నిశ్చల తపస్సులో వున్న ఈ ఋషిని చూసి తినబోయాడు.ఆ విషయం తపస్సులోవున్న ఋషికి తెలియలేదు గానీ, ఆయన ఎవరి గురించైతే తపస్సు చేస్తున్నాడో ఆ శ్రీ హరి ఆయుధం అయిన సుదర్శన చక్రం వచ్చి ఆ రాక్షసుని సంహరించింది. అది చూసిన ఋషి ఆ సుదర్శన చక్రాన్ని పలు విధాల ప్రార్థించి, భక్తులకు ఏవిధమైన బాధలూ కలుగకుండా దుష్ట సంహారం చేస్తూ అక్కడే వుండిపొమ్మని కోరగా ఆ సుదర్శనము అనతికాలము లోనే అక్కడ వెలయ బోవుచున్న లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ శిఖరాన షట్కోణాకారాన వెలసి స్వామి దర్శనానికి వచ్చు భక్తులను సదా కాపాడుతూ వుంటానని వరమిచ్చి అంతర్ధానం అయినట్లు కథనం. యాదమహర్షి తన తపస్సుని కొనసాగించగా, ఆయన తపస్సుకి మెచ్చి నరసింహస్వామి ప్రత్యక్షమై, యాద మహర్షి కోరిక మీద అక్కడ లక్ష్మీ నరసింహస్వామి గా వెలిశాడు. ఆ ఋషి కోరిక మీదే ఆ కొండ యాదగిరిగా ఋషి పేరుమీద ప్రసిద్ధికెక్కింది. ఆ ఋషి తపస్సు చేసింది, స్వామి ప్రత్యక్షమైంది కొండక్రిందవున్న పాత లక్ష్మీనరసింహస్వామి గుడి దగ్గర అని అంటారు. యాద మహర్షి కోరిక మీదే ఆంజనేయస్వామి యాదగిరిలో క్షేత్రపాలకుడుగా వున్నాడు. ప్రహ్లాదుని రక్షించటానికి, అహోబిలంలో నరసింహస్వామి స్తంభాన్ని చీల్చుకుని వచ్చి హిరణ్యకశిపుని సంహరించిన తర్వాత ఆ భీకర రూపాన్ని శాంత పరచటం ఎవరికీ సాధ్యం కాలేదట. అప్పుడు దేవతలంతా లక్ష్మీదేవిని ప్రార్థిస్తే ఆమె ప్రత్యక్షమై స్వామిని శాంతింప చేసిందట. అప్పుడు ప్రహ్లాదుడు స్వామిని అక్కడే ప్రసన్న రూపంలో కొలువై వుండమని కోరాడట. అయితే స్వామి అతి భీకర రూపంలో దర్శనమిచ్చిన ఆ ప్రదేశంలో శాంత రూపంతో కొలువై వుండటం లోక విరుద్ధమని అక్కడికి సమీపంలో వున్న యాదగిరిలో లక్ష్మీ నరసింహస్వామి గా లోక కళ్యాణార్థం కొలువు తీరుతానని బయల్దేరారు, లక్ష్మీ సమేతుడై కొండపై గల గుహలో వెలిశారు. ఆయనవెంట ప్రహ్లాదుడూ, సకల దేవతలూ వచ్చి ఆయనతోపాటు ఇక్కడ కొలువుతీరి స్వామిని సేవిస్తూ వచ్చారట.రాక్షస సంహారంచేసి లోక కళ్యాణం చేశారని సంతోషంతో స్వామివారి కాళ్ళని బ్రహ్మదేవుడు ఆకాశ గంగతో కడిగాడట. ఆ ఆకాశ గంగ లోయలలోంచి పారి విష్ణు పుష్కరిణిలోకి చేరింది. ఈ పుష్కరిణికి కూడా చాలా ప్రాముఖ్యం వుంది. ఇందులో స్నానంచేసి స్వామిని సేవించినవారికి సకల కోరికలూ తీరుతాయి. ఇక్కడ పితృకార్యాలు చేస్తే పితృ దేవతలు తరిస్తారు. చాలామంది భక్తులు ఆరోగ్యం, గ్రహపీడా నివారణ, వగైరా కోరికలతో కొన్నాళ్ళపాటు ఇక్కడ వుండి విష్ణు పుష్కరిణిలో స్నానం చేసి స్వామిని సేవిస్తారు. అంతేగాక ఇప్పటికీ రోజూ రాత్రుళ్ళు ఆ చుట్టుప్రక్కల కొండలమీద తపస్సు చేసుకుంటున్న ఋషులు విష్ణు పుష్కరిణిలో స్నానంచేసి స్వామిని అర్చిస్తారట. దానికి నిదర్శనంగా వారు వచ్చేటప్పుడు మృదంగ ధ్వనులు వస్తాయట. పాదాల గుర్తులు కొందరు చూశారుట. వారు స్వామిని అర్చించిన గంధ పుష్పాదులు కూడా నిదర్శనమంటారు. మెట్ల మార్గాన వెళ్తే దోవలో శివాలయం కనబడుతుంది. ఇక్కడ శివుడు లక్ష్మీ నరసింహస్వామి కన్నా ముందు స్వయంభూగా వెలిశాడు. ఇంకో విశేషం.. ఈ మెట్లు ఎక్కి స్వామిని సేవించినవారి కీళ్ళ నొప్పులు తగ్గుతాయని భక్తుల విశ్వాసం యాదగిరి లక్ష్మి నరసింహ స్వామి వారి ఆలయ ముఖద్వారం యాదగిరి గుట్ట లక్ష్మీనరసింహ స్వామి క్షేత్రం నల్గొండ జిల్లాలో ప్రముఖ మైన దివ్య క్షేత్రం: యాదగిరి గుట్టకు సంబందించిన కథకు మూలం వాల్మీకి రామాయణంలో వున్నది. విభాండక ఋషి కుమారుడు రుష్యశృంగుడు. అతని కుమారుడు హాద ఋషి, అతనినే హాదర్షి అని కూడ అంటారు. అతను నరసింహ స్వామి భక్తుడు. అతనికి స్వామివారిని ప్రత్యక్షంగా చూడాలని కోరిక పుట్టింది. ఆంజనేయస్వామి సలహా మేరకు తపస్సు చేయగా స్వామి ప్రత్యక్షమవుతాడు. ఆ ఉగ్ర నరసింహ మూర్తిని చూడలేక శాంత స్వరూపంతో కనిపించమని యాదర్షి కోరగా స్వామి వారు కరుణించి లక్ష్మి సమేతుడై దర్శన మిచ్చి "ఏంకావాలో కోరుకో" మంటే యాదర్షి స్వామి వారికి "శాంత మూర్తి రూపంలోనె కొలువై కొండపై ఉండి పొమ్మని కోరాడు. ఆవిధంగా లక్ష్మి నరసింహ స్వామి కొండపై అలా కొలువై ఉండి పోయాడు.కొన్నాళ్ళకు స్వామివారిని వేర్వేరు రూపాల్లో చూడాలనిపించి యాదర్షి మరలా తపస్సు చేశాడు. అతని కోరిక మేరకు స్వామి వారు జ్వాలా, యోగా, నంద, గండబేరుండ, నారసింహ రూపాల్లో దర్శనమిచ్చాడు.

అందుకే ఈ క్షేత్రాన్ని పంచ నారసింహ క్షేత్రం అంటారు. ఆ ఋషి కోరిక మీదే ఆ కొండ యాదగిరిగా ఋషి పేరుమీద ప్రసిద్ధికెక్కింది.వైకుంఠ ఏకాదశి ఉత్సవం డిసెంబర్ 30న వైభవంగా నిర్వహించనున్నారు. మంగళవారం ఉదయం 5.30 నుంచి 6.30 గంటల వరకు ప్రధానాలయంలో శ్రీస్వామివారు ఉత్తర ద్వారం గుండా భక్తులకు దర్శనమిస్తారు. పాతగుట్ట లక్ష్మీనారసింహస్వామి ఉత్తర రాజగోపురం గుండా 6.45 నుంచి 7.30 గంటలకు వైకుంఠనాథుడిగా దర్శనం ఇవ్వనున్నారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా స్వామివారి బ్రేక్ దర్శనం ఉదయం ఉదయం 10.30 నుంచి 11.30 గంటలకు ఉంటుందని దేవస్థానం ఈఓ వెంకట్ రావు వెల్లడించారు. 30న ప్రారంభమయ్యే స్వామివారి అధ్యయనోత్సవాలు జనవరి 8వ తేదీవరకు కొనసాగనున్నాయి. అధ్యయనోత్సవాల్లో భక్తులచే నిర్వహించే సుదర్శన నారసింహహోమం, నిత్య, శాశ్వత కల్యాణం, బ్రహ్మోత్సవాలను రద్దు చేసినట్టు ఈవో వెల్లడించారు.

## నెహ్రూ లేఖలు దేశ ఆస్తి, వాటిని తిరిగి ఇచ్చేయండి



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ)కు సంబంధించిన కీలక పత్రాలు, ఉత్తర ప్రత్యుత్తరాల వ్యవహారంలో కీలక పరిణామం చోటు చేసుకుంది.వాటిని వెంటనే 'ప్రైమ్ మినిస్టర్స్ మ్యూజియం అండ్ లైబ్రరీ'కి తిరిగి అప్పగించాలని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ ఆదివారం (డిసెంబర్ 28, 2025) మాజీ కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీని కోరారు. ఆ పత్రాలు ఏ ఒక్క వ్యక్తికో, కుటుంబానికో చెందిన ప్రైవేట్ ఆస్తి కాదని, అవి దేశ వారసత్వ సంపద అని ఆయన స్పష్టం చేశారు. గతంలో ఇందిరా గాంధీ భద్రత కోసం వీటిని మ్యూజియానికి అప్పగించారని, అయితే 2008లో యూపీఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు సోనియా గాంధీ ఆదేశాల మేరకు 51 పెట్టెల్లో (దాదాపు 26,000 పత్రాలు) వీటిని ఆమె నివాసానికి తరలించారని షెకావత్ వెల్లడించారు. ఈ పత్రాలలో నెహ్రూ రాసిన వ్యక్తిగత లేఖలు, ఆయనకు వచ్చిన సమాధానాలు, ముఖ్యమైన నోట్స్ ఉన్నాయని, ఇవి పరిశోధకులకు, చరిత్రకారులకు ఎంతో అవసరమని మంత్రి పేర్కొన్నారు. ఈ పత్రాల కోసం మ్యూజియం ఇప్పటికే 2025 జనవరి, జూలైలో రెండుసార్లు సోనియా గాంధీకి లేఖలు రాసిందని, ఆమె కూడా సహకరిస్తానని సమాధానం ఇచ్చారని, కానీ ఇంతవరకు అవి తిరిగి రాలేదని ఆయన గుర్తుచేశారు. దేశ చరిత్రను నిష్పాక్షికంగా తెలుసుకునే హక్కు పౌరులకు ఉందని, కాబట్టి వాటిని పబ్లిక్ ఆర్కైవ్స్‌లో ఉంచాలని ఈ సందర్భంగా కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ డిమాండ్ చేశారు.

## సాంకేతికతకు మానవుడే యజమాని కావాలి: మోహన్ భగవత్ ఆకాంక్ష

**హైదరాబాద్ పెన్ పవర్:** : హైదరాబాద్ శివార్లలోని కన్హా శాంతి వనంలో జరిగిన ఈ 7వ అంతర్జాతీయ శిబిరానికి 79 దేశాల నుండి ప్రతినిధులతో పాటు ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్‌హాజరయ్యారు. ప్రపంచానికి మార్గదర్శకత్వం వహించే 'విశ్వగురువుగా భారతదేశం మళ్ళీ ఎదగడం అనేది మన వ్యక్తిగత ఆశయం మాత్రమే కాదని, అది ప్రస్తుత ప్రపంచ అవసరమని మోహన్ భగవత్ పేర్కొన్నారు. ఈ లక్ష్యాన్ని సాధించడానికి సంఘ్ వంటి అనేక సంస్థలు నిరంతరం కృషి చేస్తున్నాయని, వ్యక్తిత్వ వికాసం ద్వారా సమాజంలో మార్పు తీసుకువచ్చే వ్యక్తులను సంఘ్ సిద్ధం చేస్తోందని ఆయన వివరించారు. సమాజంలో మంచి మార్పును తీసుకురావడానికి, క్రమశిక్షణతో కూడిన హార్డ్ వర్క్ అవసరమని, దీనిని మన చర్యల ద్వారా నిరూపించాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. సాంకేతిక రంగంలో వస్తున్న విప్లవాత్మక మార్పుల గురించి స్పందిస్తూ.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సోషల్ మీడియా వంటి ఆధునిక సాధనాలు మానవాళిపై యజమానిగా మారకూడదని ఈ సందర్భంగా భగవత్ స్పష్టం చేశారు. సాంకేతికత వల్ల ప్రతికూల ఫలితాలు రాకుండా చూడాల్సిన బాధ్యత మనపై ఉందని, మానవ మేధస్సు ఎప్పుడూ సాంకేతికతను లోక కల్యాణం వైపు, అంటే 'దైవిక ప్రవృత్తి' వైపు నడిపించాలని ఆయన ఆకాంక్షించారు. శాస్త్ర విజ్ఞానాన్ని ధర్మంతో (సృష్టిని నడిపించే సూత్రం) అనుసంధానించినప్పుడే సమతుల్య అభివృద్ధి సాధ్యమవుతుందని, దీనిని మనం జీవించి చూపాలని ఆయన ఉద్ఘాటించారు.

## రిషికేశ్‌లో ఉద్రిక్తత.. రైల్వే ట్రాక్‌ల దిగ్బంధం, రాళ్లదాడి

**హైదరాబాద్ పెన్ పవర్:** ఉత్తరాఖండ్‌లోని రిషికేశ్‌లో అటవీ శాఖ చర్యలకు వ్యతిరేకంగా స్థానిక ప్రజలు భారీ ఎత్తున నిరసనకు దిగారు. సుమారు 2866 ఎకరాల ప్రభుత్వ అటవీ భూమిని ప్రైవేట్ వ్యక్తులకు లీజుకు ఇచ్చిన వ్యవహారంలో సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు అటవీ శాఖ విచారణ కమిటీని ఏర్పాటు చేసి సర్వే నిర్వహిస్తోంది. ఈ సర్వేను వ్యతిరేకిస్తూ ఆందోళనకారులు రైల్వే ట్రాక్‌లను దిగ్బంధించడమే కాకుండా, అక్కడికి చేరుకున్న పోలీసులు, అటవీ శాఖ అధికారులపై రాళ్లతో దాడి చేశారు. పరిస్థితి విషమించడంతో ఆందోళనకారులను చెదరగొట్టడానికి భారీగా భద్రతా బలగాలను మోహరించారు. ఈ ఘటనపై బాపుగ్రామ్ కౌన్సిలర్ రవీంద్ర రాణా స్పందిస్తూ.. ప్రభుత్వం సుప్రీంకోర్టు ఆదేశాల మేరకే తన విధిని నిర్వహిస్తోందని తెలిపారు. ఈ కేసులో చీఫ్ సెక్రటరీని కూడా సుప్రీంకోర్టు ఒక పార్టీగా చేర్చిందని, అందుకే అధికారులు సర్వే చేపడుతున్నారని పేర్కొన్నారు. స్థానికులు శాంతియుత మార్గంలో నిరసన తెలుపుతున్నారని, అయితే అకస్మాత్తుగా జరిగిన ఈ పరిణామాలపై ముఖ్యమంత్రి కూడా ఆందోళన చెందుతున్నారని ఆయన మీడియాకు వెల్లడించారు. కాగా స్థానికుల మెరుపు దాడితో ఒక్కసారిగా అక్కడ ఉద్రిక్త వాతావరణ నెలకొంది.

## జమ్మూలో 30 మంది ఉగ్రవాదులు.. సెర్చ్ ఆపరేషన్

**హైదరాబాద్ పెన్ పవర్:** జమ్మూ ప్రాంతంలో 30 నుంచి 35 మంది పాకిస్థానీ ఉగ్రవాదులు సంచరిస్తున్నారని నిఘా సంస్థలు హెచ్చరికలు జారీ చేసాయి. ఈ నేపథ్యంలో భారత సైనికులు సెర్చ్ ఆపరేషన్లను చేపట్టారు.ముఖ్యంగా కిష్ట్‌వార్, దోడా జిల్లాల్లోని ఎత్తైన పర్వత ప్రాంతాలు, తీవ్రమైన మంచుతో కప్పబడిన అడవుల్లో ఉగ్రవాదుల కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. శీతాకాలాన్ని ఆసరాగా చేసుకుని ఉగ్రవాదులు దాక్కునే ప్రయత్నం చేస్తున్నప్పటికీ, సైన్యం తాత్కాలిక బేస్‌లు, నిఘా పోస్టులు ఏర్పాటు చేసి వారిపై నిరంతర నిఘా పెంచుతోంది. డ్రోన్లు, థర్మల్ ఇమేజర్లు, గ్రౌండ్ సెన్సార్ల సహాయంతో ఉగ్రవాదుల కదలికలను ట్రాక్ చేస్తున్నారు. ఆర్మీతో పాటు జమ్మూ కశ్మీర్ పోలీసులు, సీఆర్‌పీఎఫ్, ఫారెస్ట్ గార్డులు, విలేజ్ డిఫెన్స్ గార్డులు సమన్వయంతో ఈ ఆపరేషన్లు నిర్వహిస్తున్నారు.

## టెక్ దిగ్గజాలైన యాపిల్, గూగుల్‌ను దాటేసిన వెండి



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రపంచంలోని అత్యంత విలువైన ఆస్తుల జాబితాలో వెండి సంచలనం సృష్టిస్తోంది. టెక్ దిగ్గజాలైన యాపిల్, ఆల్ఫాబెట్‌లను అధిగమించి మూడో స్థానానికి చేరింది. త్వరలోనే ఎన్విడియా కార్పొరేషన్‌ను కూడా దాటి, బంగారం తర్వాత రెండో స్థానాన్ని దక్కించుకునే దిశగా పరుగులు తీస్తోంది.తాజా గణాంకాల ప్రకారం, వెండి మార్కెట్ క్యాపిటలైజేషన్ 4.220 ట్రిలియన్ డాలర్లకు పెరిగింది. ప్రస్తుతం 4.592 ట్రిలియన్ డాలర్ల మార్కెట్ విలువతో రెండో స్థానంలో ఉన్న ఎన్విడియాకు, వెండికి మధ్య కేవలం 8.1 శాతం వ్యత్యాసం మాత్రమే ఉంది. ఇక 31.598 ట్రిలియన్ డాలర్లతో బంగారం తిరుగులేని అగ్రస్థానంలో కొనసాగుతోంది.వెండి ధరల్లో చారిత్రాత్మక ర్యాలీ కారణంగా దాని విలువ అమాంతం పెరిగింది. శుక్రవారం కామెక్స్ మార్కెట్‌లో స్పాట్ సిల్వర్ ధర ఔన్స్‌కు 75 డాలర్ల మార్కును దాటి కొత్త రికార్డు సృష్టించింది. భారత్‌లోనూ మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్లో కిలో వెండి ఫ్యూచర్స్ ధర ఇంట్రాడే ట్రేడింగ్‌లో రూ. 2,33,115 ఆల్-టైమ్ గరిష్ఠానికి చేరింది.ఇదే జోరు కొనసాగితే వెండి త్వరలోనే ఎన్విడియాను అధిగమిస్తుందని ఇండియా బులియన్ అండ్ జ్యువెలర్స్ అసోసియేషన్ జాతీయ కార్యదర్శి సురేంద్ర మెహతా విశ్వాసం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ మార్కెట్లలో ధరల మధ్య అసాధారణ వ్యత్యాసం ఉందని, సాధారణంగా డాలర్ కంటే తక్కువ ఉండే కామెక్స్, షాంఘై ఎక్స్ఛేంజ్‌ల మధ్య ధరల తేడా ఇప్పుడు దాదాపు 7 డాలర్లకు చేరిందని ఆయన వివరించారు.భారత మార్కెట్లలో వెండి దూకుడు స్పష్టంగా కనిపిస్తోంది. గతేడాది డిసెంబర్ 26న రూ. 91,600గా ఉన్న కిలో వెండి ధర, ఈ ఏడాది డిసెంబర్ 26 నాటికి 153 శాతానికి పైగా పెరిగి రూ. 2,31,879కి చేరింది. ఇదే కాలంలో 10 గ్రాముల బంగారం ధర సుమారు 80 శాతం పెరిగి రూ. 77,460 నుంచి రూ. 1,39,233కు చేరుకుంది.

## మ్యూచువల్ ఫండ్స్ లాభాలపై పన్ను..




**హైదరాబాద్ పెన్ పవర్:** స్టాక్ మార్కెట్లో నేరుగా పెట్టుబడి పెట్టలేని వారికి మ్యూచువల్ ఫండ్స్ మంచి అవకాశంగా చెబుతారు. హైరిటర్న్స్ కోరుకునే వారు ఇప్పుడు మ్యూచువల్ ఫండ్స్ ఎంచుకుంటున్నారు. కోట్లాది రూపాయలు పెట్టుబడి పెడుతున్నారు. నవంబర్ 2025 నాటికి మ్యూచువల్ ఫండ్స్‌లో మొత్తం రూ.81 లక్షల కోట్ల మేర పెట్టుబడులు ఉన్నట్లు పలు నివేదికలు చెబుతున్నారు. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు స్టాక్ మార్కెట్ సూచీలు సెన్సెక్స్, నిఫ్టీలు సగటున 8 శాతం 10 శాతం లాభాలు అందిస్తే మ్యూచువల్ ఫండ్స్ స్కీమ్స్ 12 శాతం నుంచి 15 శాతం మేర లాభాలు ఇచ్చాయి. దీంతో చాలా మంది మ్యూచువల్ ఫండ్స్‌లో భారీగా పెట్టుబడులు పెడుతున్నారు. నష్టభయం ఉన్నప్పటికీ ఈక్విటీ, బ్యాలెన్స్‌డ్, మల్టీ అసెట్స్ ఫండ్స్ వంటివి ఎంచుకుని లాభాలు అందుకుంటున్నారు. అయితే, ఈ లాభాలపై ట్యాక్స్ కట్ అవుతుందని చాలా మందికి తెలియకపోవచ్చు. మ్యూచువల్ ఫండ్స్ పథకాల్లోని పెట్టుబడులపై వచ్చే లాభాలను మూలధన లాభాలుగా పరిగణిస్తారు. దీంతో వాటిపై ఆదాయపు పన్ను విధిస్తారు. మ్యూచువల్ ఫండ్ పథకాల యూనిట్లను విక్రయించినప్పుడు (రిడంప్షన్), ఒక ఫండ్ నుంచి మరో ఫండ్ లోకి మారినప్పుడు వచ్చే లాభాలపై ఈ ట్యాక్స్ ఉంటుంది. అయితే, ఈ పథకాల్లో పెట్టుబడి పెట్టేటప్పుడు, స్కీమ్ లో కొనసాగినంత కాలం పన్ను ఉండదు. ఫండ్ కేటగిరీ, ఎంత కాలం తర్వాత పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు, అనే అంశాల ఆధారంగా వాటిపై వచ్చే రాబడులకు ట్యాక్స్ విధిస్తారు. కనీసం 65 శాతం నిధులను మ్యూచువల్ ఫండ్స్ సంస్థలు ఈక్విటీ ఫండ్స్ లో ఇన్వెస్ట్ చేయాల్సి ఉంటుంది. వాటి నుంచి ఏడాది తర్వాత వెనక్కి తీసుకుంటే వచ్చే లాభాలను దీర్ఘకాలిక మూలధన లాభాలుగా పరిగణిస్తారు. దీనిపై 12.5 శాతం ట్యాక్స్ పడుతుంది. అయితే, దీర్ఘకాలిక మూలధన లాభాల్లో ఏటా రూ.1.25 లక్షల వరకు పూర్తి మినహాయింపు పొందవచ్చు.

## ఏడాదికి ఒకసారే రీఛార్జ్.. బీఎస్ఎన్ఎల్ న్యూఇయర్ ప్లాన్




**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రస్తుత రోజుల్లో మొబైల్ అనేది తప్పనిసరిగా మారిపోయింది. ప్రతి ఒక్కరి జీవితంలో ఒక భాగమైపోయింది. ఒక్క క్షణం ఫోన్ లేకుంటే ఏదో కోల్పోయినట్లు అనిపిస్తుంది, ఏమీ తోచదు. అలాంటి ఫోన్ వాలిడ్ రీఛార్జ్ లేకుండా మూగబోతే మనసున పట్టదు. అప్పు చేసైనా సరే ఫోన్ రీఛార్జ్ చేస్తారు. ప్రీపెయిడ్ కస్టమర్లు గడువు ముగిసే లోపే రీఛార్జ్ చేసుకోవాలి. లేదంటే ఫోన్ కాల్స్, ఇంటర్నెట్ సేవలు నిలిచిపోతాయి. దీంతో రీఛార్జ్ గడువు దగ్గరపడుతున్న సమయంలో ఏదో ఆందోళనగా ఉంటుంది. చాలా మంది నెల రోజులు, మూడు నెలల ప్లాన్స్ ఎంచుకుంటారు. దీంతో ప్రతిసారీ గడువు ముగిసే సమయంలోపు రీఛార్జ్ చేయాల్సి వస్తుంది. ఇది ఒకింత చికాకు తెప్పిస్తుందని చెప్పవచ్చు. అంతే కాదు అదనంగా చెల్లించుకోవాల్సి వస్తుంది. తెలియకుండానే అదనపు ఎక్కువ మొత్తం చెల్లించాల్సి వస్తుంది. ఈ ఇబ్బందులను, అదనపు భారాన్ని తప్పించుకోవాలంటే లాంగ్ టర్మ్ వ్యాలిడిటీ ప్లాన్స్ బెస్ట్ ఆప్షన్ అని చెప్పవచ్చు. ఏడాది వ్యాలిడిటీ గల రీఛార్జ్ ప్లాన్స్ ఎంచుకోవచ్చు. ఏడాదికి ఒకసారి రీఛార్జ్ చేస్తే చాలు ఎలాంటి ఇబ్బందులు, అంతరాయం లేకుండా సంవత్సరం మొత్తం కాల్స్, డేటా వాడుకోవచ్చు. ప్రభుత్వ రంగ టెలికాం కంపెనీ భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ న్యూ ఇయర్ ప్లాన్ తీసుకొచ్చింది. ఈ కొత్త ఏడాదిలో ఎలాంటి రాజీ పడాల్సిన పని లేదంటూ సరికొత్త రీఛార్జ్ ప్లాన్ అందుబాటులోకి తెచ్చింది. ఈ ప్లాన్ 365 రోజులు వ్యాలిడీ కలిగి ఉంటుంది. ఒక్కసారి రీఛార్జ్ చేస్తే ఒత్తిడి లేకుండా ఏడాది మొత్తం మొబైల్ ఫోన్ వినియోగించుకోవచ్చు. కేవలం రూ.2799తోనే ఈ ప్లాన్ అందిస్తోంది. ఈ ప్లాన్ ద్వారా రోజుకు ఏకంగా 3జీబీ డేటా అందిస్తోంది. అలాగే అపరిమిత కాల్స్ లభిస్తాయి. ఇందులో రోజుకు 100 ఎస్ఎంఎస్‌లు కూడా వస్తాయి. ఈ మేరకు న్యూ ఇయర్ ప్లాన్ వివరాలను సోషల్ మీడియా ఎక్స్ వేదికగా బీఎస్ఎన్ఎల్ ఓ పోస్ట్ చేసింది. 'ఈ కొత్త ఏడాదిలో రాజీ పడాల్సినవసరం లేదు. బీఎస్ఎన్ఎల్ రూ.2799 ప్లాన్ ద్వారా రోజుకు 3జీబీ డేటా, అపరిమిత కాల్స్, రోజుకు 100 ఎస్ఎంఎస్‌లు 365 రోజుల వ్యాలిడిటీతో పొందవచ్చు. ఇవన్నీ భారతీయులు నమ్మే స్వదేశీ నెట్‌వర్క్ ద్వారా లభిస్తున్నాయి. నిజమైన డేటా కింగ్ ద్వారా ఈ 2026ను ప్రారంభించండి' అంటూ రాసుకొచ్చింది. ప్రైవేట్ టెలికాం కంపెనీలైన జియో, ఎయిర్‌టెల్, వీఐ కంపెనీలు అందిస్తోన్న ఏడాది రీఛార్జ్ ప్లాన్స్‌తో పోలిస్తే ఈ ప్లాన్ ధర చాలా తక్కువే అని చెప్పవచ్చు.

# ఐటీ శాఖకు సోషల్ మీడియా అకౌంట్ల యాక్సెస్?




**హైదరాబాద్ పెన్ పవర్:** మన దేశ ఆదాయపు పన్ను వ్యవస్థ ఆధారంగా నిర్దిష్ట ఆదాయ పరిమితి దాటితే టాక్స్ శ్లాబులను బట్టి పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఈ పన్ను నిబంధనలకు సంబంధించి ఐటీ శాఖ ఎప్పటికప్పుడు సవరిస్తుంది.ఇటీవల కూడా మరింత సరళంగా మార్చింది. దీనివల్ల పన్ను చెల్లింపుదారులకు సులభం కానుంది. అయితే, కొందరు పన్ను చెల్లింపుదారులు పన్ను ఎగవేసేందుకు అడ్డదారులు తొక్కుతున్న ఘటనలు కూడా ఉన్నాయి. తమ ఆదాయ వనరుల్ని ఐటీ శాఖకు తెలియకుండా ఉండేందుకు తప్పుడు క్లెయిమ్స్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే తాజాగా కొత్త ఆదాయపు పన్ను చట్టం అమల్లోకి వస్తుందని, పన్ను ఎగవేతను అరికట్టడానికి ఆదాయపు పన్ను శాఖ ప్రజల సోషల్ మీడియా అకౌంట్ల యాక్సెస్ అడుగుతుందనే ప్రచారం జోరుగా సాగింది. 2026, ఏప్రిల్ 1 నుంచి కొత్త ఆదాయ పన్ను చట్టం అమల్లోకి వస్తుంది. దీని ద్వారా పన్ను ఎగవేతల్ని కట్టడి చేయడానికి, ఆదాయపు పన్ను శాఖకు సోషల్ మీడియా అకౌంట్లు (వాట్సాప్, ఫేస్‌బుక్ లాంటివి), పర్సనల్ ఈ-మెయిల్స్‌ను సమీక్షించే పూర్తి అధికారం ఉంటుంది.. అంటూ ఓ ఎక్స్ పోస్ట్ వైరల్ అయింది. దీనిపై చాలామంది ఆందోళనకు గురయ్యారు. ఇందులో ఎంతవరకు నిజం ఉంది, దీనిపై ఐటీ శాఖ ఏమని స్పందించిందనే విషయం తెలుసుకుందాం. ఆదాయపు పన్ను శాఖకు నిజంగా అలాంటి అధికారాలు ఉంటాయా అని తెలుసుకోవాలనే ఆసక్తి చాలామంది పన్ను చెల్లింపుదారులలో రేకెత్తించింది. పీఐబీ ఫ్యాక్ట్ చెక్ బృందం సదరు పోస్ట్ చేసిన ట్వీట్ తప్పుదోవ పట్టించేదని, ఆదాయపు పన్ను శాఖకు అలాంటి అధికారం ఏదీ లేదని పేర్కొంది. ఆదాయపు పన్ను చట్టం, 2025లోని సెక్షన్ 247లోని నిబంధనల ప్రకారం, కేవలం సోదాలు, దాడుల సమయంలో సోషల్ మీడియా అకౌంట్లను, ఈ-మెయిల్స్ మాత్రమే తనిఖీ చేసే అధికారం ఉంటుంది. పైగా, తీవ్రమైన పన్ను ఎగవేత ఆరోపణల గురించి ఖచ్చితమైన ఆధారాలు ఉన్నప్పుడే ఈ తరహా తనిఖీలు చేపట్టాల్సి ఉంటుంది.

# భారత్‌లో భారీ పెట్టుబడులకు సిద్ధమవుతున్న రోల్స్ రాయిస్



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రముఖ బ్రిటిష్ ఏరో-ఇంజిన్ తయారీ సంస్థ రోల్స్ రాయిస్ భారత్‌లో పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టాలని భావిస్తోంది. ముఖ్యంగా జెట్ ఇంజన్లు, నావల్ ప్రొపల్షన్, ల్యాండ్ సిస్టమ్స్, అడ్వాన్స్‌డ్ ఇంజనీరింగ్‌తో సహా వివిధ విభాగాల్లో అవకాశాలను అందుకోవాలని, పూర్తి సామర్థ్యాన్ని పెట్టుడుల విస్తరణ ప్రణాళికకు అనుగుణంగా యూకే వెలుపల భారత్‌ను అతిపెద్ద కేంద్రంగా ఎంచుకోవాలని చూస్తున్నట్లు రోల్స్ రాయిస్ ఇండియా ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ శశి ముకుందన్ ఆదివారం ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. కంపెనీ దేశంలో భారీ పెట్టుబడి కోసం ప్రణాళికలు సిద్ధం చేస్తోందని, అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఏఎంసీఏ) ప్రోగ్రామ్ కింద భారత ప్రభుత్వానికి కంబాట్ జెట్‌లను అందించడానికి కొత్త జనరేషన్ ఏరో ఇంజిన్‌ను అభివృద్ధి చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు ఆయన తెలిపారు. ఈ కొత్త తరహ యుద్ధ విమానాల కోసం ఇంజిన్లపై పని చేయడానికి రోల్స్ రాయిస్ భారతీయ రక్షణ డిజైనర్లతో మాట్లాడుతోంది. భారత్ సొంతంగా అభివృద్ధి చేయడానికి వీలుగా సాంకేతికత, డిజైన్లను కూడా పంచుకోవాలని భావిస్తున్నట్లు శశి ముకుందన్ వివరించారు. యుద్ధనౌకలు, జలాంతర్గాములలో ఉపయోగించే ఇంజిన్లు అయిన నావల్ ప్రొపల్షన్ సిస్టమ్‌లపై కూడా రోల్స్ రాయిస్ పని చేయాలనుకుంటోంది. ఈ వ్యవస్థలు నౌకలు వేగంగా, మరింత సమర్థవంతంగా కదలడానికి సహాయపడతాయి. ఈ రకమైన సాంకేతికతను కలిగి ఉన్న ప్రపంచంలోని కొన్ని కంపెనీలలో రోల్స్ రాయిస్ ఒకటి. కొత్త పెట్టుబడుల ద్వారా భారత్ మరిన్ని వస్తువులను తయారు చేయడంలో సహాయపడుతుంది, ఉపాధి కల్పిస్తుంది, రక్షణ పరిశ్రమను బలోపేతం చేస్తుంది. అన్నీ సానుకూలంగా జరిగితే, రోల్స్ రాయిస్ భారత్‌ను యూకే, యూఎస్, జర్మనీ లాగా ప్రధాన మార్కెట్లలో ఒకటిగా మార్చుకోవాలని ఆశిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

# స్టాక్ మార్కెట్ల నుంచి రూ. 1.6 లక్షల కోట్ల నిధులు తీసుకెళ్లిన ఎఫ్‌పీఐలు



**హైదరాబాద్ పెన్ పవర్:** విదేశీ ఇన్వెస్టర్లు ఈ ఏడాది భారత ఈక్విటీ మార్కెట్ల నుంచి రికార్డు స్థాయిలో నిధులు ఉపసంహరించుకున్నారు. భారత కరెన్సీ రూపాయితో పాటు ఇతర కరెన్సీలూ అస్థిరంగా ఉండటం, ప్రపంచ వాణిజ్య ఉద్రిక్తతలు, ముఖ్యంగా అమెరికా విధించిన అధిక సుంకాలు, అధిక వాల్యూయేషన్ల కారణంగా మదుపర్లు రిస్క్‌ను తగ్గించుకోవడంతో రికార్డు స్థాయిలో రూ. 1.6 లక్షల కోట్లను వెనక్కి తీసుకున్నారు. ఇదే సమయంలో అమెరికా మార్కెట్ల నుంచి ఎక్కువ రాబడి ఉండటంతో నిధులను తరలించారు. కొందరు విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐ) స్టాక్ మార్కెట్ల నుంచి ఉపసంహరించుకున్న నిధులను బాండ్లు వంటి సురక్షితమైన సాధనాల్లో పెట్టుబడిగా పెట్టారని, అలాగే ఇప్పటివరకు రూ. 59,000 కోట్లను డెట్ మార్కెట్లో ఇన్వెస్ట్ చేశారని మార్కెట్ విశ్లేషకులు తెలిపారు. ఈ ధోరణి కారణంగా 2025 ఏడాది ఇప్పటివరకు అత్యధికంగా ఎఫ్‌పీఐలు ఎక్కువ నిధులు ఉపసంహరించుకున్న ఏడాదిగా నిలిచింది. ఇదివరకు 2022లో రికార్డు స్థాయి రూ. 1.21 లక్షల కోట్ల విలువైన నిధులను వెనక్కి తీసుకున్నారు. విదేశీ ఇన్వెస్టర్లు నిధులను వెనక్కి తీసుకెళ్లినప్పటికీ దేశీయ మదుపర్ల కొనుగోళ్ల కారణంగా మన స్టాక్ మార్కెట్లపై ఒత్తిడి తగ్గిందని విశ్లేషకులు వెల్లడించారు.

# పరమ పవిత్రం.. వైకుంఠ ఏకాదశి


**హైదరాబాద్ పెన్ పవర్:** ధనుర్మాసము సౌరమానము యొక్క ప్రామాణికాను సారము కాగా, శుక్ల ఏకాదశి చాంద్రమానమైన తిథి. ప్రతి మాసమునందలి ఏకాదశులు ఎంతో పవిత్రమైనవి. "గృహస్థో బ్రహ్మచారీ చ ఆహితాగ్నిస్థ థైవచబీ ఏకాదశ్యాంశ భుంజిత పక్షయోరు భయోరపి" అని అగ్ని పురాణాదులు వివరిస్తున్నాయి. గృహస్తులకు, బ్రహ్మచారులకు, నిత్యాగ్ని హోత్రులకు నైమిత్తిక కర్మగా ఉపవాసాద్యాచరణము విధించ బడినది. ఇట్టి ఏకాదశి విష్ణుమూర్తికి అత్యంత ప్రీతికరమైన దివసము కావునే ఏకాదశి హరి వాసరముగా కొనియాడ బడుచు న్నది. అందు సౌరమానము నందలి ప్రశస్తమైన ధనుర్మాసంలో వచ్చే శుక్ల పక్ష ఏకాదశి (మార్గశీర్షము లేక పుష్య మాసం) "వైకుంఠ ఏకాదశి"గా పిలువ బడుచు న్నది. సూర్య చంద్రులు నేత్రములుగా కలిగిన వైకుంఠ వాసునకి సౌర, చాంద్ర మానాలలో ప్రశస్తమైన ధనుర్మా శుక్ల పక్ష ఏకాదశి అత్యంత ప్రీతికరమైనది. ధనూరాశి స్థితే సూర్యే శుక్ల ఏకాదశి తిథౌబీ త్రింషత్ కోటి సురైః సాకం బ్రహ్మ వైకుంఠ మాగత: పాలస్త్యేనని పీడితా: సురగణాః వైకుంఠలోకం యయు:బీ ద్వారే తత్ర విషాదభావ మనసా సూక్తైర్ హరిం తుష్టువు: శుక్తై: శ్రీహరి వాసరే ప్రభాత సమయే భానౌ ధనుః సంస్థితే, తేభ్యోదాత్ సుఖ దర్శనం కరుణయా నారాయణో మాధవ:" రావణుని బాధలను తాళలేని దేవతలు బ్రహ్మను ఆశ్రయింపగా...ఆ దేవుడు ధనుర్మాస శుక్ల ఏకాదశి దినమున దేవతలందరితో వైకుంఠము నుచేరి, హరి వాసరమునందు దేవతలు విషాద భావ మనస్కులై శ్రీహరిని వేదోక్తంగా స్తుతించగా, వారికి శ్రీహరి సుఖ దర్శనమును కలుగజేసెనని వివరించ బడినది. శ్రీప్రశ్న సంహిత (ఐదవ అధ్యాయము) నందు గల ఐతిహ్యాము ననుసరించి మధు కైటభులను భగవానుడు సంహరించినపుడు వారు దివ్యరూపధారులై దివ్య జ్ఞానము పొందగా, బ్రహ్మాదులెవరైనను నీలోకము వంటి మందిరమును నిర్మించి, ఏకాదశి దినోత్సవమును గావించి, నిన్ను నమస్కరించి ఉత్తర ద్వార మార్గమున సమీపింతురో, వారికి వైకుంఠ ప్రాప్తి కలుగునట్లు దీనిని మోక్ష ఉత్సవ దినముగా వరమిచ్చినట్లు తెలియు చున్నది. ముక్కోటి దేవతల బాధలను నివారించినందున 'ముక్కోటి ఏకాదశి'గాను, వైకుంఠ దర్శనము కలిగించునది కనుక 'వైకుంఠ ఏకాదశి'గాను, భగవద్దర్శనము చేయు పవిత్ర దినమైనందున భగవదవలోక దివసము'గ కొనియాడ బడుచున్నది.ధనుర్మాస ఏకాదశి కొన్నిసార్లు మార్గశిర మాసమందు, మరికొన్ని మారులు పుష్యమాసమందు రావడం చేత రెండు మాసాల శుక్ల ఏకాదశులు ప్రశస్తములైనవే. మార్గశిరమాస ఏకాదశిని మోక్షైకాదశి అని, పుష్యమాస ఏకాదశిని పుత్రదైకాదశి, రైవత మన్వాది దినమని పిలుస్తారు.వైకుంఠ ఏకాదశి అనే పేరులో వైకుంఠ, ఏకాదశి అని రెండు పదాలున్నాయి. వైకుంఠ శబ్దం ఆకారాంత పుంలింగం. ఇది విష్ణువునూ, విష్ణువుండే స్థానాన్ని కూడా సూచిస్తుంది. చాక్షుస మన్వంతరంలో వికుంఠ అనే ఆమె నుండి అవతరించి నందున విష్ణువు "వైకుంఠః" (వైకుంఠుడు) అయ్యాడు. అదేకాక జీవులకు నియంత, జీవులకు సాక్షి, భూతముల స్వేచ్ఛావిహారాన్ని అణచేవాడు - అని అర్థాలున్నాయి. సూర్యుడు ధనురాశిపై నుండగా వచ్చిన తొలి ఏకాదశి (వైకుంఠ) పుణ్యదినాన తన దివ్యమంగళ రూపంతో వైకుంఠ ద్వారంవద్ద దేవతలకు శ్రీమహా విష్ణువు దివ్యదర్శనం గావించిన సంద ర్భంగా, కోటి తేజోమూర్తిని దర్శించిన బ్రహాదిదేవతలు, సనక సనందాది మునులు, 'పశ్యన్ నిముష మాత్రేన కోటి యజ్ఞంఫలం లభేత్' అని వచించినట్లు బ్రహాండ పురాణంలో వర్ణించ బడింది. ఈ పవిత్ర దినాన వైష్ణవ సంబంధ ఆలయాలలో, ఉత్తర ద్వారం వద్ద సూర్యోదయానికి పూర్వమే స్వామి దర్శనం చేసికోవడం అనాదిగా ఆచరిస్తున్న సత్సాంప్రదాయం.

## రక్షణ తయారీ కోసం అదానీ గ్రూప్ రూ. 1.8 లక్షల కోట్ల పెట్టుబడులు




**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రముఖ బిలియనీర్ గౌతమ్ అదానీ నేతృత్వంలోని అదానీ గ్రూప్ వచ్చే ఏడాది రక్షణ తయారీ కోసం రూ. 1.8 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టాలని భావిస్తున్నట్టు వెల్లడించింది. మానవరహిత, అటానమస్ సిస్టమ్స్‌లో సామర్థ్యాన్ని పెంచేందుకు, అధునాతన గైడెడ్ ఆయుధాలతో పాటు దేశ భవిష్యత్తు యుద్ధ సామర్థ్యానికి సంబంధించి కీలక పాత్ర పోషించాలని లక్ష్యంతో పనిచేస్తున్నట్టు తెలిపింది. ఆధునిక యుద్ధ సాంకేతికతపై ముఖ్యంగా డ్రోన్లు, మానవరహిత యంత్రాలు, స్మార్ట్ ఆయుధాలపై ప్రధాన దృష్టి ఉంటుంది. సంస్థ రక్షణ పరికరాలలో కొన్ని ఇప్పటికే నిజమైన సైనిక అవసరాలకు వాడుతున్నారు. సాయుధ దళాలకు అవసరమైన రక్షణ ఉత్పత్తులను కంపెనీ తక్కువ సమయంలో తయారు చేసి సరఫరా చేయగలుగుతోందని కంపెనీ వెల్లడించింది. వచ్చే ఏడాది చాలా తక్కువ మానవ నియంత్రణతో పనిచేసే యంత్రాలు, సముద్రంలో మానవరహిత వాహనాలు, రోబోట్ వాహనాలపై పనిచేస్తున్నాం. ఇవి సైన్యానికి శత్రువులను గమనించడానికి, సమాచారాన్ని సేకరించడానికి, సైనికులకు ప్రమాదాన్ని తగ్గించడానికి సహాయపడతాయని కంపెనీ పేర్కొంది.

# ఈ ఒక్క డ్రింక్ డైట్‌లో ఉంటే.. ఈజీగా బరువు తగ్గొచ్చు!




ఈ మధ్య కాలంలో చాలా మంది ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య అధిక బరువు. ఈ సమస్యను పరిష్కరించుకునేందుకు డైట్‌లు ఫాలో అవ్వడం, జిమ్‌కు వెళ్లడం చేస్తుంటారు. కానీ వాళ్లు ఎంత ప్రయత్నించినా బరువును పూర్తిగా తగ్గించుకోలేరు. అయితే మన పూర్వికుల కాలం నుంచి ఆచరణలో ఉన్న ఒక చిట్కా మాత్రం ఈ సమస్యను పరిష్కరించడంలో సమర్థవంతంగా పనిచేస్తుంది. అదే దాల్చిన చెక్కా నీరు. దాల్చినచెక్క నీటిలోని యాంటీఆక్సిడెంట్లు, యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి జీవక్రియను పెంచే లక్షణాల కలిగి ఉంటాయి. ఈ నీటిని రోజూ తాగడం ద్వారా జీర్ణక్రియ మెరుగుపడడంతో పాటు రోగనిరోధక శక్తి పెరుగుతుంది. బరువు నియంత్రణలో ఉంటుంది, రక్తంలో చక్కెర స్థాయిలు నియంత్రణలో ఉంటాయి. 2026లో ఫ్యాట్‌లాస్ జర్నీని స్టార్ట్ చేసే వారికి ఈ పానియం ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. అయితే మీకు మరో గుడ్‌న్యూస్ ఏమిటంటే దీనికి మీరు వందలు, వేల రూపాయలు ఖర్చు చేయాల్సి పనిలేదు. చాలా తక్కువ ఖర్చుతో దీనిని తయారు చేసుకోవచ్చు. బరువు తగ్గడం: బరువు తగ్గాలనుకునే వారికి ఈ పానియం ఎంతో ప్రయోజకరంగా ఉంటుంది. ఇది రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రణలో ఉంచుతుంది. అలాగే మీకు అతిగా ఆకలి వేయకుండా ఎక్కువ సేపు కడుపు నిండి అనుభవాన్ని ఇస్తుంది. దీని ద్వారా మీరు తక్కువ తినడానికి దోహదపడుతుంది. మీ రోజు వారి ఆహారంతో పాటు మార్నింగ్ ఈ డ్రింక్‌ను తీసుకుంటే దాని ప్రయోజనాలను పొందచ్చు. రోగనిరోధక శక్తి: దాల్చినచెక్కలో యాంటీఆక్సిడెంట్లు, యాంటీమైక్రోబయల్ సమ్మేళనాలు ఉంటాయి. ఇవి శరీరం ఇన్ఫెక్షన్లు, వైరస్‌లతో పోరాడి శరీరంలోని విషాన్ని బయటకు పంపుతాయి. రోజూ మార్నింగ్ మీరు ఈ నీటిని తాగడం ద్వారా మీ శరీరంలో రోగనిరోధక శక్తి పెరగుతుంది. ఇది మీ శరీరానికి లోపల నుంచి శక్తిని అందిస్తుంది. అలాగే కాలానుగన వ్యాధుల నుంచి మిమ్మల్ని రక్షించడంలో సహాయపడుతుంది. గట్ హెల్త్ : మీ గట్ హెల్త్‌ను కాపాడడంతో కూడా దాల్చినచెక్క నీరు చాలా ప్రభావవంతంగా పనిచేస్తుంది. ఇది జీర్ణ ఎంజైమ్‌లను సున్నితంగా ప్రేరేపించి మనం తిన్న ఆహారాన్ని సమర్ధవంతంగా ప్రాసెస్ చేస్తుంది. అలాగే ఉబ్బరం, ఎసిడిటీ, గ్యాస్ వంటి సమస్యల నుంచి తక్షణ ఉపశమనం కలిగిస్తుంది. జీర్ణవ్యవస్థను మెరుగుపరుస్తుంది. ఈ డ్రింక్ ఆరోగ్యకరమైన గట్ బ్యాక్టీరియాను నిర్వహించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. గుండె ఆరోగ్యం: ఈ డ్రింక్ రోజూ తాగడం ద్వారా శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుంది. రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. తర్వాత రక్తపోటు కూడా తగ్గుంది. ఇది గుండె ఆరోగ్యానికి ఎంతగానో దోహదపడుతుంది. దాల్చిన చెక్కలో ఉండే ఇన్ఫ్లమేటరీ లక్షణాలు రక్తనాలను రక్షించి గుండె సంబంధించి వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తాయి. తద్వారా మీరు ఎలాంటి గుండె జబ్బుల భారీగా పడకుండా ఉంటారు.



## వెల్లుల్లిని ఇలా తింటే గుండె పదిలం..!

ఉదయాన్నే పరగడుపున ఒకటి లేదా రెండు వెల్లుల్లి రెబ్బల్ని తినటం వల్ల బోలెడన్నీ లాభాలు ఉన్నాయి. వెల్లుల్లిని నమిలి తినడం ఇష్టం లేకపోతే నీటితో కలిపి మింగడం వల్ల గుండె ఆరోగ్యం మెరుగుపడుతుందని నిపుణులు చెబుతున్నారు. వెల్లుల్లి ముక్కల్ని తేనెలో కలిపి తీసుకోవచ్చు. ఈ రెండిటీని కలిపి తీసుకోవడం వల్ల గుండె నాళాలు ఆరోగ్యంగా మారుతాయి. వెల్లుల్లిలో అల్లిసిన్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది శరీర రోగనిరోధక శక్తిని పెంచుతుంది. ఇది జలుబు, ఫ్లూ, ఇన్ఫెక్షన్లతో పోరాడటానికి సహాయపడుతుంది. ఖాళీ కడుపుతో వెల్లుల్లి తినడం వల్ల కొలెస్ట్రాల్ స్థాయిలు నియంత్రించబడతాయి. ఇది చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. మంచి కొలెస్ట్రాల్ ను పెంచుతుంది. ఇది రక్తపోటును నియంత్రించడంలో ఆరోగ్యకరమైన గుండెను నిర్వహించడానికి కూడా సహాయపడుతుంది. ఉదయాన్నే పరగడుపున ఒకటి లేదా రెండు వెల్లుల్లి రెబ్బల్ని తినటం వల్ల బోలెడన్నీ లాభాలు ఉన్నాయి. వెల్లుల్లిని నమిలి తినడం ఇష్టం లేకపోతే నీటితో కలిపి మింగడం వల్ల గుండె ఆరోగ్యం మెరుగుపడుతుందని నిపుణులు చెబుతున్నారు. వెల్లుల్లి ముక్కల్ని తేనెలో కలిపి తీసుకోవచ్చు. ఈ రెండిటీని కలిపి తీసుకోవడం వల్ల గుండె నాళాలు ఆరోగ్యంగా మారుతాయి. వెల్లుల్లి టీ తాగడం వల్ల గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది. మరిగించిన నీటిలో వెల్లుల్లి రెబ్బల్ని కలిపి తాగితే రక్తప్రసరణ మెరుగుపడుతుంది. పాలలో వెల్లుల్లి కలిపి మరిగించాలి. ఈ పాలను రాత్రి పడుకునే ముందు తాగితే కొలెస్ట్రాల్ తగ్గుతుంది. గుండె ఆరోగ్యంగా మారుతుంది. ఒక గ్లాసు గోరువెచ్చని నిమ్మరసంలో వెల్లుల్లి రెబ్బలు లేదా వెల్లుల్లి పేస్ట్ కలిపి తాగాలి. దీని వల్ల ధమనులు ఆరోగ్యంగా మారుతాయి. కొంతమందికి పచ్చి వెల్లుల్లి పడదు. అటువంటి వారు వెల్లుల్లిని వేయించి తినొచ్చు. వేయించిన వెల్లుల్లి బీపీని కంట్రోల్ చేస్తుంది. మొలకెత్తిన వెల్లుల్లిలో యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి. ఇవి కండరాల్ని బలంగా ఉంచుతాయి. వెల్లుల్లి పొడి చేసుకొని ఆహార పదార్థాల్లో కలిపి తీసుకోవచ్చు. వెల్లుల్లి పొడిని మజ్జిగలో కలిపి కూడా తీసుకోవచ్చు. వెల్లుల్లి రెబ్బల్ని ఆలివ్ ఆయిల్‌లో నానబెట్టి తీసుకోవాలి. ఆలివ్ ఆయిల్‌తో కలిపి తీసుకుంటే గుండె ఆరోగ్యంగా మారుతుంది. వెల్లుల్లి రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. దీన్ని రోజూ తినడం మధుమేహ రోగులకు చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. వెల్లుల్లి జీవక్రియను వేగవంతం చేస్తుంది. ఇది శరీరం కొవ్వును వేగంగా కాల్చడానికి సహాయపడుతుంది. ఉదయం పచ్చి వెల్లుల్లిని క్రమం తప్పకుండా తినడం వల్ల బరువు తగ్గవచ్చు. వెల్లుల్లి శరీరం నుండి విషాన్ని బయటకు పంపడంలో సహాయపడుతుంది. వెల్లుల్లిలో ఉండే సల్ఫర్ సమ్మేళనాలు కాలేయాన్ని నిర్విషీకరణ చేసి, శరీరాన్ని ఆరోగ్యంగా, శక్తితో నింపుతాయి. ఖాళీ కడుపుతో వెల్లుల్లి తినడం వల్ల జీర్ణవ్యవస్థ మెరుగుపడుతుంది. కడుపులో గ్యాస్, అజీర్ణం మరియు మలబద్ధకం నుండి ఉపశమనం లభిస్తుంది. వెల్లుల్లిలోని యాంటీఆక్సిడెంట్, యాంటీ బాక్టీరియల్ లక్షణాలు చర్మాన్ని స్పష్టంగా, ప్రకాశవంతంగా మార్చడంలో సహాయపడతాయి. ఇది జుట్టు రాలడాన్ని నివారించడంలో మరియు జుట్టును బలోపేతం చేయడంలో కూడా సహాయపడుతుంది.


## పల్లీలు వీరు తినకూడదు!



వేరుశెనగకు అలెర్జీ ఉన్నవారు వాటిని తినకుండా ఉండాలని చెబుతున్నారు. ఎందుకంటే అవి గొంతు నొప్పి, చర్మ సమస్యలు, జీర్ణ సమస్యలు, శ్వాస ఆడకపోవడానికి కారణమవుతాయి. కొంతమందికి పల్లీలు పడవు. వీరికి పల్లీలు తినగానే వాంతులు, పెదాలు ఉబ్బడం, నాలుక మొద్దుబారిపోవడం, గొంతు వాచినట్లుగా అవ్వడం జరుగుతుంది. ఇలాంటి వారు పల్లీలకు దూరంగా ఉండటం మేలు. వేరుశెనగ తినడం వల్ల శరీరానికి శక్తి లభిస్తుంది. అనేక దీర్ఘకాలిక వ్యాధులను నివారించడంలో సహాయపడుతుంది. ఈ ప్రయోజనాలు ఉన్నప్పటికీ, వేరుశెనగకు అనేక ప్రతికూలతలు కూడా ఉన్నాయి. వేరుశెనగకు అలెర్జీ ఉన్నవారు వాటిని తినకుండా ఉండాలని చెబుతున్నారు. ఎందుకంటే అవి గొంతు నొప్పి, చర్మ సమస్యలు, జీర్ణ సమస్యలు, శ్వాస ఆడకపోవడానికి కారణమవుతాయి. కొంతమందికి పల్లీలు పడవు. వీరికి పల్లీలు తినగానే వాంతులు, పెదాలు ఉబ్బడం, నాలుక మొద్దుబారిపోవడం, గొంతు వాచినట్లుగా అవ్వడం జరుగుతుంది. ఇలాంటి వారు పల్లీలకు దూరంగా ఉండటం మేలు. ఆస్తమా వంటి శ్వాస సంబంధ సమస్యలు ఉన్నవారు పల్లీలు తినకపోవడమే మంచిది. ఇది ఈ సమస్యలను మరింత పెంచుతుంది. అందుకే శ్వాస సమస్యలు ఉంటే జీడిపప్పు, బాదం, గుమ్మడి గింజలు వంటివి తినడం మేలు.

పల్లీలు తినగానే కొంతమందికి చర్మంపై ర్యాషెస్ వస్తాయి. ఇలా దద్దుర్లు వస్తే కూడా పల్లీలకు వీలైనంత దూరంగా ఉండటం మేలు. ఫ్యాటీ లివర్ వంటి కాలేయ సంబంధ సమస్యలు ఉన్నవారు కూడా పల్లీలు తినొద్దు. ఎందుకంటే పల్లీలు లివర్‌లో కొవ్వు పెంచి సమస్యను తీవ్రతరం చేస్తాయి. రక్తం పల్చబడటం కోసం కొంతమంది మెడిసిన్ వాడుతుంటారు. ఇలాంటి వారు పల్లీలు తీసుకోకపోవడమే మంచిది. పల్లీలలో ప్రోటీన్ చాలా ఎక్కువగా ఉంటుంది. ఇది కిడ్నీ సమస్యలను మరింత పెంచుతుంది. అందుకే దీర్ఘకాల కిడ్నీ సమస్యలు ఉన్నవారు పల్లీలకు దూరంగా ఉండాలి. పల్లీలు ఎక్కువగా తింటే బరువు పెరగడం, జీర్ణ సమస్యలు, కిడ్నీ సమస్యలు వచ్చే అవకాశం ఉంది. అందుకే పల్లీలను మితంగా తీసుకోవడం మంచిది. ఉడికించిన లేదా వేయించిన పల్లీలు ఆరోగ్యానికి మేలు చేస్తాయి. కానీ ఉప్పు కలిపిన, డీప్ ఫ్రై చేసిన పల్లీలు అస్సలు తినకూడదు. ఆరోగ్యంగా ఉన్నవారు రోజుకు 50గ్రాముల పల్లీలు తినడం మంచిది. బరువు తగ్గాలని చూసేవారు రోజుకు 30గ్రాములకు మించి పల్లీలు తీసుకోకపోవడమే మంచిది.

## డిన్నర్ చేసిన వెంటనే నిద్రపోతున్నారా?



ప్రస్తుతం నడుస్తున్న బిజీ జీవితంలో ఎవరూ సరైన సమయానికి భోజనం చేయడం లేదు. నిద్ర పరిస్థితి కూడా అంతే. అయితే, రాత్రిపూట సరైన సమయానికి భోజనం చేయడం, నిద్ర పోవడం ఆరోగ్యానికి ఎంతో అవసరమని వైద్యులు చెబుతున్నారు. భోజనానికి, నిద్రకు మధ్య అంతరం ఉండాలని సూచిస్తున్నారు. లేదంటే జీర్ణక్రియ దెబ్బతింటుందని, నిద్ర నాణ్యత దెబ్బతింటుందని చెబుతున్నారు. సరైన సమయంలో భోజనం చేయడం, నిద్ర పోవడం అనేది ఈ ఆధునిక యుగంలో ఎవరికీ సాధ్యం కావడం లేదు. నగరాల్లో ఉండేవారికి మాత్రం ఇది అసాధ్యమనే చెప్పాలి. ఉద్యోగాలు చేసేవారు ఆయా షిఫ్టుల్లో ఆఫీసులకు వెళ్లి.. విధులు ముగించుకుని ట్రాఫిక్ దాటుకుని ఇంటికి వచ్చేసరికి చాలా సమయమే పడుతుంది. దీంతో సరైన సమయానికి భోజనం, నిద్ర అనేవి సాధ్యం కావడం లేదు. కొన్ని కొన్నిసార్లు మొబైల్ లేదా టీవీ చూడటం వల్ల కూడా సమాయానికి భోజనం, నిద్రకు దూరమవుతున్నారు. దీంతో జీర్ణ, జీవక్రియలు దెబ్బతిని మొత్తం ఆరోగ్యంపై చెడు ప్రభావాన్ని చూపుతున్నాయి. అందుకే సమాయానికి భోజనం చేసి, కొంత సమయం తర్వాత నిద్రకు ఉపక్రమించి మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. సరైన సమయంలో భోజనం చేయడం వల్ల ఆహారం బాగా జీర్ణమవుతుంది. నిద్ర గాఢంగా, ప్రశాంతంగా మారుతుంది. వైద్యుల ప్రకారం.. మంచి జీర్ణక్రియ, మంచి నిద్ర కోసం, రాత్రి భోజనం నిద్రించే సమయానికి రెండు నుంచి మూడు గంటల ముందు తినాలి. ఇలా చేస్తే ఆహారం బాగా జీర్ణమవుతుంది. యాసిడ్, గ్యాస్ లేదా గుండెల్లో మంట వంటి సమస్యల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఉదాహరణకు మీరు రాత్రి 10 గంటలకు పడుకుంటే.. మీరు మీ విందును రాత్రి 7 నుంచి 8 గంటలకు ముగించాలి. మీరు రాత్రి 11 గంటలకు పడుకున్నట్లయితే.. రాత్రి 8 గంటలకు భోజనం చేయడం మంచిది. దీంతో మీరు పడుకునే సమాయానికి పొట్ట తేలికగా మారుతుంది. నిద్ర గాఢంగా పడుతుంది. తిన్న తర్వాత శరీరం దాన్ని జీర్ణం చేసుకోవడానికి సమయం పడుతుంది. మీరు వెంటనే పడుకుంటే జీర్ణక్రియ సరిగ్గా జరగదు. భోజనం చేసిన వెంటనే పడుకోవడం వల్ల కడుపులో యాసిడిటి పెరుగుతుంది. యాసిడ్ రిఫ్లక్స్, గుండెలో మంట, పుల్లని త్రేనుపు వంటి సమస్యలను కలిగిస్తుంది. నిద్రలో శరీరం తనను తాను మరమ్మతు చేసుకుంటుంది. మెదడు విశ్రాంతి తీసుకుంటుంది. హార్మోన్లు సమతుల్యంగా ఉంటాయి. పొట్ట బరువుగా ఉంటే లేదా జీర్ణక్రియ కొనసాగుతుంటే నిద్ర తరచుగా డిస్టర్బ్ అవుతుంది. రాత్రి ఆలస్యంగా తినడం వల్ల జీవక్రియ నెమ్మదిస్తుంది. కొవ్వు పేరుకుపోయి, బరువు పెరిగే ప్రమాదం ఉంది. రాత్రిపూట ఉడికించిన లేదా తేలికగా ఉండే కూరగాయలు, పప్పు, కిచిడి, రోటీ లేదా బియ్యం, కొద్దిగా వేడి చేసిన పసుపు పాలు, కొన్ని బాదం లేదా వాల్నట్లు, పెరుగు(తక్కువగా) ఆహారంగా తీసుకోవాలి. సులభంగా జీర్ణమయ్యే ఆహారాన్ని తీసుకోవాలి. భారీ భోజనం, వేయించిన, కారం ఎక్కువగా ఉండే ఆహారాలు, తీపి పదార్థాలు, స్నాక్స్, టీ, కాఫీ లాంటి కెఫిన్ పదార్థాలను, తీపి ఎక్కువగా ఉండే పండ్లను రాత్రి పూట తినకూడదు.

## లోన్ తీసుకున్న వ్యక్తి చనిపోతే కుటుంబసభ్యులు చెల్లించాలా?



బ్యాంకుల నుంచి ఇటీవల ప్రతీఒక్కరూ ఏదోక లోన్ తీసుకుంటున్నారు. ఒకవేళ రుణం తీసుకున్న వ్యక్తి మరణిస్తే బ్యాంకులు ఏం చేస్తాయి.. ఎవరి నుంచి లోన్ రికవరీ చేస్తాయి అనే ప్రశ్నలు చాలామందికి ఎదురవుతూ ఉంటాయి. వాటికి సమాధానాలు మనం ఇప్పుడు చూద్దాం. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతీఒక్కరూ తమ ఆర్థిక అవసరాల కోసం రుణాలు అనేవి తీసుకుంటూ ఉంటారు. సొంతిల్లు నిర్మించుకోవడానికి హోమ్ లోన్, వ్యక్తిగత అవసరాల కోసం పర్సనల్ లోన్, కారు లేదా బైక్ కొనుగోలు చేయాలనుకుంటే వెహికల్ లోన్, పెళ్లి కోసం మ్యారేజ్ లోన్, చదువుల కోసం ఎడ్యుకేషన్ లోన్, వ్యాపారం కోసం బిజినెస్ లోన్ వంటివి చాలా ఉన్నాయి. బ్యాంకులు కూడా రుణాలు మంజూరు చేసేందుకు ఎగపడుతున్నాయి. తమ వ్యాపారం కోసం కస్టమర్లకు ఫోన్ చేసి మరీ లోన్లు తీసుకోవాల్సిందిగా కోరుతున్నాయి. అయితే లోన్ తీసుకున్న వ్యక్తి మధ్యలో మరణిస్తే ఆ సొమ్ము ఎవరు చెల్లించాలి అనే ప్రశ్న చాలామందిలో ఉంటుంది. వీటికి సమాధానాలు ఇందులో చూద్దాం. పర్సనల్ లోన్ అన్‌సెక్యూర్డ్ లోన్. లోన్‌తో పాటు బ్యాంకులు లోన్ ఇన్స్యూరెన్స్ కూడా ఆఫర్ చేస్తాయి. ఒకవేళ లోన్ తీసుకున్న వ్యక్తి మరణిస్తే ఆ లోన్ సదరు ఇన్స్యూరెన్స్ కంపెనీ చెల్లించాల్సి ఉంటుంది. దీని వల్ల ఇన్స్యూరెన్స్ ఉన్నా, లేకపోయినా కుటుంబసభ్యులపై భారం అనేది ఉండదు. ఒకవేళ రుణ గ్రహీత పేరుపై ఏమైనా ఆస్తులు ఉంటే వాటిని బ్యాంకులు తీసుకోవచ్చు. లోన్‌కి సరిపడ సొమ్మును తీసుకుని మిగతా సొమ్మును వారసులకు అప్పగించాల్సి ఉంటుంది. ఒకవేల కో –అప్లికేంట్, గ్యారెంటర్ ఉంటే వాళ్లే లోన్ చెల్లించాల్సి ఉంటుంది. ఇక కో–అప్లికేంట్, గ్యారెంటర్ లేనప్పుడు కుటుంబసభ్యులకు బ్యాంక్ లీగల్ నోటీసులు పంపిస్తుంది. కానీ కుటుంబసభ్యులు చెల్లించాల్సిన అవసరం ఉండదు. ఇటువంటి సమయాల్లో బ్యాంకులు రుణాలను మాఫీ చేస్తూ ఉంటాయి.

# చేసింది చాలు.. ముందు రంజీ ట్రోఫీకి కోచ్‌గా పనిచేయండి..

## గంభీర్‌పై సీనియర్ క్రికెటర్ షాకింగ్ కామెంట్స్



**హైదరాబాద్ పెన్ పవర్:** గౌతమ్ గంభీర్ హెడ్ కోచ్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత జట్టులో ప్రయోగాలు శృతిమించాయన్న విమర్శల ఇటు స్వదేశంలోనూ.. అటూ విదేశాల నుంచి కూడా పెరుగుతూనే ఉన్నాయి. చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్, గంభీర్ కలిసి టీమిండియాను క్రికెట్ ల్యాబ్‌గా మార్చేశారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఒక ప్లానింగ్‌తో కూడిన మార్పులు కాకుండా, అప్పటికప్పుడు తీసుకునే నిర్ణయాలు జట్టును దెబ్బతీస్తున్నాయని ఇప్పటికే చాలా మంది విమర్శనాస్త్రాలు సంధించారు. ఈ క్రమంలో గంభీర్ పై సీనియర్ ప్లేయర్ చేసిన కామెంట్స్ సంచలనంగా మారాయి.

గౌతమ్ గంభీర్ ఇప్పటి వరకు చేసింది చాలు.. ఇక నుంచి రంజీ ట్రోఫీకి కోచ్ గా వ్యవహరిస్తే బాగుంటుంది. రెడ్ బాల్ క్రికెట్ గురించి తెలుసుకోవాలంటే రంజీ చాలా ఉపయోగపడుతుందని సలహా ఇచ్చారు ఇంగ్లండ్ మాజీ స్పిన్నర్ మాంటీ పనేసర్. గంభీర్ వైట్ బాల్ క్రికెట్ లో సక్సెస్ ఫుల్ అయ్యారు కానీ.. రెడ్ బాల్ క్రికెట్ అర్థం చేసుకోవటంలో విఫలమయ్యారు. అందుకోసం రంజీ కోచ్ గా చేస్తే బాగుంటుంది. అక్కడ ఇతర కోచ్ ల తో కలిసి టీమ్ జట్టు కూర్పు ఎలా చేయాలో నేర్చుకోవచ్చునని సలహా ఇచ్చారు. ఇక్కడ చేసింది చాలు.. ఇక రంజీ కోచ్ గా పనిచేయడం మంచిది అనే అర్థంలో షాకింగ్ కామెంట్స్ చేశారు పనేసర్. టెస్టులకు హెడ్ కోచ్ గా ఎమా లక్ష్మణ్ ను తీసుకునేందుకు బీసీసీఐ ఆలోచిస్తోందని.. ఈ విషయంలో లక్ష్మణ్ ను సంప్రదించినట్లు వార్తలు వస్తున్న క్రమంలో పనేసర్ చేసిన కామెంట్స్ ప్రాధాన్యత తంతరించుకున్నాయి. ఇండియా ఇటీవల టెస్టు సిరీస్ లలో చాలా దారుణంగా ఫెయిల్ అయింది. సౌతాఫ్రికాపై సొంత గడ్డపైన కూడా దారుణంగా ఓడిపోవడంతో కోచ్ గంభీర్ పై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కెప్టెన్ శుభ్మన్ గిల్ పై కూడా కీలక వ్యాఖ్యలు చేశారు పనేసర్. గిల్ ట్యాలెంటెడ్ ప్లేయర్ అయినప్పటికీ.. అన్ని ఫార్మాట్ లను లీడ్ చేసేంత కాదని అన్నాడు. కోచ్ గంభీర్ ఆధ్వర్యంలో గిల్ కెప్టెన్సీలో టెస్టు క్రికెట్ లో ఇండియా రెండు వైట్ వాష్ లను మూటగట్టుకుంది. న్యూజీలాండ్ పై 3-0, సౌతాఫ్రికాపై 2-0 తో రెండు వైట్ వాష్ లకు గురికావడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ఈ క్రమంలో గంభీర్ రంజీ కెప్టెన్ గా వ్యవహరించడం ఉత్తమమని పనేసర్ కామెంట్ చేయడం చర్చనీయాంశంగా మారింది.

# ఒకే మ్యాచ్‌లో 8 వికెట్లు.. ప్రపంచ రికార్డు సృష్టించిన యంగ్ స్పిన్నర్ !




**హైదరాబాద్ పెన్ పవర్:** మట్టిలో మాణిక్యాలు అంటారు కదా.. వరల్డ్ క్రికెట్లోకి అలాంటి ప్లేయర్లు అప్పుడప్పుడు ఎంట్రీ ఇస్తుంటారు. చరిత్రను తిరగరాస్తుంటారు. ఈ ప్లేయర్ కూడా అలాంటోడే. ఒకే ఇన్నింగ్స్ లో.. ఒకే మ్యాచ్ లో 8 వికెట్లు తీయటం మామూలు విషయమా. ఇప్పటి వరకు ఎవరూ అందుకోలేని ఫీట్ ను సాధించి ట్రెండ్ సెట్టర్ గా నిలిచాడు సోనమ్ యెషీ. సోషల్ మీడియాలో ఎవరీ సోనమ్ అంటూ ఫుల్లుగా వెతుకుతున్నారు క్రికెట్ అభిమానులు. భూటాన్ కు చెందిన ప్లేయర్ సోనమ్ యెషీ ఇంటర్నేషనల్ టీ20 చరిత్రలో అరుదైన రికార్డును తనఖాతాలో వేసుకున్నాడు. టీ20లో ఒకే మ్యాచ్ లో 8 వికెట్లు తీసిన మొదటి బౌలర్ గా రికార్డు సృష్టించాడు. గెలెపు లో జరిగిన మ్యాచ్ లో మయన్మార్ పై 8 వికెట్లు తీసి చరిత్రను తిరగరాశాడు. ఈ ఇన్నింగ్స్ లో సోనమ్ 4178 తో అద్భుత బౌలర్ గా ప్రపంచం దృష్టిని ఆకర్శించాడు. ఫస్ట్ బ్యాటింగ్ ఆడిన భూటాన్ 127 రన్స్ చేసి.. గెలుపు భారం యెషే పైన వేసింది. టీమ్ నమ్మకాన్ని వమ్ము చేయకుండా జట్టును ఆదుకోవడమే కాదు.. మయన్మ్ బ్యాటింగ్ లైనప్ ను కుప్పకూల్చేశాడు. 3వ ఓవర్ లో ఫస్ట్ బాల్ కే పైయే ఫియో వై ను పెవిలియన్ కు పంపి.. భూటన్ లో ఆశలు కల్పించాడు. ఆ తర్వాత అదే ఓవర్ లో కోకో లిన్, కెప్టెన్ టెట్ అం గ్ లను కూడా పెవిలియన్ కు పంపించేశాడు. వరుసగా వికెట్లు తీస్తుండటంతో డిఫెండ్ చేసుకుందామనుకున్నా.. 9.2 ఓవర్లకు 45రన్స్ మాత్రమే చేయగలిగారు. యెషీ కి ముందు.. 7 వికెట్లు తీయడం అనేది టాప్ సీలింగ్. కొద్ది మంది మాత్రమే ప్రొఫెషనల్ టీ20 క్రికెట్ (అంటే ఇంటర్నేషనల్, స్థానిక, ఫ్రాంచైజ్ లలో ఆడిన కొందరు మాత్రమే7 వికెట్లు సాధించారు.

# రూ.1,500 నుంచి రూ.7 కోట్లు.. భారత క్రికెట్‌లో ఇంత మార్పా?

**పరిస్థితులు ఎప్పుడూ ఒకేలా ఉండవనే దానికి ప్రత్యక్ష ఉదాహరణ భారత క్రికెట్. ఒకప్పుడు క్రికెటర్లు ఉద్యోగాలు చేస్తూనే మ్యాచులు ఆడిన రోజులను చూశాం. ఇప్పుడు ఒక్కసారి జాతీయస్థాయిలో పేరు తెచ్చుకుంటే కాసుల వర్షమే. ఈ సమూల మార్పుల వెనక ఎన్నో కష్టనష్టాలు, ధైర్యవంతమైన నిర్ణయాలు ఉన్నాయనేది కాదనలేని వాస్తవం. మరి టీమ్ఇండియా 'ప్రగతి'పై ఓ లుక్కేద్దాం.**




**హైదరాబాద్ పెన్ పవర్:** మూడు దశాబ్దాలకు ముందు.. భారత జట్టు తరఫున క్రికెట్ ఆడటం గొప్ప గౌరవం. ఇప్పటికీ అలానే ఉన్నా.. అప్పుడు ఆదాయం అంతంతమాత్రమే. అయినా సరే.. ఆటపై ఉన్న ప్యాషన్‌తో బరిలోకి దిగేవారు. ఓ వైపు క్రికెట్ ఆడుతూనే 9-5 ఉద్యోగాలు చేసిన 'స్టార్లూ' ఉన్నారంటే అతిశయోక్తి కాదు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లాడు ఏ డాక్టరో, ఇంజినీరో అయి నాలుగు రాళ్లు సంపాదించుకుంటే చాలని ఆశించేవారు. క్రికెటర్‌గా మారతామంటే కాస్త సంశయం వ్యక్తం చేసేవారు. కానీ, నేటితరం ఆలోచనలు పూర్తిగా మారిపోయాయి. తమ పిల్లలను చిన్నప్పటి నుంచే క్రికెటర్‌గా మార్చేందుకు ప్రస్తుత జనరేషన్ తల్లిదండ్రులు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారంటే భారత క్రికెట్ రూపురేఖలు ఏ స్థాయికి చేరుకున్నాయో అర్థం చేసుకోవచ్చు. ఒకప్పుడు బ్లూచిప్ కంపెనీల్లో ఉద్యోగం సంపాదించి ఐదంకెల జీతం అందుకోవాలని కలలు కనే కుర్రాళ్లు.. 'బ్లూ జెర్సీ' ధరించాలనే లక్ష్యంతో తమ ప్రయత్నాలను ముమ్మరం చేయడం గమనార్హం.

### ఆ గౌరవం వేరు.. ఆ ఆదాయం వేరు

భారత క్రికెట్ అభిమానులకు 1983 వన్డే ప్రపంచ కప్‌ను కపిల్ దేవ్ 'లార్డ్స్'లో ఎత్తుకున్న ఫొటో ఎప్పటికీ గుర్తుంటుంది. కానీ, ఆ రోజుల్లో టీమ్ఇండియా ఆటగాళ్లు అందుకొన్న మొత్తాలను చూస్తే ఎవరైనా ఆశ్చర్యపడాల్సిందే. కపిల్, గావస్కర్ రోజుల్లో ఒక్కో మ్యాచ్‌కు ఫీజుగా రూ.1,500తోపాటు రోజువారీ భత్యం రూ.200 చొప్పున వచ్చేది. అప్పటికి బీసీసీఐ వద్ద ఎలాంటి ఫండ్స్ ఉండేవి కావు. 1983లో భారత క్రికెటర్లకు ఇచ్చిన పేమెంట్‌పై సోషల్ మీడియా వేదికగా ఓ నెటిజన్ పెట్టిన షీట్ ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ. కుటుంబపోషణ కోసం బ్యాంకులు, రైల్వేస్, పబ్లిక్ సెక్టార్‌లో 'స్పోర్ట్స్' కోటాలో పని చేసేవారు. కార్యాలయాలకు వెళ్లాల్సి వచ్చేది. క్రికెట్ దిగ్గజం గావస్కర్ ఓసారి స్పందిస్తూ 'మేం ఎప్పుడైనా టెస్టు క్రికెట్ మ్యాచ్ సరిగా ఆడకపోతే జట్టులో అవకాశం వచ్చేది కాదు. అప్పుడు 9-5 జాబ్‌కు వెళ్లిపోయేవాళ్లం' అని పేర్కొన్నారు.


### అక్కడినుంచే మార్పు..

1990ల్లో భారత్ ఆడే మ్యాచులను ప్రభుత్వ రంగ సంస్థ దూరదర్శన్ మాత్రమే ప్రసారం చేసేది. అదీనూ బీసీసీఐ అక్కడ తమ స్లాట్‌లను బుక్ చేసుకొని మరీ బ్రాడ్‌కాస్ట్ చేయాల్సి వచ్చేది. అంటే బోర్డే ఎదురు డబ్బు ఇచ్చి మ్యాచ్‌లను ప్రజలకు చూపించేది. క్రికెట్‌ను ప్రమోట్ చేయడానికి అలా చేయాల్సి వచ్చేది. ఎప్పుడైతే జగ్‌మోహన్ దాల్మియా బీసీసీఐ అధ్యక్షుడిగా వచ్చారో సమూల మార్పులు చేశారు. బోర్డు అంటే బెగ్గర్ కాదు.. దేశానికి ఎంతో విలువైన కంటెంట్ ఇస్తోన్న యజమాని అని నిరూపించారు. 1993లో భారత్ - ఇంగ్లాండ్ సిరీస్ ప్రసార హక్కులను ట్రాన్స్‌వరల్డ్ ఇంటర్నేషనల్ అనే సంస్థకు 5.50 లక్షల డాలర్లకు విక్రయించారు. అప్పట్నుంచే భారత క్రికెట్ హవా మొదలైంది. ఇక 2000 నాటికి భారత మ్యాచుల ప్రసార హక్కుల విక్రయంతో బిలియన్ డాలర్లను బోర్డు ఆర్జించింది.


### సెంట్రల్ కాంట్రాక్ట్‌ల ఆలోచన..

రెండు దశాబ్దాల ముందు వరకు ఆటగాళ్లకు నిలకడైన ఆదాయం ఉండేది కాదు. మ్యాచ్ ఆడితే ఫీజు, భత్యం రూపంలోనే కాస్త సంపాదన ఉండేది. కానీ, 2004లో బీసీసీఐ ప్లేయర్ల కోసం 'సెంట్రల్ కాంట్రాక్ట్' విధానాన్ని తీసుకొచ్చింది. దీనిద్వారా ఆటపై మరింత దృష్టి పెట్టేందుకు ఆటగాళ్లకు వెసులుబాటు దక్కింది. తొలుత రూ.50 లక్షలు, రూ.30 లక్షలు, రూ.20 లక్షలతో ప్రారంభమైన ఈ విధానం.. ఇప్పుడు సెంట్రల్ కాంట్రాక్ట్ క్రికెటర్‌కు కనీసం రూ. కోటికి చేరుకుంది. ఇక టాప్ గ్రేడ్-ఎ+లో ఉంటే ఏకంగా రూ.7 కోట్లను దక్కించుకోవచ్చు. వీటికి మ్యాచు ఫీజులు అదనం. అవి కూడా తక్కువేం కాదు. ప్రస్తుతం ఒక్కో టెస్టు మ్యాచ్‌కు రూ. 15 లక్షలు (2004లో రూ.2లక్షలు), వన్డేకు రూ.6 లక్షలు, టీ20 మ్యాచ్‌కు రూ.3 లక్షల చొప్పున ఫీజు దక్కనుంది. ఇక దేశవాళీలోనూ కుర్రాళ్లు కూడా కనీసం రూ.17 లక్షల నుంచి రూ.25 లక్షల వరకూ అందుకోవడం విశేషం. దీంతో క్రికెట్‌ను కెరీర్‌గా ఎంచుకునే యువతరానికి కెరీర్‌పై నమ్మకం ఇచ్చినట్లైంది. ఐపీఎల్ ఎంట్రీ (2008)తో భారత క్రికెట్‌కు జోష్ తెచ్చింది. ప్లేయర్లకు కాసుల వర్షం కురిపించింది. ఇక బీసీసీఐ కార్యదర్శిగా జైషా వచ్చాక.. టెస్టు క్రికెట్‌తోపాటు మహిళా క్రికెటర్లను ప్రోత్సహించిన తీరు ఇక్కడ ప్రస్తావించాల్సిందే. ఇప్పుడు వారు కూడా పురుష క్రికెటర్లతో సమంగా భత్యాలను అందుకోగలుగుతున్నారు.

**చివరిగా:** మొన్నటివరకు మా పిల్లాడు పెద్ద జాబ్ చేస్తే చాలనుకొనే తల్లిదండ్రులు.. ఇప్పుడు క్రికెట్‌నూ కెరీర్‌గా ఎంచుకోవాలని ఆశిస్తున్నారు. అభిమానుల్లో ఉండే క్రేజ్ మాత్రమే కాకుండా.. ఆర్జనలోనూ ఉత్తమంగా మారింది. ఇప్పుడంతా వైభవ్ సూర్యవంశీని ఆదర్శంగా తీసుకొనేవారు లేకపోలేదు. సచిన్ 16 ఏళ్ల వయసులో అంతర్జాతీయ క్రికెట్‌లోకి ఎంట్రీ ఇవ్వగా.. 14 ఏళ్ల వయసులోనే వైభవ్ తన ఛాన్స్ కోసం ఎదురుచూస్తున్నాడు. మున్ముందు ఇలాంటి కుర్రాళ్లు మరింతమంది రావాలని ఆకాంక్షిస్తూ.. హ్యాపీ న్యూఇయర్ టు 2026..



# రోషన్ తండ్రిని మించిన తనయుడు అవుతాడా?



పుత్రుడు జనియించినప్పుడు కాదు ఆ పుత్రుడు తండ్రి పేరు నిలబెట్టినప్పుడే ఆ తండ్రి ధన్యుడు అవుతాడు. సాధారణంగా తల్లిదండ్రులు ఏ రంగంలో అయితే సెటిల్ అవుతారో.. అదే రంగంలో తమ పిల్లల్ని కూడా సెటిల్ చేయాలని ప్రయత్నాలు చేస్తూ ఉంటారు. అందులో భాగంగానే సినీ రంగం గురించి ఇప్పుడు ప్రత్యేకంగా చెప్పుకోవాలి. సినీ ఇండస్ట్రీలో హీరోలు, హీరోయిన్లు తమకంటూ ఒక గుర్తింపును తెచ్చుకున్న తర్వాత తమ వారసులకు కూడా అదే స్థాయిని కల్పించాలని చూస్తూ ఉంటారు. అలా తల్లిదండ్రుల వారసత్వంతో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన సెలబ్రిటీలు కొంతమంది తల్లిదండ్రులతో సమానంగా గుర్తింపును సంపాదించుకుంటే.. మరికొంతమంది తల్లిదండ్రులకు మించిన పాపులారిటీ అందుకుని అందరినీ ఆశ్చర్యపరుస్తూ ఉంటారు. ఉదాహరణకు రామ్ చరణ్, ఎన్టీఆర్, ప్రభాస్, అల్లు అర్జున్, మహేష్ బాబు లాంటి హీరోల పేర్లు ప్రధమంగా వినిపిస్తూ ఉంటాయి. తల్లిదండ్రులకు మించిన పాపులారిటీని సొంతం చేసుకొని ఎంతోమందికి ఆదర్శంగా నిలుస్తున్నారు. అలా ఇప్పుడు సినీ బ్యాక్ గ్రౌండ్ తో ఇండస్ట్రీలోకి అడుగు పెడుతున్న కొత్త హీరోలు కూడా ఈ హీరోలను చూసి తమ తల్లిదండ్రులకు మించిన క్రేజ్ దక్కించుకోవాలని ప్రయత్నం చేస్తున్నారు. అలాంటి వారిలో సీనియర్ స్టార్ హీరో శ్రీకాంత్ తనయుడు రోషన్ మేక గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. చైల్డ్ ఆర్టిస్ట్ గా కెరియర్ ను మొదలుపెట్టిన రోషన్ రుద్రమదేవిలో తొలిసారి కనిపించి ఆ తర్వాత నిర్మల కాన్వెంట్ సినిమాలో లీడ్ రోల్ పోషించి ఆకట్టుకున్నారు.

ఆ తర్వాత తన తండ్రి శ్రీకాంత్ 1996లో నటించిన పెళ్లి సందడికి ఆధ్యాత్మిక సీక్వెల్ అయిన పెళ్లి సంద%ణ% మూవీను 2021లో చేసి హీరోగా ఇండస్ట్రీకి పరిచయమయ్యారు. ఇక నాలుగేళ్ల గ్యాప్ తీసుకొని ఇప్పుడు ఛాంపియన్ అంటూ స్పోర్ట్స్ డ్రామా నేపథ్యంలో క్రిస్మస్ సందర్భంగా ప్రేక్షకుల ముందుకు వచ్చారు. ఈ సినిమా మంచి విజయం అందుకుంది .ఈ సినిమా సక్సెస్ తో అప్పుడే బడా నిర్మాణ సంస్థ గీత ఆర్ట్స్ అధినేత అల్లు అరవింద్ రోషన్ మేకకు తన బ్యానర్ లో సినిమా చేసే అవకాశాన్ని కల్పించారు. ఇక దీన్ని బట్టి చూస్తే ఒక్క సినిమా ఈయనకు భారీ విజయాన్ని అందించడమే కాకుండా వరుస అవకాశాలు అందిస్తోంది అనే కామెంట్లు కూడా వ్యక్తం అవుతున్నాయి. అంతేకాదు సితార ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ లో కూడా మరో ప్రాజెక్టు ఓకే అయింది. ఇలా వరుసగా అగ్ర నిర్మాణ సంస్థలతో అవకాశం రావడంతో టాలీవుడ్ లో రోషన్ క్రేజ్ మరింత పెరిగిపోయిందని చెప్పాలి. ఇకపోతే విభిన్నమైన కథలను ఎంచుకుంటూ ప్రేక్షకులను ఆకట్టుకోవడానికి ప్రయత్నం చేస్తున్న రోషన్ ఈ బ్యానర్లలో సినిమాలు చేసి సక్సెస్ అందుకున్నారంటే ఖచ్చితంగా మరిన్ని బడా ప్రాజెక్టులు ఈయన తలుపు తడతాయి. ఒకవేళ అవన్నీ కూడా కలిసొచ్చాయి అంటే తండ్రి శ్రీకాంత్ ను మించిన తనయుడు అవుతాడు అనడంలో సందేహం లేదు అంటూ ఫ్యాన్స్ కామెంట్లు చేస్తున్నారు. మరి ఈ మాటను రోషన్ నిలబెట్టుకుంటారో లేదో చూడాలి.



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965